www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

RAMRAJ
కాటన్
భారతీయ సంస్కృతి

ఆదివారం | 5-1-2025 | పేజీలు: 14 + 2025 క్యాలెండర్ | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 278 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి రా. 8.16 తదుపరి సప్తమి; నక్షత్రం: పూర్వాభాద్ర రా. 8.18 తదుపరి ఉత్తరాభాద్ర; వర్జ్యం: తె.5.25 మొదలు; దుర్ముహూర్తం: సా.4.22-5.06; అమృతఘడియలు: మ.12.39-2.11; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.50 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● ఆదివారం 5 జనవరి 2025

సిడ్నీ సమరం

ఉత్కంఠగా ఐదో టెస్ట్

రసవత్తరం!


బొలాండ్ (4/42)


ప్రసిద్ధ్ (3/42)

పంత్ దూకుడు
బొలాండ్ నిప్పులు

- భారత్ రెండో ఇన్నింగ్స్ 141/6
- ప్రస్తుత ఆధిక్యం 145
- ఆసీస్ తొలి ఇన్నింగ్స్181 ఆలౌట్


సిరాజ్ (3/51)


రిషభ్ పంత్ (33 బంతుల్లో 61)

సిడ్నీ: ఒకవైపు డాషింగ్ బ్యాటర్ రిషబ్ పంత్ (33 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61) దనాదన్ అర్ధ శతకంతో సత్తా చాటితే.. మరోవైపు బొలాండ్ (4/42) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో టాపార్డర్‌ను దెబ్బ కొట్టాడు. ఫలితంగా ఆఖరిదైన ఐదో టెస్ట్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. నాలుగు పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్ శనివారం ఆట ముగిసేసరికి 141/6 స్కోరు చేసింది. జడేజా (8), వాషింగ్టన్ సుందర్ (6) క్రీజులో ఉన్నారు. యశస్వి జైస్వాల్ (22), రాహుల్ (13), గిల్ (13), కోహ్లీ (6) పెవిలియన్ చేరారు. మొత్తంగా టీమిండియా 145 పరుగుల ఆధిక్యంలో ఉంది. కెప్టెన్ బుమ్రా ఫిట్‌నెస్‌పై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో.. భారత్ వీలైనన్ని ఎక్కువ పరుగులు సాధిస్తేనే విజయావకాశాలు మెరుగుపడతాయి. ఇక జట్టుకు గెలవగలిగే స్కోరును అందించే బాధ్యత జడ్డూ-సుందర్ జోడీపైనే. ఇక, ఆటకు రెండోరోజు ఓవర్‌నైట్ స్కోరు 9/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా 181 పరుగుల ఆలౌటైంది. వెబ్‌స్టర్ (57), స్మిత్ (33) రాణించారు. ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. బుమ్రా, నితీశ్ రెండేసి వికెట్లు తీశారు. కాగా, వెన్నునొప్పితో బుమ్రా మైదానం వీడడంతో కోహ్లీ తాత్కాలికంగా సారథ్య బాధ్యతలు చేపట్టాడు. ఈ సమయంలో కృష్ణ, నితీశ్.. బుమ్రా లేని లోటు కనిపించకుండా చేయడంతోపాటు 4 పరుగుల ఆధిక్యాన్ని అందించి జట్టు నైతిక స్థైర్యాన్ని పెంచారు. మొత్తంగా రెండో రోజు ఆటలో 314 పరుగులు నమోదవగా.. 15 వికెట్లు నేలకూలాయి. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 185 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

బుమ్రా లేకపోయినా..: తొలి రెండు సెషన్లపాటు బ్యాటింగ్ చేసిన ఆసీస్‌కు ఆధిక్యం దక్కకుండా భారత బౌలర్లు సమర్థంగానే నిలువరించారు. ఆరంభంలోనే లబుషేన్ (2)ను క్యాచవుట్ చేసిన బుమ్రా ఆసీస్ పతకానికి నాంది పలికాడు. మరోవైపు పిచ్ నుంచి స్వింగ్ లభించడంతో సిరాజ్ ఒక్కసారిగా ఆసీస్ బ్యాటర్లను భయపెట్టాడు. 12వ ఓవర్‌లో ఓపెనర్ కాన్‌స్టాస్ (23), హెడ్ (4)ను అవుట్ చేసి షాకిచ్చాడు. 39/4తో జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు స్మిత్, వెబ్‌స్టర్ ఐదో వికెట్ 57 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, లంచ్‌కు ముందు స్మిత్‌ను కృష్ణ క్యాచవుట్ చేయడంతో ఆసీస్ 101/5తో నిలిచింది. అలెక్స్ క్యారీ (21), వెబ్‌స్టర్ వేగంగా ఆడే ప్రయత్నం చేశారు. కానీ, వీరిద్దరినీ కూడా వెనక్కుపంపిన కృష్ణ ఆసీస్‌కు పగ్గాలేశాడు. కమిన్స్ (10), స్టార్క్ (1)ను నితీశ్ పెవిలియన్ చేర్చగా.. బొలాండ్ (9)ను బౌల్డ్ చేసిన సిరాజ్ కంగారూల ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

టాప్ తడబాటు..: చివరి సెషన్‌లో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత జట్టుకు పంత్ ఆటే హైలైట్. ఓపెనర్లు జైస్వాల్, రాహుల్ తొలి వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యంతో దూకుడైన ఆరంభాన్నిచ్చారు. అయితే, 5 పరుగుల తేడాతో వీరిద్దరినీ బొలాండ్ బౌల్డ్ చేయడంతో టీమిండియా తడబడింది. బొలాండ్ బౌలింగ్‌లో కోహ్లీ ఆఫ్‌స్టంప్‌పై పడిన బంతిని ఆడి స్లిప్‌లో స్మిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. విరాట్ ఇలా అవుటవడం వరుసగా ఎనిమిదోసారి. క్రీజులో కుదురుకొంటున్న గిల్‌ను వెబ్‌స్టర్ వెనక్కిపంపాడు. 78/4తో టాపార్డర్‌ను కోల్పోయి ఇబ్బందుల్లోపడ్డ సమయంలో క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ టీ20 తరహా ఆటతో స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలచి వావ్ అనిపించాడు. తన సహజ శైలిలో విరుచుకుపడ్డ రిషభ్.. ఆసీస్ బౌలర్లను ఆత్మరక్షణలోకి నెట్టాడు. వెబ్‌స్టర్ బౌలింగ్‌లో మూడు వరుస బౌండ్రీలతో జోష్ నింపిన పంత్.. స్టార్క్ బౌలింగ్‌లో సిక్స్‌తో అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. ఆ వెంటనే మరో సిక్స్ బాదాడు. అయితే, కమిన్స్ బౌలింగ్‌లో దూరంగా వెళ్లే బంతిని వెంటాడి అవుటయ్యాడు. నితీశ్ (4) మరోసారి నిరాశపర్చాడు.

148 ఏళ్లలో ఒకే ఒక్కడు

ఆసీస్ గడ్డపై వేగవంతమైన అర్ధ శతకం చేసిన విదేశీ బ్యాటర్‌గా రిషభ్ పంత్ చరిత్ర సృష్టించాడు. దూకుడుగా ఆడిన పంత్ 29 బంతుల్లోనే ఫిఫ్టీ మార్క్ చేరుకొన్నాడు. ఈ క్రమంలో 148 ఏళ్ల ఆసీస్ టెస్ట్ చరిత్రలో ఇక్కడ 30 బంతుల్లోపే హాఫ్ సెంచరీ చేసిన పర్యాటక జట్టు ఆటగాడిగా నిలిచాడు. గతంలో ఇంగ్లండ్ మాజీ ఆటగాడు జాన్ బ్రౌన్ (1895), విండీస్ మాజీ క్రికెటర్ రాయ్ ఫ్రెడిరిక్ (1975) 33 బంతుల్లోనే చేసిన అర్ధ సెంచరీ రికార్డులను పంత్ బద్దలుకొట్టాడు. టెస్టుల్లో వేగవంతమైన ఫిఫ్టీ చేసిన రెండో భారత బ్యాటర్‌గానూ నిలిచాడు.

బుమ్రాకు వెన్నునొప్పి



బుమ్రా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. లంచ్ తర్వాత ఒక్క ఓవర్ మాత్రమే వేసిన అతడు అర్ధంతరంగా మైదానం వీడాడు. వెంటనే ఆసుపత్రికి వెళ్లి స్కానింగ్ చేయించుకొన్నాడు. మూడో సెషన్ ఆఖర్లో మళ్లీ తిరిగి వచ్చాడు. అయితే, అతడి గాయం తీవ్రతపై స్పష్టమైన సమాచారం లేదు. కానీ, ఆటముగిసిన తర్వాత నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బుమ్రా వెన్నునొప్పితో బాధపడుతున్నట్టు ప్రసిద్ధ్ కృష్ణ తెలిపాడు. బుమ్రా బౌలింగ్ చేసే విషయమై వైద్యులు ఆదివారం స్పష్టత నివ్వనున్నారు. బ్యాటింగ్ చేయడంలో అతడికి ఎలాంటి ఇబ్బందులూ లేవని తెలుస్తోంది. గతంలో బుమ్రా వెన్నెముకకు శస్త్రచికిత్స చేయించుకొన్న సంగతి తెలిసిందే.

తొలి భారత బౌలర్‌గా..

విదేశీగడ్డపై ఓ సిరీస్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా బుమ్రా రికార్డు నెలకొల్పాడు. లబుషేన్‌ను అవుట్ చేసిన బుమ్రా.. 32వ వికెట్‌ను తన ఖాతాలో వేసుకొన్నాడు. ఈ క్రమంలో 1977-78 పర్యటనలో బిషన్ సింగ్ బేదీ (31 వికెట్లు), భగవత్ చంద్రశేఖర్ (28 వికెట్లు)ను బుమ్రా అధిగమించాడు. కాగా, భారత్-ఆసీస్ మధ్య జరిగిన సిరీస్‌లో అత్యధికంగా 32 వికెట్లు పడగొట్టిన హర్భజన్ రికార్డును బుమ్రా సమం చేశాడు. 2001 భారత పర్యటనలో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో భజ్జీ ఈ ఫీట్ సాధించాడు.


నితీశ్ (2/32)

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 185 ఆలౌట్.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: కాన్‌స్టాస్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 23, ఖవాజా (సి) రాహుల్ (బి) బుమ్రా 2, లబుషేన్ (సి) పంత్ (బి) బుమ్రా 2, స్మిత్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్ 33, హెడ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 4, వెబ్‌స్టర్ (సి) జైస్వాల్ (బి) ప్రసిద్ధ్ 57, క్యారీ (బి) ప్రసిద్ధ్ 21, కమిన్స్ (సి) కోహ్లీ (బి) నితీశ్ 10, స్టార్క్ (సి) రాహుల్ (బి) నితీశ్ 1, లియోన్ (నాటౌట్) 7, బొలాండ్ (బి) సిరాజ్ 9; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 51 ఓవర్లలో 181 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-9, 2-15, 3-35, 4-39, 5-96, 6-137, 7-162, 8-164, 9-166, 10-181; **బౌలింగ్:** బుమ్రా 10-1-33-2, సిరాజ్ 16-2-51-3, ప్రసిద్ధ్ కృష్ణ 15-3-42-3, నితీశ్ కుమార్ 7-0-32-2, జడేజా 3-0-12-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) బొలాండ్ 22, రాహుల్ (బి) బొలాండ్ 13, గిల్ (సి) క్యారీ (బి) వెబ్‌స్టర్ 13, కోహ్లీ (సి) స్మిత్ (బి) బొలాండ్ 6, పంత్ (సి) క్యారీ (బి) కమిన్స్ 61, జడేజా (బ్యాటింగ్) 8, నితీశ్ (సి) కమిన్స్ (బి) బొలాండ్ 4, సుందర్ (బ్యాటింగ్) 6; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 32 ఓవర్లలో 141/6; వికెట్లపతనం:** 1-42, 2-47, 3-59, 4-78, 5-124, 6-129; **బౌలింగ్:** స్టార్క్ 4-0-36-0, కమిన్స్ 11-4-31-1, బొలాండ్ 13-3-42-4, వెబ్‌స్టర్ 4-1-24-1.



రిటైర్మెంట్ కాదు

- ఫామ్‌లో లేను
- అందుకే వైదొలిగా
- రోహిత్ స్పష్టీకరణ

సిడ్నీ: కెప్టెన్ రోహిత్ శర్మ నిశ్శబ్దాన్ని వీడాడు. తన రిటైర్మెంట్‌పై పెద్ద ఎత్తున వస్తున్న ఊహాగానాలకు చెక్ పెట్టాడు. పేలవ ఫామ్ వల్లే సిడ్నీ టెస్ట్ నుంచి వైదొలిగానని స్పష్టం జేశాడు. 'నేను రిటైర్ కాలేదు. ఐదో టెస్ట్ నుంచి పక్కకు తప్పుకొన్నానంతే. కోచ్, సెలెక్టర్లతో నేను పెద్దగా చర్చించింది ఏమీ లేదు. నేను ఆశించిన స్థాయిలో పరుగులు చేయడంలేదు. సిడ్నీ మ్యాచ్ మాకు ఎంతో ముఖ్యమైనది. అందువల్ల ఫామ్‌లో ఉన్న ఆటగాడిని ఆడించాల్సి వచ్చింది' అని శనివారం ఇక్కడ ఓ క్రీడా చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో రోహిత్ వెల్లడించాడు. 'నా రిటైర్మెంట్‌పై పుంఖానుపుంఖాలుగా వార్తలొస్తున్నాయి. కానీ నేను వీడ్కోలు నిర్ణయం తీసుకోలేదు. ఐదు నెలలుగా పరిస్థితులు అనుకూలించడంలేదు. క్రికెట్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూశా. జీవితం రోజురోజుకు.. నిమిషానికి మారుతుంటుంది. అయితే పరిస్థితులు కూడా మారతాయని బాగా నమ్ముతా. అదే సమయంలో మనం వాస్తవికంగా కూడా ఆలోచించాలి' అని రోహిత్ వ్యాఖ్యానించాడు. 'ఫామ్‌లో లేని ఆటగాళ్లు జట్టులో ఎక్కువమంది ఉండకూడదని ఆలోచించా. అంతేతప్ప జట్టును వీడి నేను ఎక్కడికీ వెళ్లడంలేదు' అని ప్రకటించాడు. తన స్థానంలో సారథిగా వ్యవహరిస్తున్న బుమ్రాపై రోహిత్ ప్రశంసలు కురిపించాడు. 'బంతితో అతడు అద్భుతంగా రాణిస్తున్నాడు. 2013లో బుమ్రాను మొదటిసారి చూసినప్పటికీ ఇప్పటికీ అతడు ఎంతో ఎత్తుకు ఎదిగాడు' అని కొనియాడాడు.



చాహల్ దంపతులు విడిపోతున్నారా?

న్యూఢిల్లీ: టీమిండియా క్రికెటర్ యజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ దంపతులు తమ వివాహ బంధానికి ముగింపు పలుకనున్నారా? అంటే.. తాజా పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో తమ ఖాతాలను అన్‌ఫాలో చేసుకున్న ఈ జంట.. ఇప్పుడు పెళ్లికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను కూడా తొలగించారు. దీంతో ఇద్దరూ విడిపోతున్నారన్న చర్చ ఊపందుకుంది. అంతేకాదు..కొద్ది నెలలుగా వీరు విడివిడిగా ఉంటున్నారని సమాచారం. ప్రముఖ యూట్యూబర్, కొరియోగ్రాఫర్ అయిన ధనశ్రీని చాహల్ 2020లో పెళ్లి చేసుకున్నాడు.

రహమత్ శతకం

అఫ్ఘానిస్థాన్ 291/7

బులవాయో: రహమత్ షా శతకం (139)తో కదం తొక్కడంతో జింబాబ్వేతో రెండో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో శనివారం ఆట నిలిపివేసే సరికి అఫ్ఘానిస్థాన్ 291/7 స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 46/3తో మూడో రోజు ఆట కొనసాగించిన అఫ్ఘాన్ ఓ దశలో 136/6తో నిలిచింది. కానీ ఇస్మాత్ ఆలం (64 బ్యాటింగ్)తో కలిసి షా ఏడో వికెట్‌కు 132 పరుగులు జోడించడంతో కోలుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో అఫ్ఘాన్ 157 రన్స్ చేయగా, జింబాబ్వే 243 పరుగులకు ఆలౌటైంది.

ఇంటివాడు కానున్న కార్ల్‌సన్!



నార్వే: ప్రపంచ చెస్ నెంబర్‌వన్ ఆటగాడు, ఐదుసార్లు వరల్డ్ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ ఓ ఇంటివాడు కాబోతున్నాడు. తన ప్రేయసి, 26 ఏళ్ల ఎల్లా విక్టోరియాను కార్ల్‌సన్ త్వరలో పెళ్లి చేసుకోనున్నాడని ఇక్కడి మీడియా వెల్లడించింది. అతికొద్ది మంది సమక్షంలో ఈ వేడుకను జరుపుకోవాలని కార్ల్‌సన్ నిర్ణయించుకున్నట్టు సదరు మీడియా తెలిపింది. 34 ఏళ్ల కార్ల్‌సన్ ఇటీవల ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్‌లో నెపోమ్నియాచి (రష్యా)తో కలిసి సంయుక్త విజేతగా నిలిచాడు.

రికెల్టన్ 'డబుల్'

దక్షిణాఫ్రికా 615 ఆలౌట్



కేప్‌టౌన్: ఓపెనర్ రికెల్టన్ (259) ద్విశతకం, వెరీనే (100) సెంచరీతో చెలరేగడంతో పాకిస్థాన్‌తో రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 615 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 316/4తో శనివారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన సఫారీ జట్టులో రికెల్టన్, వెరీనేతో పాటు యాన్సెన్ (62), కేశవ్ మహరాజ్ (40) కూడా సత్తా చాటడంతో వరుసగా రెండో రోజూ 300కు పైగా పరుగులు చేయగలిగింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ చేపట్టిన పాకిస్థాన్ వర్షంతో రెండోరోజు ఆట నిలిపి వేసే సరికి 64/3తో కష్టాల్లో పడింది.

బిజినెస్

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్

కొత్త ప్లాంట్


నాగేశ్వర రావు

- హైదరాబాద్ సమీపంలో ఏర్పాటు
- తొలి దశలో రూ.130 కోట్ల పెట్టుబడి
- 6న పబ్లిక్ ఇష్యూ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ.. స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్.. తెలంగాణలో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్ సమీపంలోని బొంతపల్లి వద్ద 36 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్లు శనివారం నాడిక్కడ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నాగేశ్వర రావు కందుల వెల్లడించారు. రూ.300 కోట్ల పెట్టుబడితో మొత్తం తొమ్మిది లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. తొలి దశలో రూ.130 కోట్ల పెట్టుబడితో 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పనున్న ఈ ప్లాంట్‌ను 15 నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు రావు చెప్పారు. ఈ ప్లాంట్‌లో ఆయిల్ అండ్ గ్యాస్, ఎడిబల్ ఆయిల్స్, ఫుడ్ అండ్ బెవరేజెస్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఎక్విప్‌మెంట్స్‌ను తయారు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కాగా కంపెనీ ఇప్పటికే హైదరాబాద్‌లో మొత్తం 9 ప్లాంట్లను నిర్వహిస్తోందన్నారు. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన ఉత్పత్తులను ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ ఏడాది రూ.700 కోట్ల రెవెన్యూ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో కంపెనీ రెవెన్యూ రూ.700 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు నాగేశ్వర రావు తెలిపారు. 2023-24లో కంపెనీ రెవెన్యూ రూ.549.68 కోట్లుగా ఉంది. కంపెనీ ఏటా 20 శాతం వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని, రానున్న సంవత్సరాల్లో ఇదే వృద్ధిని కొనసాగించ వచ్చని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీ ఆర్డర్ బుక్ రూ.450 కోట్లుగా ఉందన్నారు. కాగా కంపెనీలో జపాన్‌కు చెందిన ఏజీఐ గ్లాస్ రూ.132 కోట్లు పెట్టుబడిగా పెట్టిందన్నారు.

ఐపీఓ షేరు ధర రూ.133-140

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్.. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) జనవరి 6న ప్రారంభమైన 8న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూ.10 ముఖ విలువతో కూడిన ఒక్కో షేరు ధరను రూ.133-140గా ఖరారు చేసింది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ.210 కోట్ల మొత్తానికి కొత్తగా ఈక్విటీ షేర్లను జారీ చేయనుండగా ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్, ఇతర వాటాదారులు.. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.200.05 కోట్ల మొత్తానికి సమానమైన 1,42,89,367 షేర్లను విక్రయించనున్నారు.

రూ.14 లక్షల కోట్లు

పదేళ్ల గరిష్ఠానికి ప్రవాసుల డిపాజిట్లు

అధిక వడ్డీ రేట్లు, బలహీన రూపాయి నేపథ్యంలో దేశీయ బ్యాంకుల్లో జోరుగా సొమ్ము జమ



న్యూఢిల్లీ: ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) మన బ్యాంక్‌ల్లో భారీగా సొమ్ము జమ చేసుకుంటున్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తాజా డేటా ప్రకారం.. 2024 అక్టోబరు నాటికి భారత బ్యాంకుల్లో జమైన ఎన్ఆర్ఐల డిపాజిట్లు వార్షిక ప్రాతిపదికన 13.4 శాతం వృద్ధితో పదేళ్ల గరిష్ఠ స్థాయి 16,270 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.13.83 లక్షల కోట్లు) పెరిగాయి. గత తొమ్మిదేళ్లలో ఇదే అత్యధిక వార్షిక వృద్ధి రేటు. అంతర్జాతీయంగా మిగతా బ్యాంకులతో పోలిస్తే భారత్‌లోని బ్యాంకులు అధిక వడ్డీ రేటు ఆఫర్ చేస్తుండటంతో పాటు ఈమధ్య కాలంలో రూపాయి మారకం విలువ గణనీయంగా తగ్గడంతో ఎన్ఆర్ఐలు స్వదేశీ బ్యాంక్‌ల్లో సొమ్ము జమ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో అక్టోబరుతో ముగిసిన 7 నెలల్లో ఎన్ఆర్ఐలు మన బ్యాంకుల్లో నికరంగా 1,190 కోట్ల డాలర్లు (రూ.1.01 లక్షల కోట్లు) డిపాజిట్ చేశారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023-24) మొత్తానికి 1,470 కోట్ల డాలర్ల ఎన్ఆర్ఐ డిపాజిట్లు దేశీయ బ్యాంకుల్లోకి వచ్చాయి.

ప్రస్తుతం దేశీయ బ్యాంకులు డిపాజిట్ల వేటలో ఉన్నాయి. రుణ డిమాండ్ తగ్గ నిధులు లేక డిపాజిట్లను పెంచుకునేందుకు వీలైనన్ని మార్గాలను అన్వేషిస్తున్నాయి. అందులో భాగంగానే బ్యాంకులు ఎన్ఆర్ఐల నుంచి భారీగా డిపాజిట్ల సమీకరణపై దృష్టిసారించాయి. రూపాయి బలహీనపడుతుండటంతో ప్రవాసులు దేశీయ బ్యాంకుల్లో దాచుకోవడమే కాకుండా స్వదేశంలోని సంబంధీకులకు భారీ మొత్తాల్లో డబ్బు పంపిస్తున్నారు. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం.. గత ఏడాది ఎన్ఆర్ఐలు రెమిటెన్స్‌ల రూపంలో 12,900 కోట్ల డాలర్ల (రూ.10.96 లక్షల కోట్లు) భారత్‌కు పంపారు. గత ఏడాదికి అత్యధిక రెమిటెన్స్‌లు అందుకున్న దేశాల్లో భారత్ తన అగ్రస్థానాన్ని మరోసారి నెలబెట్టుకుంది.

3 రకాల ఖాతాలు అందుబాటులో..

విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు దేశీయ బ్యాంకుల్లో సొమ్ము దాచుకునేందుకు ప్రధానంగా మూడు రకాల ఖాతాలు అందుబాటులో ఉన్నాయి. అందులో మొదటిది.. ఫారిన్ కరెన్సీ నాన్ రెసిడెంట్ బ్యాంక్ (ఎఫ్‌సీఎన్ఆర్-బీ) అకౌంట్. రెండోది.. నాన్ రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ (ఎన్ఆర్ఈ) అకౌంట్. మూడోది నాన్ రెసిడెంట్ ఆర్డినరీ (ఎన్ఆర్ఓ) అకౌంట్. కాగా, ఎఫ్‌సీఎన్ఆర్ (బీ) డిపాజిట్లను విదేశీ కరెన్సీలోనే జమ చేయాల్సి ఉంటుంది. ఆ సొమ్మును రూపాయల్లోకి మార్చుకునే వీలుండదు. ఎన్ఆర్ఈ అకౌంట్ మాత్రం విదేశాల్లో ఆర్జించిన సొమ్మును భారత కరెన్సీలో జమ చేసేందుకు వీలు కల్పిస్తుంది. ఎన్ఆర్ఓ అకౌంట్ ద్వారా ప్రవాసులు స్వదేశంలో ఆర్జించిన సొమ్మును రూపాయల్లోనే ఆదా చేసుకునేందుకు వీలుంటుంది.

ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్లలో 50 శాతం వృద్ధి

2024 అక్టోబరుతో ముగిసిన ఏడాది కాలంలో ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్లు ఏకంగా 50 శాతం వృద్ధి చెందాయి. ప్రవాసుల మొత్తం డిపాజిట్లలో ఎఫ్‌సీఎన్ఆర్(బీ) ఖాతాల్లోని సొమ్ము వాటా 8 ఏళ్ల గరిష్ఠ స్థాయి దాదాపు 20 శాతానికి చేరుకుంది. భారత బ్యాంకులు అధిక వడ్డీ ఆఫర్ చేస్తుండటం ఇందుకు ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ ఖాతాల్లోని సొమ్ము ఎక్స్ఛేంజ్ రేటు హెచ్చుతగ్గుల నుంచి రక్షణ కల్పిస్తాయి. అంతేకాదు, ఈ డిపాజిట్లలోని అసలు, వడ్డీపై భారత్‌లో పన్ను కట్టాల్సిన పనిలేదు. పైగా, పూర్తిగా వెనక్కి తీసుకునే సౌలభ్యమూ ఉంటుంది. కాగా, రూపాయి క్షీణత కారణంగా ఎన్ఆర్ఈ ఖాతాల్లో డిపాజిట్లు గణనీయంగా పెరిగాయని బ్యాంకులంటున్నాయి.

ఆర్‌బీఐ పసిడితంత్ర!

భారీగా బంగారం పోగేస్తున్న రిజర్వ్ బ్యాంక్

ముంబై: సగటు భారతీయులకే కాదు.. మన దేశ సెంట్రల్ బ్యాంకైన భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కూ పసిడిపై మక్కువే. ఈ మధ్య కాలంలో ఆర్‌బీఐ బంగారం కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. గత అక్టోబరు, నవంబరులో మరో 20 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో మొదటి 8 నెలల్లో (ఏప్రిల్-నవంబరు) ఆర్‌బీఐ 50 టన్నుల బంగారం పోగేసింది. దీంతో రిజర్వ్ బ్యాంక్ వద్దనున్న మొత్తం బంగారం నిల్వలు 876.18 టన్నులకు పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో పసిడి ధరలు 19 శాతం మేర పెరిగినప్పటికీ, అక్టోబరు-నవంబరు కాలంలో కాస్త నిలకడగానే కొనసాగాయి. దాంతో ఆర్‌బీఐ కొనుగోళ్లను పెంచింది.

విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వల వివిధీకరణ వ్యూహంలో భాగంగానే ఆర్‌బీఐ పసిడి నిల్వలను పెంచుకుంటోంది. ఎందుకంటే, విదేశీ కరెన్సీలు ప్రధానంగా డాలర్ విలువలో హెచ్చుతగ్గులు మన ఫారెక్స్ నిల్వలపై చూపే ప్రభావాన్ని తగ్గించుకునేందుకు బంగారం నిల్వలు దోహదపడనున్నాయి. గత నెల 27తో ముగిసిన వారంలో భారత్ వద్ద విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు 411 కోట్ల డాలర్ల మేర తగ్గి 64,027 కోట్ల డాలర్లకు పరిమితమైనట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ నిల్వలు 847 కోట్ల డాలర్ల మేర తగ్గాయి. 2024 సెప్టెంబరు చివర్లో ఆల్‌టైం రికార్డు స్థాయి 70,488 కోట్ల డాలర్లకు పెరిగిన ఫారెక్స్ నిల్వలు.. గత కొన్ని వారాలుగా నిల్వలు క్షీణిస్తూ వస్తున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	525
వరంగల్	502	గోదావరి	525
చిత్తూరు	543	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	108	విజయవాడ	113
వరంగల్	108	గుంటూరు	110
కరీంనగర్	108	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	108	చిత్తూరు	84
కర్నూలు	108	నెల్లూరు	88
విశాఖపట్నం	102	అనంతపురం	88
గోదావరి	113		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,710 ▼	72,150 ▼	99,000 ▼
విజయవాడ	79,500 ▼	75,000 ▼	90,000 ▼
విశాఖపట్నం	77,540 ▼	71,080 ▼	89,330 ▼
రాజమండ్రి	78,710 ▼	72,150 ▼	90,300 ▼
ప్రొద్దుటూరు	78,950 ▲	73,110 ▼	90,500 ▲
ముంబై	77,504 ▲	70,994 ▲	88,221 ▲

రెస్టారెంట్ సేవలు- జీఎస్‌టీ మార్పులు



రాంబాబు గొండాల

ఇటీవల జరిగిన జీఎస్‌టీ కౌన్సిల్ 55వ సమావేశంలో రెస్టారెంట్ సర్వీసులకు సంబంధించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవటం జరడింది. ఆ వివరాలు..

సాధారణంగా హోటల్‌లో రెండు రకాల సర్వీస్‌లు లభిస్తాయి. మొదటిది అకామిడేషన్ సర్వీస్.. అంటే రూమ్ అద్దెకి ఇవ్వటం, రెండోది రెస్టారెంట్ సర్వీస్. అంటే భోజన ఫలహారాలు అందించటం. కొన్ని చోట్ల రెండు సర్వీస్‌లు కలిపి ఉండవచ్చు లేదా విడివిడిగా ఉండవచ్చు. రూములతో సంబంధం లేకుండా కేవలం భోజన ఫలహారాలు అందించే హోటల్ లేదా రెస్టారెంట్స్‌ను 'స్టాండ్‌అలోన్' రెస్టారెంట్ అంటారు. అంటే ఇందులో అకామిడేషన్ సర్వీస్ ఉండదు. కేవలం రెస్టారెంట్ సర్వీస్ మాత్రమే ఉంటుంది. ఇటువంటి రెస్టారెంట్లలో జీఎస్‌టీ 5 శాతం వర్తిస్తుంది. వీళ్లు క్యాటరింగ్ సర్వీస్ చేసినా 5 శాతం జీఎస్‌టీ చెల్లిస్తే సరిపోతుంది. ఇది చాలా సులభం. ఇందులో ఎలాంటి సమస్యా లేదు. వచ్చిన చిక్కల్లా హోటల్‌లో భాగంగా ఉండే రెస్టారెంట్‌లోనే. అంటే పైన చెప్పినట్లు రెండు సర్వీస్‌లు కలిసి ఉన్నప్పుడే. ఇక్కడ రెస్టారెంట్‌లో జీఎస్‌టీ అనేది ఆ హోటల్‌లోని రూమ్ అద్దె ధర మీద ఆధారపడి ఉంటుంది.

ఒక హోటల్‌లో రకరకాల రూములు ఉంటాయనే సంగతి తెలిసిందే. స్టాండర్డ్, ఎగ్జిక్యూటివ్, డీలక్స్ సూట్ రూమ్ ఇలా. వీటిలో ఏదేనీ రూమ్ డిక్లేర్డ్ టారిఫ్ రోజుకు రూ.7,500 మించి ఉంటే ఇలాంటి హోటల్‌ను స్పెసిఫైడ్ ప్రెమిసెస్ అంటారు. ఇలా స్పెసిఫైడ్ ప్రెమిసెస్ కిందకు వచ్చే హోటల్‌లోని రెస్టారెంట్లకు 18 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది. ఒకవేళ ఆ హోటల్ స్పెసిఫైడ్ ప్రెమిసెస్ కిందకు రాకుంటే అప్పుడు మామూలు జీఎస్‌టీ 5 శాతమే వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక హోటల్‌లో 20 రూములు ఉన్నాయి. అందులో ఒకటి సూట్ రూమ్ కాగా, మిగతావి సాధారణ రూములు అనుకుందాం. సూట్ రూమ్ అద్దె రోజుకు రూ.8,000 అనుకుంటే ఆ హోటల్ స్పెసిఫైడ్ ప్రెమిసెస్ అవుతుంది. అంటే రూ.7,500 కంటే ఎక్కువ అద్దె తీసుకునే రూమ్ ఒక్కటే ఉన్నా, దాని బుకింగ్స్ తక్కువ ఉన్నా ఆ రెస్టారెంట్‌లోని సర్వీస్ మీద 18 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది.

అలాగే అద్దె కూడా వాస్తవంగా తీసుకునే అద్దె కాకుండా 'డిక్లేర్డ్ టారిఫ్' ప్రకారం లెక్కించాలి. 'డిక్లేర్డ్ టారిఫ్' అంటే లిస్ట్‌లో లేదా టారిఫ్ కార్డులో లేదా ఇతర ప్రదేశాల్లో ప్రకటించే ధర. ఉదాహరణకు ఒక హోటల్ వెబ్‌సైట్‌లో లేదా టారిఫ్ కార్డులో రూము ధర రూ.7,500 కంటే ఎక్కువ ఉండవచ్చు. డిస్కౌంట్ పోనూ రూము వాస్తవ ధర రూ.7,500 కంటే తక్కువ ఉండొచ్చు. అయినా ఆ హోటల్ స్పెసిఫైడ్ ప్రెమిసెస్ కిందకే వస్తుంది. కేవలం టారిఫ్ కార్డులోని ధరను బట్టి (అంటే డిక్లేర్డ్ టారిఫ్) ఆ హోటల్‌ను స్పెసిఫైడ్ ప్రెమిసెస్‌గా గుర్తించటం వల్ల జీఎస్‌టీ 18 శాతం కట్టాల్సి ఉంటుంది.

ఈ ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని 55వ జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో దీనికి సంబంధించి సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఒక హోటల్ స్పెసిఫైడ్ ప్రెమిసెస్ కిందకు వస్తుందా లేదా అనేది డిక్లేర్డ్ టారిఫ్‌ను బట్టి కాకుండా వాస్తవంగా వసూలు చేసే అద్దెను బట్టి నిర్ణయించటం జరుగుతుంది. అది కూడా క్రితం ఆర్థిక సంవత్సరంలోని అద్దెను బట్టి ఉంటుంది. దీనివల్ల టారిఫ్ కార్డు ప్రకారం రూము అద్దె రూ.7,500 పై ఉన్నప్పటికీ.. వాస్తవ అద్దె రూ.7,500 కంటే తక్కువ ఉంటే అది స్పెసిఫైడ్ ప్రెమిసెస్ కిందకు రాదు. అప్పుడు రెస్టారెంట్ సర్వీస్‌కు 5 శాతం జీఎస్‌టీ కడితే సరిపోతుంది.

ఇంకొక ముఖ్య విషయం ఏమిటంటే, ఇప్పటి వరకు ఉన్న నిబంధన ప్రకారం రెస్టారెంట్ సర్వీస్ మీద 5 శాతం జీఎస్‌టీ కట్టినప్పుడు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకునే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు కొత్త సవరణ ప్రకారం 5 శాతానికి బదులుగా 18 శాతం జీఎస్‌టీని ఎంచుకొని ఐటీసీ తీసుకునే అవకాశం ఉంది. అయితే దీనికి ఆర్థిక సంవత్సరం మొదట్లో లేదా రిజిస్ట్రేషన్ తీసుకునే సమయంలో ఒక డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

'బ్లాక్' నిరోధానికే
టికెట్ల ధరల పెంపు
నిర్మాతలకే కాదు.. వీటితో ప్రభుత్వానికీ
18 శాతం జీఎస్టీ రూపంలో ఆదాయం
'మెగా' కుటుంబానికి అహంకారం లేదు
రాజమహేంద్రిలో 'గేమ్ చేంజర్' 10
ఈవెంట్‌లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 5-1-2025 | పేజీలు: 14 + 2025 క్యాలెండర్ | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 278 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

రైతు భరోసా 12 వేలు

ఎకరానికి సీజన్‌కు రూ.6 వేల చొప్పున చెల్లింపు



సాగు యోగ్యమైన భూములన్నింటికీ వర్తింపు
భూమి లేని రైతు కుటుంబాలకు ఏటా 12 వేలు
'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'గా పథకం
రేషన్ కార్డులు లేనివారికి నూతన కార్డులు
ఈ 3 పథకాలు ఈ నెల 26 నుంచి అమల్లోకి
వ్యవసాయ యోగ్యం కాని భూమికి భరోసా ఇవ్వం
గతంలో 'ధరణి' వల్ల కొన్ని భూములకు అందింది
రెవెన్యూ సిబ్బంది గ్రామాలవారీ వివరాల సేకరణ
క్యాబినెట్ భేటీ నిర్ణయాలను వెల్లడించిన సీఎం
గతంలోకి వెళితే కేసీఆర్ కుటుంబానికి..
వెయ్యేళ్ల జైలుశిక్ష అంటూ విమర్శ

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం కింద రైతులకు ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందజేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు. దీంతోపాటు భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు ఏటా రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని తెలిపారు. ఈ పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'గా నామకరణం చేసినట్లు పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో రేషన్ కార్డులు లేనివారందరికీ నూతన రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. ఈ మూడు పథకాలను ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలు చేస్తామని ప్రకటించారు. శనివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. సచివాలయంలోని క్యాబినెట్ హాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన దాదాపు మూడు గంటలపాటు మంత్రివర్గ సమావేశం జరిగింది. అనంతరం క్యాబినెట్ భేటీ వివరాలను మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మీడియాకు వివరించారు. సీఎం మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఈ నూతన సంవత్సరంలో మంచి జరగాలని, ఈ ప్రభుత్వం వారిని ఆదుకోవాలని, వ్యవసాయం దండగ కాదు.. పండుగ అని మా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో

మిగతా 11వ పేజీలో...

దరఖాస్తు లేకుండానే
'భరోసా'
సాగు చేసిన పంటలపై సర్వే కూడా ఉండదు
1.38 కోట్ల ఎకరాలకు రూ.8,300 కోట్లు అవసరం
రాష్ట్రంలో 10 నుంచి 12 లక్షల మంది రైతు కూలీలు
ఉపాధి కార్డుతో వారికి సాయం
మంత్రి మండలిలో చర్చ 11

నిపుణులతో చర్చించాకే..
కేసీఆర్‌పై చర్యలు
లోకూర్ నివేదికను ఏజీకు పంపాలని క్యాబినెట్ నిర్ణయం

పాలమూరు-రంగారెడ్డికి
జైపాల్‌రెడ్డి పేరు
సింగూరు కాలువకు సిలారపు రాజనర్సింహ పేరు
588 కారుణ్య నియామకాలు
మంత్రివర్గం ఆమోదం

పోలవరం ముంపుపై ఐఐటీహెచ్‌తో
అధ్యయనం
నెలలో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి
గోదావరి-బనకచర్ల అనుసంధానంపై
అభ్యంతరాలు ఏపీ సీఎస్ దృష్టికి తీసుకెళ్లాలి
కేంద్ర జలశక్తి శాఖకు ఫిర్యాదు చేయాలి
అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం 11

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
పీఆర్టీయూ డైరీ ఆవిష్కరణలో ముఖ్యమంత్రి 11

కాంగ్రెస్ సర్కార్ రైతులను దగా చేసింది
భరోసాను రైతు గుండెకోతగా మార్చారు
ఎకరాకు 15 వేలిస్తామని హామీ
ఇచ్చి ఇప్పుడు 12 వేలు అంటున్నారు..
రైతులు క్షమించరు: హరీశ్‌రావు
ఎకరానికి రూ.12 వేలే.. దుర్మార్గం
కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శ

ముప్పే.. బాబూ!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ మొదటికే వచ్చారు. తాను మారానని చెప్పుకొన్న ఆయన ఈ ఆరు నెలల్లో నిజంగా మారారా లేదా అన్న ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పనితీరును పక్కన పెడితే తెలుగుదేశం పార్టీ అధినేతగా ఆయన పోకడలు పార్టీ శ్రేణుల్లో నైరాశ్యాన్ని నింపుతున్నాయి. రాజకీయంగా తనకు ఏమి కావాలన్న దానిపై ఆయనలో స్పష్టత కొరవడినట్టు ఈ 6 నెలల్లో చోటు చేసుకున్న పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. 2029 తర్వాత చంద్రబాబు రాజకీయ జీవితం గురించి ఇప్పుడే చెప్పలేం. అయితే, 2029 తర్వాత తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు ఏమిటనేది ప్రశ్నార్థకం కాకూడదని పార్టీ నేతలు, శ్రేణులు బలంగా అభిప్రాయపడుతున్నారు.


కొత్త పలుకు!

ఏపీలో భవిష్యత్ రాజకీయాలు జగన్ రెడ్డి, పవన్ కల్యాణ్, లోకేశ్ చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయి. జగన్ రెడ్డి ఇప్పటికే తాను ఏమిటో రుజువు చేసుకున్నారు. అతనికి కొన్ని వర్గాలు బలంగా మద్దతు ఇస్తున్నాయి. పవన్ కల్యాణ్‌కు కాపు సామాజిక వర్గం పూర్తి అండగా ఉంది. మిగతా వర్గాలకు చేరువ కావడానికి ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టారు. మరి లోకేశ్ పరిస్థితి ఏమిటి?

చంద్రబాబుకు ప్రత్యామ్నాయంగా టీడీపీని నడిపించగల సత్తా లోకేశ్‌లో ఉందని అటు ప్రజలతోపాటు ఇటు శ్రేణుల్లోనూ నమ్మకం కలిగించాలి. ప్రస్తుతానికి జనసేనాని పవన్ కల్యాణ్ భారతీయ జనతా పార్టీకి ఆప్తుడుగా ఉంటున్నారు. బీజేపీ అగ్ర నాయకత్వం రాష్ట్రంలో చంద్రబాబును పూర్తిగా నమ్ముతుందని భావించలేం. పవన్‌ను ప్రోత్సహించడం ద్వారా టీడీపీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలని బీజేపీ అగ్రనాయత్వం తలపోస్తోందని చెబుతున్నారు.

2014-2019 మధ్య కాలంలో వలె ఇప్పుడు చంద్రబాబు మళ్లీ పోలవరం-రాజధాని అమరావతి జపం చేస్తున్నారు. జగన్‌ను కట్టడి చేసే విషయమై శక్తియుక్తులు అన్నింటినీ ఉపయోగించవలసిన ఆయన ప్రభుత్వ కార్యక్రమాల సమీక్షలతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఆరు నెలలు గడచినా రాజకీయ ప్రత్యర్థిపై కేసులకు అతీగతీ కనపడటంలేదు. దీంతో పార్టీ శ్రేణులే కాదు- గత ఐదేళ్ల చీకటి పాలనను గుర్తు చేసుకుంటున్న ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. జగన్ రెడ్డి అనే రాజకీయ భూతాన్ని సీసాలో బంధించనంత వరకు ఏపీలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న వారిలో కూడా ఆందోళన ఉంటుంది. జగన్మోహన్ రెడ్డి విషయం అటుంచితే, ఆయన చుట్టూ ఉన్న వారి అరాచకాలను గుర్తించి కేసులు పెట్టి కట్టడి చేయడంలో కూడా ప్రభుత్వం విఫలమవుతోంది. 4

గజగజ 12
కోహీర్‌లో 6 డిగ్రీలు.. సీజన్‌లో అత్యల్పం
రాష్ట్రంలో విజృంభిస్తున్న చలిపులి
ఉత్తరాది రాష్ట్రాల్లో పొగమంచు తెర
30 విమానాల రద్దు.. 19 దారి మళ్లింపు
రైళ్ల రాకపోకలకూ అంతరాయం


ఆదిలాబాద్‌లోని జాతీయ రహదారిని కమ్మేసిన పొగమంచు

బాలికల వాష్‌రూంలో
సెల్‌ఫోన్ కెమెరా!
మహబూబ్‌నగర్ పాలిటెక్నిక్ కాలేజీలో ఘటన
ప్రిన్సిపాల్‌కు బాధితురాలు ఫిర్యాదు చేసినా మౌనం
విద్యార్థుల ఆందోళనతో దద్దరిల్లిన ప్రాంగణం
పూర్వ విద్యార్థి పనే.. నిందితుడి అరెస్టు 12

పేలుడు ధాటికి ధ్వంసమైన కర్మాగారం

బాణసంచా కర్మాగారంలో పేలుడు
ఆరుగురి దుర్మరణం 2
తమిళనాడు విరుదునగర్‌లో ఘటన

వలసదారుల కుటుంబ సభ్యుల
పీఆర్ దరఖాస్తులకు బ్రేక్
కెనడా ప్రభుత్వం కీలక నిర్ణయం
ఈ నెల 1 నుంచే అమల్లోకి..
భారతీయులకు ఇబ్బందిగా
పరిణమించే అవకాశం 2





రక్తదానంతో ఆ పిల్లల్ని
బతికించరూ!
తలసీమియా బాధితులకు
రక్తం దొరక్క ఇబ్బందులు
సికిల్ సెల్ సొసైటీలో ప్రస్తుతం
4200 మంది పిల్లలు
రోజూ 70 మందికి రక్తం
కావాలి.. ఇస్తోంది 30మందికే
దాతలు రక్తదానానికి
ముందుకు రావాలి 12
సికిల్‌సెల్ సొసైటీ విజ్ఞప్తి

ఆంధ్రజ్యోతి
పాఠకులకు గమనిక

నేటి సంచికతో పాటు ఆదివారం అనుబంధానికి బదులుగా 2025 పంచాంగం క్యాలెండర్ ఉచితంగా అందుకోండి
- మేనేజింగ్ డైరెక్టర్

తెలుగు మీడియంపై అపోహలు
ఉద్యోగాలు రావన్నది నిజం కాదు
మెడిసిన్, ఇంజనీరింగ్
విద్యా బోధన తెలుగులో జరగాలి
శాస్త్ర, సాంకేతిక రంగాలలో
తెలుగు పదకోశాలు పెరగాలి
తెలంగాణ, ఏపీలో పరిపాలనా
భాషగా అమలు చేయాలి
తెలుగు సమాఖ్య మహాసభల్లో
కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్ సిటీ, జనవరి4(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులను పూర్తిగా తెలుగు మాధ్యమంలో బోధించేందుకు పెద్ద ఎత్తున కృషి జరగాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభిలషించారు. శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన పదకోశాలు తెలుగులో మరిన్ని రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆంగ్లం మోజులో పడి తెలుగును నిర్లక్ష్యం చేయడం భావ్యం కాదన్నారు. తెలుగు మీడియంలో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహను వీడాలన్నారు. చైనా, జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాల్లో ఆయా దేశాల మాతృ భాషల్లోనే విద్య, పరిపాలన

మిగతా 3వ పేజీలో...


సిరిసిల్లలో బీఆర్‌ఎస్ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

కేంద్రంలో చక్రం తిప్పుతాం
చంద్రబాబు, నితీశ్‌లా మనకూ ఒక రోజు వస్తది
చిన్న పొరపాట్లతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం
సీఎం చీఫ్ మినిస్టర్ కాదు.. కటింగ్ మాస్టర్
ఫార్ములా కేసులో విచారణకు హాజరవుతా: కేటీఆర్

సిరిసిల్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): "పది, పదిహేను మంది ఎంపీలతో నితీశ్‌కుమార్, చంద్రబాబు కేంద్రంలో చక్రం తిప్పుతున్నారు. వారిలాగే మనకూ ఒక రోజు వస్తుంది. తప్పకుండా కేంద్రంలో చక్రం తిప్పుతాం" అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. చిన్న పొరపాట్ల వల్ల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయామని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏ కారణంతోనో మంచి వాళ్లను ప్రజలు కాదనుకుని, అటు బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు ఎనిమిదేసి

మిగతా 3వ పేజీలో...

ఏపీ మంత్రిగారి
మంత్రాంగం!
వారంలో మూడు రోజులు హైదరాబాద్‌లోనే
ఆయన తొలిసారి మంత్రి.. కీలక శాఖ
స్టార్ హోటల్స్‌లో మకాం.. అక్కడే సెటిల్‌మెంట్లు
ఒక రోజంతా పంచాయితీలు, పరిష్కారాలు
మిగిలిన రెండు రోజులూ జోరుగా గానాబజానా
తాజాగా తెలంగాణ భూవ్యవహారాల్లోనూ జోక్యం
మంత్రి తీరుపై తెలంగాణ సర్కారు గట్టి నిఘా
శ్రుతి మించిపోతున్నారంటూ బాబుకు సమాచారం

"ఆయన మా దగ్గర ఏం చేస్తున్నారో, ఎక్కడెక్కడ తిరుగుతున్నారో మీకు తెలుస్తోందా? ఆయన వ్యవహారాలు శ్రుతి మించిపోతున్నాయి. అవేవో అక్కడే చేసుకోమనండి. ఆయనను జర చూసుకోండి!".. ఏపీకి చెందిన ఓ మంత్రి గురించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ ప్రభుత్వం చేసిన సూచన ఇదీ! ఆ మంత్రి వ్యవహార శైలిపై కీలక వివరాలు ఉన్న నోట్‌ను కూడా పంపించింది. దీంతో ఏపీ ప్రభుత్వంలో ఇప్పుడీ అంశం పెను సంచలనంగా మారింది. ఇంతకు ఆ మంత్రి ఎవరు? తెలంగాణలో, ప్రత్యేకించి హైదరాబాద్ మహానగరం కేంద్రంగా ఆయన ఏమేం పనులు చేస్తున్నారు?.. ఏపీ మంత్రివర్గంలో ఇప్పుడిది హాట్ టాపిక్‌గా మారింది. 10

తల్లిదండ్రులను సరిగ్గా చూడకుంటే.. గిఫ్ట్‌డీడ్ ఆస్తుల రద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జనవరి 4: గిఫ్ట్‌డీడ్ కింద ఆస్తులను రాసిచ్చాక.. తల్లిదండ్రుల సంరక్షణను విస్మరించి, వారి బాగోగులు చూడని బిడ్డల నుంచి ఆ ఆస్తులను తిరిగి పొందే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తల్లిదండ్రులు, వృద్ధుల నిర్వహణ(పోషణ), సంక్షేమ చట్టం ఆ అధికారాన్ని ఇస్తుందని జస్టిస్ సి.టి.రవికుమార్, జస్టిస్ సంజయ్ కరోల్‌ల ధర్మాసనం తేల్చిచెప్పింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌లోని చిత్తార్‌పూర్‌కు చెందిన వృద్ధ దంపతులు.. తమ కొడుక్కి కొంత ఆస్తిని గిఫ్ట్‌డీడ్ రూపంలో బదిలీ చేశారు. వారి బాగుగోలు చూసుకోని ఆ కొడుకు, మిగతా ఆస్తిని కూడా రాసివ్వాలంటూ దాడులు మొదలు పెట్టాడు. దీంతో ఆ వృద్ధ మహిళ తొలుత సబ్-డివిజనల్ మెజిస్ట్రేట్‌ను ఆశ్రయించి, న్యాయం పొందారు. మెజిస్ట్రేట్ ఆ గిఫ్ట్‌డీడ్‌ను రద్దుచేసి, ఆస్తిపై వృద్ధ దంపతుల హక్కులను పునరుద్ధరించారు. కొడుకు హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లగా.. సింగిల్ బెంచ్ వద్ద వృద్ధ దంపతులకు న్యాయం జరిగినా.. డివిజన్ బెంచ్ మాత్రం గిఫ్ట్‌డీడ్ రద్దు సాధ్యం కాదని తేల్చిచెప్పింది. దీంతో బాధిత మహిళ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం.. వృద్ధుల బాగోగులను పట్టించుకోని పిల్లలకు ఇచ్చిన గిఫ్ట్‌డీడ్ దానంతట అదే(డీమ్డ్ టు బి) రద్దవుతుందని స్పష్టం చేసింది. గిఫ్ట్‌డీడ్ ద్వారా ఆ వృద్ధ దంపతులు తమ కుమారుడికి ఇచ్చిన ఆస్తిని, తిరిగి వారి పేరిట పునరుద్ధరించింది. వచ్చే నెలాఖరులోగా ఆస్తి బదలాయింపు జరగాలని ఆదేశాలు జారీ చేసింది.

అట్టుడికిన బీజాపూర్..

టీవీ రిపోర్టర్ ముకేశ్ హత్యకు నిరసనగా జర్నలిస్టు సంఘాల బంద్

చర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో టీవీ రిపోర్టర్ ముకేశ్ చంద్రాకర్ హత్యకు నిరసనగా జర్నలిస్టు సంఘాలు శనివారం ఆ జిల్లా బంద్ నిర్వహించాయి. హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని రోడ్లపై బైఠాయించి నిరసన తెలిపాయి. చిరు వ్యాపారులు కూడా బంద్ పాటించి మద్దతు తెలిపారు. ఇటు ముకేశ్ చంద్రాకర్ అంతిమయాత్రలో భారీగా ఆదివాసీలు పాల్గొన్నారు. ఈ కేసులో రితేశ్ చంద్రాకర్, దినేశ్ చంద్రాకర్, మహేంద్ర అనే ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మరో నిందితుడు సురేశ్ చంద్రాకర్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ముకేశ్ చంద్రాకర్‌ను ఇంటికి పిలిచి రాడ్‌లతో కొట్టి హత్య చేసి, సెప్టిక్‌ట్యాంక్‌లో పడేశారని వివరించారు. రోడ్డు నిర్మాణ పనులపై వార్తలు కవర్ చేసిన విషయంలో గొడవ జరిగినట్లు అనుమానిస్తున్నామన్నారు. రూ.56 కోట్ల ఓ రోడ్డు పనిని, రూ.120 కోట్లుకు రీటెండర్ చేసిన వ్యవహారంలో ఈ హత్య జరిగిందని జర్నలిస్టు సంఘాలు ఆరోపిస్తున్నాయి.



కుటుంబ సభ్యుల పీఆర్ దరఖాస్తులకు బ్రేక్

- కెనడాలో ట్రూడో ప్రభుత్వ కీలక నిర్ణయం

టొరంటో, జనవరి 4: కెనడాలోని జస్టిన్ ట్రూడో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫ్యామిలీ క్లాస్ స్ట్రీమ్ కింద తల్లిదండ్రులు, అవ్వాతాతల కోసం కొత్తగా శాశ్వత నివాస (పీఆర్) దరఖాస్తుల స్వీకరణను నిలిపివేసింది. ఇమిగ్రేషన్, శరణార్థులు, పౌరసత్వ శాఖ మంత్రి మార్క్ మిల్లర్ తదుపరి మార్గదర్శకాలు జారీ చేసే వరకూ ఈ నిబంధన నిరవధికంగా అమలులో ఉంటుందని తెలిపింది. శుక్రవారం కెనడా గెజిట్‌లో ప్రచురించిన నోటిఫికేషన్ ప్రకారం.. తాజా ఆదేశాలు 2025 జనవరి 1 నుంచి అమలులోకి వస్తాయి. ప్రస్తుతానికి 2024లో వచ్చిన దరఖాస్తులను మాత్రమే ఇమిగ్రేషన్ అండ్ సిటిజన్‌షిప్ విభాగం ప్రాసెస్ చేయనుంది. వీటి సంఖ్యను కూడా 15వేలకు పరిమితం చేసింది. తల్లిదండ్రులను, వృద్ధులైన అవ్వా తాతలను శాశ్వతంగా కెనడాకు తీసుకురావాలని భావించే భారత సంతతికి చెందిన కుటుంబాలకు ట్రూడో ప్రభుత్వ నిర్ణయం ఇబ్బందికరంగా పరిణమించనుంది.

బాణసంచా కర్మాగారంలో పేలుడు.. తమిళనాడులో ఆరుగురి దుర్మరణం

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని విరుదునగర్ జిల్లా కోడయూరులో ఉన్న బాణసంచా కర్మాగారంలో పేలుడు సంభవించి ఆరుగురు దుర్మరణం చెందారు. శనివారం ఉదయం 9.40 గంటల ప్రాంతంలో కార్మికులు ఓ గదిలో బాణసంచా తయారీ కోసం రసాయనాలు కలుపుతుండగా, హఠాత్తుగా భారీ శబ్దంతో బాణసంచా పేలుడు సంభవించింది. దీంతో మొత్తం 4గదులు నేలమట్టమయ్యాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేసి, శిథిలాలను తొలగించారు. శిథిలాల కింద ఏడుగురు తీవ్ర గాయాలతో, అపస్మారక స్థితిలో ఉండగా.. వారిలో అప్పటికే ఆరుగురు మరణించినట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం స్టాలిన్.. మృతుల కుటుంబాలకు తలా రూ.4 లక్షల సాయం ప్రకటించారు.

లోయలో పడిన ఆర్మీ వాహనం

- కశ్మీర్‌లో నలుగురు సైనికుల మృతి, ముగ్గురికి గాయాలు

జమ్మూ, జనవరి 4: జమ్మూకశ్మీర్‌లో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పహారా కాసేందుకు వెళుతున్న ఓ ఆర్మీ వాహనం బందిపొరాలోని సదర్ కూట్ పాయన్ వద్ద అదుపు తప్పి లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో నలుగురు సైనికులు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఘటనా స్థలిలోనే ఇద్దరు జవాన్లు మృతి చెందగా.. క్షతగాత్రులను బందిపొరా జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యుల సూచన మేరకు శ్రీనగర్‌కు తరలించారు. శ్రీనగర్‌లో చికిత్స పొందుతూ మరో ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన ముగ్గురు సైనికుల పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు వారు వెల్లడించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

శంషాబాద్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ముంబై నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఇండిగో విమానాన్ని సాంకేతిక లోపం కారణంగా శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు ముంబై ఎయిర్‌పోర్టు నుంచి 144 మంది ప్రయాణికులతో టేకాఫ్ అయిన కొద్ది సేపటికే ఇండిగో విమానం ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో, పైలట్లు శంషాబాద్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఇతర విమానాలకు ల్యాండింగ్, టేకాఫ్‌ను నిలిపివేసి ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు అనుమతిచ్చారు. ఈ విమానం రాత్రి 8 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్ కావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంజనీర్లు, సమస్యను పరిష్కరించడంతో శుక్రవారం రాత్రి 10.47 గంటలకు విమానం విశాఖపట్నం వెళ్లింది.

చలికోటుపై క్యూఆర్ కోడ్..స్కాన్ చేస్తే రైల్ టికెట్

- మహాకుంభమేళా కోసం రైల్వే శాఖ వినూత్న ఆలోచన

ప్రయాగ్‌రాజ్, జనవరి 4: మహాకుంభమేళాను మహోన్నతంగా నిర్వహించడానికి భారతీయ రైల్వే కూడా తన వంతు కృషి చేస్తోంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులు రైళ్ల టికెట్ల కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే అవసరం లేకుండా క్యూర్ కోడ్ ద్వారా వాటిని పొందేలా ఉత్తర మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. దీని కోసం తొలిసారి తన సిబ్బందికి క్యూర్ కోడ్ ముద్రించిన జాకెట్స్ (చలికోట్లు) అందించింది. ఇవి ధరించిన సిబ్బంది స్టేషన్ ప్రాంగణంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ఉండి ప్రయాణికులకు సహకరిస్తారు. వారి ధరించిన జాకెట్ వెనుక ఉండే క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయడం ద్వారా రైల్వేకు చెందిన యూటీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దానితో రెండో తరగతి రైలు టికెట్లను సులువుగా కొనుగోలు చేయవచ్చు.

ఢిల్లీ ఎన్నికలకు బీజేపీ తొలి జాబితా విడుదల

న్యూఢిల్లీ, జనవరి 4: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఢిల్లీలో బీజేపీ 29 మంది అభ్యర్థులతో తొలి జాబితా ప్రకటించింది. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీపడుతున్న ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌పై మాజీ ఎంపీ పర్వేశ్ వర్మను బరిలోకి దించింది. ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నుంచి షీలా దీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్ పోటీపడుతున్నారు. దీంతో ఇక్కడ త్రిముఖ పోరు నెలకొంది. ఢిల్లీ సీఎం అతిశీపై కల్కాజీలో మాజీ ఎంపీ రమేశ్ బిధూరీని బీజేపీ పోటీకి నిలిపింది. బీజేపీ విడుదల చేసిన 29 మంది జాబితాలో 8 మంది కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల నుంచి వచ్చిన సీనియర్ నేతలు ఉన్నారు. బీజేపీలో చేరిన ఆప్ మంత్రులు కైలాశ్ గెహ్లోత్, రాజ్‌కుమార్ ఆనంద్‌లకు టికెట్లు లభించాయి. ఆప్ ఇప్పటికే మొత్తం 70 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా కాంగ్రెస్ 48 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఇదిలా ఉండగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు.

116 ఏళ్ల బామ్మ మృతి

- ప్రపంచంలో అత్యంత వృద్ధురాలిగా గుర్తింపు



ఈ ఫొటోలో కనిపిస్తున్న బామ్మ పేరు టొమికో ఇటూకా. జపాన్‌కు చెందిన ఈమె ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా పేరుగాంచారు. 116 ఏళ్ల వయసున్న ఈమె డిసెంబరు 29న కన్నుమూసినట్టు శనివారం ప్రకటించారు. 1908 మే 23న ఈమె.. అషియా సిటీకి సమీపంలోని ఒసాకాలో జన్మించారు. గత ఏడాది ఆగస్టులో 117 ఏళ్ల స్పెయిన్ దేశస్థురాలు బ్రన్యాస్ మొరేరా మృతి చెందడంతో ఇటూకాను ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మహిళగా గుర్తించారు. ఇదిలా ఉండగా.. సెప్టెంబరు నాటికి జపాన్‌లో వందేళ్ల అంతకన్నా ఎక్కువ వయసున్న వారి సంఖ్య 95వేలకు పైగా ఉన్నట్టు తెలుస్తోంది. వీరిలో 88 శాతం మంది మహిళలేనట.

‘అణు’ శక్తిమంతుడు మరి లేరు!

ప్రఖ్యాత అణు శాస్త్రవేత్త రాజగోపాల చిదంబరం కన్నుమూత

- అనారోగ్యంతో ముంబైలో తుదిశ్వాస
- రెండు పోఖ్రాన్ అణు పరీక్షల్లోనూ కీలకం
- సూపర్ కంప్యూటర్లు, నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్‌కు సైద్ధాంతిక తోడ్పాటు
- మోదీ, చంద్రబాబు, ఖర్గే నివాళులు



న్యూఢిల్లీ, జనవరి 4 : భారత అణు కార్యక్రమ రూపశిల్పి రాజగోపాల చిదంబరం (88) మరణించారు. ముంబైలోని జస్‌లోక్ ఆస్పత్రిలో అనారోగ్యంతో ఆయన శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిని భారత్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ (బీఏఈ) సంస్థ ధ్రువీకరించింది. భారత్ జరిపిన రెండు అణు పరీక్షల్లోనూ అణుశాస్త్రవేత్తగా ఆయన పాలుపంచుకోవడం విశేషం. రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హయాంలో 1974లో ఒకటి, మరో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి సారథ్యంలో 1998లో మరొకటి జరపడం అప్పట్లో సంచలనం రేపింది. దేశంలో అణ్వాయుధ కార్యక్రమాన్ని అభివృద్ధి చేయడంలోనూ చిదంబరం పాత్ర ఉంది. కేంద్ర ప్రభుత్వానికి శాస్త్రీయ ముఖ్య సలహాదారుగాను, పలు సంస్థలకు సారథిగాను 17 ఏళ్లు చిదంబరం సేవలు అందించారు.

వైజ్ఞానిక శిఖరం..

తమిళనాడులో 1936లో రాజగోపాల చిదంబరం జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం మీరట్‌లోని సనాతన ధర్మ హైస్కూలులో పూర్తిచేశారు. చెన్నైలోని మైలాపూర్‌లోని పీఎస్ విద్యాలయంలో ఎనిమిది నుంచి ఇంటరు వరకు చదివారు. అనంతరం ప్రెసిడెన్సీ కాలేజీలో బీఎస్సీ పూర్తిచేశారు. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో చేరి పీహెచ్‌డీ చేశారు. బాబా ఆటమిక్ రిసెర్చ్ సెంటరులో (బార్క్) 1963లో చేరి.. 1990 నాటికి ఆ సంస్థ డైరెక్టరుగా ఎదిగారు. అతిభార లోహాల భౌతిక శాస్త్రం (హై ప్రెజర్ ఫిజిక్స్), పరమాణు, స్ఫటికాకార శాస్త్రం (క్రిస్టలోగ్రఫీ), మెటీరియల్ సైన్స్‌లో కొత్త కోణాలు ఆయన ఆవిష్కరించారు. వైజ్ఞానిక సముదాయానికి చెందినవారి అవగాహనను ఆయన పరిశోధనలు విస్తృతం చేశారు. భారత్‌లో మోడ్రన్ మెటీరియల్ సైన్స్‌కు ఆయన ఆద్యుడు. ఇంధనాలు, ఆరోగ్య సంరక్షణ; వ్యూహాత్మక రంగంలో స్వీయసమృద్ధి వంటి అంశాల్లో తిరుగులేని ఆవిష్కరణలు ఆయన అందించారు. ఆయనను ప్రపంచ స్థాయి భౌతిక శాస్త్రవేత్తగా పరిగణించేవారు. దేశీయ పద్ధతుల్లో సూపర్ కంప్యూటర్లను అభివృద్ధి చేయడంలోనూ, నేషనల్ నాలెడ్జ్ నెట్‌వర్క్ ఏర్పాటులోను సైద్ధాంతిక సహకారం అందించారు. జాతీయాభివృద్ధికి వైజ్ఞానిక, సాంకేతిక జ్ఞానాన్ని జోడించాలని గట్టిగా కోరుకున్నవారిలో ఆయన ముఖ్యుడు. ఆయనను 1975లో పద్మశ్రీ, 1999లో పద్మవిభూషణ్ పురస్కారాలు వరించాయి. పలు విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో ఆయనను సత్కరించాయి.

ప్రముఖుల నివాళులు

భారత అణు కార్యక్రమ నిర్మాణంలో ప్రధాన భూమిక చిదంబరం పోషించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ వైజ్ఞానిక, వ్యూహాత్మక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఆయన అత్యుత్తమ భాగస్వామ్యం అందించారని కొనియాడారు. దేశం నిర్వహించిన రెండు అణు పరీక్షల్లో ఆయన పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అలాంటి శాస్త్రవేత్తను కోల్పోవడం విచారకరమని ‘ఎక్స్’లో పేర్కొన్నారు. అణుశక్తి కమిషన్ సారథిగా పలు వ్యూహాత్మక అస్త్రాలను మనకు ఆయన అందించారని కేంద్రం వైజ్ఞానిక, సాంకేతిక మంత్రిత్వ శాఖ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. అద్భుతమైన వైజ్ఞానిక మేధస్సును దేశం కోల్పోయిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. వైజ్ఞానిక, సాంకేతిక క్షేత్రాల్లో చిదంబరం విశిష్ట వ్యక్తి అని, ఆయన చొరవతోనే వ్యూహాత్మక రంగంలో భారత్ స్వయంశక్తిని సంతరించుకున్నదని అణుశక్తి విభాగం కార్యదర్శి అజిత్‌కుమార్ మొహంతీ కొనియాడారు. అసంఖ్యాక శాస్త్రవేత్తలు, ఇంజనీర్లను నడిపించిన నిబద్ధ మార్గదర్శి, స్ఫూర్తిదాయక నాయకుడు, వైతాళికుడి రూపంలో చిదంబరం సదా గుర్తుండిపోతారని అణుశక్తి కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది.

చిదంబరం చేపట్టిన పదవులు

1990-93 : బాబా ఆటమిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్) డైరెక్టర్

1993-2000 : అణుశక్తి కమిషన్ చైర్మన్, కేంద్ర వైజ్ఞానిక శాఖ కార్యదర్శి, బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఆఫ్ ద ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ చైర్మన్

2001-08 : కేంద్ర ప్రభుత్వానికి శాస్త్రీయ ముఖ్య సలహాదారు.

తిండి ఒక్కటే కాదు గురూ!

- ఆహారం కంటే ఇతరాలపైనే ఖర్చెక్కువ
- భారతీయ కుటుంబాల్లో ట్రెండ్: ఎస్బీఐ

న్యూఢిల్లీ, జనవరి 4: భారతీయ కుటుంబ వ్యయ విధానాల్లో గణనీయ మార్పు వచ్చిందని, ఆహారం కంటే ఆహారేతర వస్తువులు, అవసరాలపై ఎక్కువగా దృష్టి పెడుతున్నారని ఎస్బీఐ నివేదిక వెల్లడించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పప్పులు, తృణధాన్యాల వినియోగం 5 శాతానికి పైగా తగ్గిందని పేర్కొంది. ఆహారం కంటే ఆహారేతర వస్తువులపై అధిక వ్యయం అనేది ఆర్థిక వృద్ధి, ప్రభుత్వ విధానాలు, జీవనశైలి వంటి అంశాల వల్ల ప్రాధాన్యతా మార్పులను ప్రతిబింబిస్తోందని తెలిపింది. గ్రామీణ, పట్టణ ప్రాంతం అనే తేడా లేకుండా ఆహారంపై చేస్తున్న ఖర్చులో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోందని ఎస్బీఐ నివేదిక పేర్కొంది. ‘గ్రామీణ ప్రాంతాల్లో ఆహారంపై ఖర్చు 2011-12లో 52.9 శాతం ఉండగా.. అది 2023-24కు 47.04కు తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో 42.62 నుంచి 39.68 శాతానికి పడిపోయింది’ అని వివరించింది. కుటుంబాల బడ్జెట్‌లలో ఆహారేతర వస్తువులు అధిక ప్రాధాన్యత దక్కించుకుంటున్నాయని, గ్రామాల్లో వీటి భాగం 47.1 నుంచి 52.96 శాతానికి, పట్టణాల్లో 57.38 నుంచి 60.32 శాతానికి ఎగబాకిందని తెలిపింది. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెరిగిందని, ఆసక్తికరంగా జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ కారణంగా కుటుంబ వ్యయాల్లో పన్నులు, సుంకాల వాటా తగ్గిందని, అంతకుముందు పన్ను విధానంతో పోలిస్తే తగ్గిన జీఎస్టీ రేట్ల వలన దుస్తులు, ఫుట్‌వేర్‌పై ఖర్చు తగ్గిందని పేర్కొంది. ఆహారం నుంచి ఆహారేతర వ్యయానికి మార్పు చెందడం మారుతున్న భారత సామాజిక-ఆర్థిక చిత్రాన్ని చూపుతోందని ఎస్బీఐ నివేదిక అభిప్రాయపడింది.



పొగమంచుతో పట్నాలో నిలిచిన విమానాలు

ఉత్తరాదిపై చలిపంజా

- పొగమంచుతో 30 విమానాలు రద్దు
- 200 విమానాలు ఆలస్యం

న్యూఢిల్లీ, జనవరి 4: ఉత్తర భారతంపై చలి పంజా విసురుతోంది. మంచు దట్టంగా కురుస్తోంది. ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాలను పొగమంచు కమ్మేసింది. దీంతో విమాన, రైల్వే సేవలకు అంతరాయం ఏర్పడింది. ఢిల్లీ విమానాశ్రయంలో దృశ్యత సున్నాకు పడిపోవడంతో దాదాపు 200లకు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తుండగా.. 19 విమానాల దారి మళ్లించామని, మరో 30 విమానాలను రద్దు చేశామని అధికారులు వెల్లడించారు. పొగమంచు కారణంగా విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, విమాన సమయాల కోసం ప్రయాణికులు ఎప్పటికప్పుడు సంబంధిత ఎయిర్‌లైన్లను సంప్రదించాలని వారు పేర్కొన్నారు. ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు కూడా ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. కోల్‌కతా, చండీగఢ్, అమృత్‌సర్, జైపూర్ సహా ఉత్తర భారతంలోని పలు విమానాశ్రయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కోల్‌కతా విమానాశ్రయంలో 25 విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు మంచు కారణంగా రైల్వే సేవలూ నెమ్మదిగా సాగుతున్నాయి. ఢిల్లీకి వెళ్లే దాదాపు 50కి పైగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, కర్నాల్, గాజియాబాద్ తదితర ప్రాంతాల్లో ఎదురుగా ఉన్న వాహనాలు కూడా కన్పించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనాల రాకపోకలపై ప్రభావం పడి పలు చోట్ల ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

భారత్‌లో మత విద్వేష మంటలు

ప్రపంచంలోనే అత్యంత తీవ్రం.. 198 దేశాల్లో భారత్‌కు తొలిస్థానం

- తర్వాతి స్థానాల్లో నైజీరియా, సిరియా, పాకిస్థాన్
- వెల్లడించిన ప్యూ రీసెర్చ్ సెంటర్



న్యూఢిల్లీ, జనవరి 4: సామాజిక జీవనంలో మతవిద్వేషం బుసలు కొడుతున్న దేశాల్లో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందని ప్యూ రీసెర్చ్ సెంటర్ తాజా నివేదిక వెల్లడించింది. 2022 సంవత్సరంలో మొత్తం 198 దేశాల్లో పరిస్థితులను అధ్యయనం చేసిన ప్యూ సంస్థ తాజాగా ఆ వివరాలతో ఒక నివేదికను విడుదల చేసింది. ‘సామాజిక వర్గాల మధ్య శత్రుత్వ భావన’ (ఎస్‌హెచ్‌ఐ) ఇండెక్స్‌లో గరిష్ఠంగా 10 పాయింట్లకుగాను భారత్ 9.3 పాయింట్లతో తొలి స్థానంలో ఉందని ఈ నివేదిక తెలిపింది. తర్వాత స్థానాల్లో వరుసగా నైజీరియా (8.7), సిరియా (8.1), పాకిస్థాన్ (7.9), ఇరాక్ (7.8), ఈజిప్టు (7.4), ఆఫ్గనిస్థాన్ (7.3) నిలిచాయి. 7.2 పాయింట్లకన్నా ఎక్కువ ఉన్న దేశాలను సామాజిక అశాంతి అత్యధిక స్థాయిలో నెలకొన్న దేశాలుగా ప్యూ సంస్థ వర్గీకరిస్తుంది. మతం కారణంగా ఒక వర్గం ప్రజల్ని వేధింపులకు గురి చేయటం, మూకదాడులు జరపటం, ఉగ్రవాదం, మిలిటెంట్ చర్యలు, మతమార్పిళ్లపై ఉద్రిక్తతలు, మతపరమైన సంకేతాలు, వేషధారణపై ఆంక్షలు వంటి అంశాల ప్రాతిపదికన ఎస్‌హెచ్‌ఐ ఇండెక్స్‌లో దేశాలకు స్కోరు కేటాయిస్తారు. ఒక నిర్దిష్ట మతంపై లేదా కొన్ని మతాలపై ప్రభుత్వం నిర్బంధం విధించే అంశం ఆధారంగా ప్యూ సంస్థ జీఆర్ఐ అనే మరో ఇండెక్స్‌ను రూపొందించింది. ఈ ఇండెక్స్‌లో భారత్ పరిస్థితి కొంత మెరుగ్గానే ఉన్నట్లు తెలిపింది. జీఆర్ఐ ఇండెక్స్‌లో 10 పాయింట్లకుగాను భారత్‌కు 6.4 స్కోరు చేసింది. 6.6 లేదా అంతకంటే ఎక్కువ పాయింట్లు ఉన్న దేశాలను అత్యధిక ప్రమాదంలో ఉన్న దేశాలుగా ప్యూ వర్గీకరిస్తుంది. వీటిలో 8.4 పాయింట్లతో ఈజిప్టు తొలిస్థానంలో నిలవగా.. తదుపరి స్థానాల్లో ఆఫ్గనిస్థాన్ (8.2), ఇరాన్ (8.2), సిరియా (7.9), ఇండొనేషియా (7.9) ఉన్నాయి. ఎస్‌హెచ్‌ఐ, జీఆర్ఐ ఇండెక్స్‌లు రెండింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. 25 దేశాల్లో పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని తెలిపింది. వాటిలో భారత్, నైజీరియా, సిరియా, పాకిస్థాన్, ఇరాక్ తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. 62% దేశాల్లో జీఆర్ఐ, ఎస్‌హెచ్ఐ స్కోరు తక్కువగా లేదా సాధారణ స్థాయిల్లో ఉంది. వీటిలో కెనడా, దక్షిణ కొరియా తదితర దేశాలున్నాయి. 16% దేశాల్లో జీఆర్ఐ చాలా ఎక్కువగా ఉన్నప్పటికీ ఎస్‌హెచ్ఐ తక్కువగా ఉంది. అంటే, ప్రభుత్వ ఆంక్షల తీవ్రత అధికం కానీ, ప్రజల మధ్య మతపరమైన ఉద్రిక్తతలు లేవు. ఈ దేశాల్లో చైనా, క్యూబా ఉన్నాయి. 10% దేశాల్లో జీఆర్ఐ తక్కువగా ఉన్నప్పటికీ.. ఎస్‌హెచ్ఐ ఎక్కువగా నమోదైంది. అంటే, ప్రభుత్వ ఆంక్షలు లేకపోయినా మైనారిటీల మీద విద్వేషం ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి దేశాల్లో బ్రెజిల్, ఫిలిప్పీన్స్ మొదలైనవి ఉన్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకర పరిస్థితి

2021తో పోల్చితే జీహెచ్ఐ అత్యధికం నుంచి అధికం ఉన్న దేశాల సంఖ్య 55 నుంచి 59కి పెరిగింది. కాగా, 2007లో ప్యూ తన సర్వే నివేదికలను విడుదల చేయటం ప్రారంభించినప్పుడు.. ప్రపంచంలో 40 దేశాలు మాత్రమే మతపరమైన వివక్ష, ఉద్రిక్తతలు అత్యధికంగా ఉన్న జాబితాలో ఉన్నాయి. ప్రస్తుతం వాటి సంఖ్య 45కి పెరిగింది. కాగా, మతపరమైన సమూహాలపై ప్రభుత్వ పరంగా ఆంక్షలు ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయాయని, 198 దేశాలకుగాను 186 దేశాల్లో ఈ పరిస్థితి ఉందని ప్యూ నివేదిక వెల్లడించింది. అమెరికాకు చెందిన ప్యూ రీసెర్చ్ సెంటర్ వివిధ దేశాల్లో పరిస్థితులను సామాజిక అంశాలవారీగా విశ్లేషించి నివేదికలు విడుదల చేస్తుంది.

ట్రంప్‌కు 10న శిక్ష ప్రకటన

- హష్ మనీ కేసు.. కారాగారం ఉండబోదన్న జడ్జి
- కోర్టు శిక్ష విధించిన తొలి అధ్యక్షుడిగా చరిత్ర పుటల్లోకి?

న్యూయార్క్, జనవరి 4: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు హష్ మనీ కేసులో ఈనెల 10న శిక్ష వెల్లడిస్తానని న్యూయార్క్ కోర్టు జడ్జి జువాన్ ఎం.మెర్చన్ ప్రకటించారు. శృంగార తార స్టార్మీ డానియల్‌తో ట్రంప్ గతంలో జరిపిన రాసలీలలను బయటపెట్టకుండా ఉండేందుకు 2016లో అధ్యక్ష ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఆమెకు 1.30 లక్షల డాలర్ల ముడుపులు(హష్ మనీ) ముట్టజెప్పారనేది అభియోగం. ఎన్నికల ప్రచారానికి అందిన విరాళాల సొమ్ము నుంచి ఆ ముడుపులు చెల్లించారన్నది ఆరోపణ. శుక్రవారం ఈ కేసు విచారణ సందర్భంగా జడ్జి తీర్పుపై తాజా నిర్ణయాన్ని వెల్లడించారు. అయితే, ట్రంప్‌కు కారాగార శిక్ష ఉండబోదని తెలిపారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడానికి సరిగ్గా పది రోజుల ముందు ఈ తీర్పు వెలువడనుంది. దీంతో కోర్టులో శిక్ష పడిన తొలి అధ్యక్షుడిగా ట్రంప్ చరిత్రలో నిలిచిపోనున్నారు. అమెరికా అధ్యక్షుడు కాబోతున్నందున తనపై కేసును కొట్టివేయాలని ట్రంప్ చేసిన అభ్యర్థనను జడ్జి తిరస్కరించారు. శిక్షకు చట్టపరమైన అడ్డంకులు ఏమీ లేవని, ఈనెల 20న అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు ట్రంప్‌కు శిక్ష విధించడం తన బాధ్యత అని జడ్జి స్పష్టం చేశారు. ఈ కేసుకు సంబంధించి 34 అంశాలలో రికార్డులు తారుమారు చేసినట్టు కూడా ట్రంప్‌పై అభియోగాలు నమోదయ్యాయి. గతేడాది మేలో ట్రంప్‌ను కోర్టు ఈ కేసులో దోషిగా తేల్చింది. గతేడాది నవంబరు 5న ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత కేసు విచారణను జడ్జి మెర్చన్ నిలిపివేసి, తీర్పును నిరవధికంగా వాయిదా వేశారు. కాగా, జడ్జి మెర్చన్‌పై టంప్ తీవ్ర విమర్శలు చేశారు. ఆ జడ్జి చట్టాన్ని అతిక్రమిస్తున్నారని, అవినీతిలో కూరుకుపోయారని ఆరోపించారు.

కాఫీ, టీలతో క్యాన్సర్‌కు చెక్!

అమెరికా పరిశోధకుల వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 4: ‘హే.. చాయ్ గుటుక్కున తాగరాభాయ్!’- అంటూ విరామ సమయాల్లోనే కాదు.. తరచుగా అవకాశం ఉన్న ప్రతిసారీ టీతోపాటు కాఫీలు కూడా తాగడం మంచిదని చెబుతున్నారు పరిశోధకులు. ఇలా తరచుగా కాఫీలు, టీలు తాగేవారిలో తల, మెడ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుముఖం పడతాయని అంటున్నారు. అంతేకాదు, నోరు, గొంతు, స్వరపేటిక క్యాన్సర్‌లను సైతం టీ, కాఫీలు అరికట్టే అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు. ఈ అధ్యయనానికి సంబంధించిన పలు విషయాలను అమెరికన్ క్యాన్సర్ సొసైటీ ‘క్యాన్సర్’ అనే జర్నల్‌లో ప్రచురించింది. మొత్తంగా 14 అధ్యయనాల నుంచి సేకరించిన సమాచారాన్ని దీనిలో పొందుపరిచింది. ‘ఇంటర్నేషనల్ హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ ఎపిడెమాలజీ కన్సార్టియం’ ఈ అధ్యయనాలను నిర్వహించింది. మొత్తం 9,500 మంది తల, మెడ క్యాన్సర్ రోగులను పరీక్షించడంతోపాటు క్యాన్సర్ నుంచి బయటపడిన 15,700 మందిని సైతం అధ్యయనం చేసింది. నిత్యం కాఫీ, టీలు తీసుకుంటున్న వారిలో మెడ, తల క్యాన్సర్ లక్షణాలు తగ్గుముఖం పట్టినట్టు అధ్యయనకర్తలు పేర్కొన్నారు.

అధ్యయనం వివరాలు ఇవీ..

- అసలు కాఫీ తాగని వారితో పోల్చుకుంటే.. రోజుకు నాలుగు కప్పుల కాఫీ తీసుకునేవారిలో 17% క్యాన్సర్ కారకాలు తగ్గుముఖం పడతాయి.
- రోజూ ఎక్కువ మొత్తంలో కాఫీ తీసుకునే వారిలో నోటి క్యాన్సర్ లక్షణాలు 30 శాతం తక్కువగా ఉంటే గొంతు క్యాన్సర్ కారకాలు 22 శాతం తక్కువగా ఉన్నాయి.
- నిత్యం 3-4 కప్పుల కాఫీ తాగేవారికి గొంతు కింది భాగంలో వచ్చే ‘హైపోఫారింజీల్’ క్యాన్సర్ లక్షణాలు 41 శాతం తక్కువగా ఉంటాయి. రోజుకు ఒక్క కప్పయినా టీ తాగే వారిలో 9% తల, మెడ క్యాన్సర్ కారకాలు తక్కువగా ఉంటాయి. అయితే.. అదే పనిగా టీ తాగినా ఇబ్బందులు తప్పవని అధ్యయనం వెల్లడించింది. ఎక్కువ మోతాదులో టీ తాగే వారిలో ‘హైపోఫారింజీల్’ క్యాన్సర్ లక్షణాలు 38% ఎక్కువగా ఉంటాయని హెచ్చరించింది.

ఉబర్‌కు రూ. 54 వేల జరిమానా

న్యూఢిల్లీ, జనవరి 4: ఉబర్ ఇండియాకు వినియోగదారుల కోర్టు షాకిచ్చింది. సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు వినియోగదారుడికి రూ. 54వేలు చెల్లించాలని ఆదేశించింది. దక్షిణ ఢిల్లీకి చెందిన ఓ డాక్టర్ 2021 నవంబరు 29న ఇండోర్ వెళ్లడానికి విమాన టికెట్ బుక్ చేసుకున్నాడు. ఉదయం 3.15 గంటలకు ఇందిరా గాంధీ ఎయిర్‌పోర్టుకు బయలుదేరడానికి ఉబర్ క్యాబ్‌ను బుక్ చేశాడు. ఎంతకీ క్యాబ్ రాకపోవడంతో డ్రైవర్‌కు ఫోన్‌చేశాడు. కానీ సదరు డ్రైవర్ స్పందించలేదు. దీంతో ఉబర్ కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. మరో ట్యాక్సీ మాట్లాడుకొని ఎయిర్‌పోర్టుకు వెళ్లాడు. అప్పటికే తాను ఎక్కాల్సిన విమానం వెళ్లిపోయింది. దీంతో ఆ డాక్టర్.. వినియోగదారుల ఫోరంలో ఉబర్ ఇండియాపై దావా వేశాడు. కోర్టు ఉబర్‌కు రూ.54 వేల ఫైన్ విధించింది. ఇంకో విమాన టికెట్‌కు అయిన ఖర్చు రూ. 24 వేలు, మానసిక క్షోభకు రూ.30 వేలు చెల్లించాలని ఆదేశించింది.

కేంద్రంలో చక్రం తిప్పుతాం

(మొదటి పేజీ తరువాయి)



చెప్పున సీట్లు ఇచ్చారన్నారు. సంవత్సరం గడిచినా కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన నిధులు గుండుసున్నా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు వచ్చి నాలుగు వందల రోజులు గడిచినా.. ఆరు గ్యారెంటీలకు దిక్కు లేకుండా పోయిందని విమర్శించారు. సిరిసిల్లలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో మూడు పంటలకు రైతు బంధు ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రైతు భరోసాకు రైతుల నుంచి ప్రమాణ పత్రాలు అడగడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు రైతు బంధు కోసం ఎవరికీ దండం పెట్టలేదని, దరఖాస్తు ఇవ్వలేదని గుర్తు చేశారు. ఉద్యోగులకు, ఐటీ కట్టేటోళ్లకు భరోసా కట్ చేస్తానని చెప్పడం సరికాదన్నారు. సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు.. కటింగ్ మాస్టర్ అన్నట్టుగా పరిస్థితి ఉందన్నారు. మొహం బాగ లేక అద్దం పగులగొట్టినట్లు.. పరిపాలన చేతకాక రాష్ట్ర పరిస్థితి బాగా లేదని చెబుతున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలపై ప్రతి నెలా ఒక్కో కార్యక్రమం పెట్టుకుందామని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉక్కిరి బిక్కిరి చేసే బాధ్యత ప్రధాన ప్రతిపక్షంగా గులాబీ దండుదేనని అన్నారు. న్యాయ నిపుణుల సూచన మేరకు ఫార్ములా-ఈ కేసులో విచారణకు హాజరవుతానని తెలిపారు. ఏసీబీ, ఈడీ పెట్టినవి తప్పుడు కేసులేనని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా తనపై ఆరు కేసులు పెట్టాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ గెలిస్తే సీఎం రేసులో కేటీఆర్, కవిత ఉంటారంటూ జరుగుతున్న ప్రచారం తప్పని, కొందరు బుద్ధి తక్కువవాళ్లు చేసే ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సీఎం కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని, కచ్చితంగా అవుతారని పేర్కొన్నారు. మేడిగడ్డ కొట్టుకుపోవాలని, కేసీఆర్‌కు చెడ్డపేరు రావాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. సంవత్సరం గడిచినా బ్యారేజీకి ఎందుకు మరమ్మతు చేయడం లేదని, బ్యారేజీని వీళ్లే ఏదో చేశారని తనకు అనుమానం ఉందని అన్నారు. మళ్లీ మంచి రోజులు వస్తాయని ఒక్కొక్కరి సంగతి చూసుకుందామని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

తెలుగు మీడియంపై అపోహలు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత వ్యవహారాలను కొనసాగిస్తూనే అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల సందర్భంగా శనివారం హైటెక్స్‌లోని నోవాటెల్ హోటల్ వేదికగా సాగుతున్న రెండో రోజు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి కీలకోపన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు తెలుగు అధికార భాషగా కొనసాగించడంపై మరింత శ్రద్ధ పెట్టాలని కిషన్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ ఉత్తర, ప్రత్యుత్తరాలు, ఉత్తర్వులు కూడా తెలుగులో కొనసాగేలా చొరవ చూపాలన్నారు. న్యాయస్థానాల్లో వాదోపవాదాలు, తీర్పులు సైతం మాతృభాషల్లో వెలువరించాలన్న సంకల్పానికి కేంద్రం పూర్తి మద్దతు ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. నూతన జాతీయ విద్యావిధానం ద్వారా మోదీ ప్రభుత్వం మాతృభాషలకు పెద్ద పీట వేసిందని, భారతీయ భాషల్లో ఉన్నత విద్య పాఠ్య ప్రణాళికలను, పాఠ్యపుస్తకాలను రూపొందించేందుకు కృషి చేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలు నూతన విద్యావిధానాన్ని అమలు చేయాలని ఆకాంక్షించారు.



జానపద గాయని గొట్టె కనకవ్వను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రముఖులకు సన్మానం

కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. వారిలో తోట తరణి(కళా దర్శకుడు), డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే(వైద్య రంగం), ఉమామహేశ్వరి(హరికథాభాగవతారిణి), వోలేటి పార్వతీశం(సాహితీవేత్త), పరుచూరి నరేంద్ర(ప్రగతి ప్రింటర్స్), దివాకర్ల సురేఖా మూర్తి(లలిత సంగీతం), గొట్టె కనకవ్వ(జానపద గాయని), వెత్స రాజేష్(క్రీడా రంగం), డీపీకే బాబు(సమాజ సేవ) తదితరులున్నారు. కార్యక్రమంలో ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రతినిధులు కవితా దత్, యార్లగడ్డ హరిశ్చంద్ర ప్రసాద్, పీపీ సాయి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిధుల కొరత లేకుండా చూడాలి

దివ్యాంగులకు నిధుల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని కిషన్‌రెడ్డి అన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రతీ వంద రూపాయల్లో మొదటి రూపాయిని దివ్యాంగులకోసం వెచ్చించాలని సూచించారు. లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా శనివారం, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కిషన్‌రెడ్డి, పార్టీ నాయకులు నివాళులర్పించారు. మోదీ ప్రభుత్వం, దివ్యాంగులకు గతంలో ఉన్న 3 శాతం రిజర్వేషన్‌ను 4 శాతానికి పెంచిందని గుర్తుచేశారు.

బీజేపీ సంస్థాగత ఎన్నికలపై కిషన్‌రెడ్డి సమీక్ష

బీజేపీ మండల పార్టీ ఎన్నికలపై పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమీక్షించారు. శనివారం, పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన, జాతీయ కార్యదర్శి అర్వింద్ మీనన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ మండల అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. జిల్లా అధ్యక్షుల ఎన్నికకు సంబంధించి కీలక సమావేశం ఆదివారం జరగనుంది. పార్టీ రాష్ట్ర ఇంచార్జి సునీల్ బన్సల్ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా అధ్యక్షుల ఎన్నికకు సంబంధించి విధివిధానాలను ఆయన వివరించనున్నారని పార్టీవర్గాలు తెలిపాయి.

బీజేపీ తమిళనాడు సంస్థాగత ఎన్నికల ఇంఛార్జిగా కిషన్‌రెడ్డి

బీజేపీ తమిళనాడు సంస్థాగత ఎన్నికల ఇంఛార్జిగా కిషన్‌రెడ్డి నియమితులయ్యారు. రెండు, మూడు రోజుల్లో ఆయన తమిళనాడులో పర్యటించనున్నారని పార్టీవర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ డిమాండ్ చేశారు. అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.

చట్టసభల్లో మహిళల సంఖ్య పెరగాలి

ఎన్ని కష్టాలు ఎదురైనా రాజకీయాల్లో రాణించాలి

- ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభ మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో ఎంపీ డీకే అరుణ



హైదరాబాద్ సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో మహిళలు రాణించడం అంత సులువు కాదని, ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని ఎదుర్కొని మహిళలు రాజకీయ రంగంలో రాణించాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. చట్టసభల్లో మహిళల ప్రాధాన్యం పెరగాలని ఆకాంక్షించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభల్లో భాగంగా శనివారం జరిగిన మహిళా పారిశ్రామికవేత్తల సదస్సులో డీకే అరుణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చినప్పటికీ ఈ రంగంలో నిలదొక్కుకునేందుకు తాను ఎంతో శ్రమించాల్సి వచ్చిందని తెలిపారు. కుటుంబాన్ని, నియోజకవర్గ ప్రజలను, పార్టీ కేడర్‌ను సమన్వయం చేసుకోవడం మహిళలకు చాలా కష్టమన్నారు. రాజకీయాల్లో అడుగడుగునా అవమానాలు సర్వసాధారణమని, వాటన్నింటితో పోరాడి మహిళలు రాజకీయాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు. రాష్ట్రాలుగా విడిపోయినా భాషాపరంగా కలిసున్న తెలుగువారిని ఐక్యం చేసేందుకు ప్రపంచ తెలుగు సమాఖ్య చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు. ఇక, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్లా మాట్లాడుతూ.. మద్రాసులో పుట్టి, పెరిగినా వృత్తిరీత్యా అమెరికాలో కొన్నేళ్లు ఉన్నా.. తెలుగు భాష, సాహిత్యం, సంగీతాలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. 1996లో భారత్ బయోటెక్‌ను స్థాపించిన తాము దేశం వ్యాక్సిన్లను దిగుమతి చేసుకునే అవసరం లేకుండా చేశామని చెప్పుకునేందుకు గర్విస్తున్నానని తెలిపారు. బయోటెక్నాలజీ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అమ్మాయిలు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే, విశాక ఇండస్ట్రీస్ ఎండీ సరోజ వివేకానంద, పుల్లారెడ్డి విద్యాసంస్థల నిర్వాహకురాలు విద్యారెడ్డి, ఎలికో హెల్త్‌కేర్ సర్వీసెస్ ఎండీ వనిత దాట్ల, టోయర్స్ గ్రూప్ డైరెక్టర్ యర్రంశెట్టి పద్మజ, ప్లాటో గ్రీన్ టెక్ సీటీవో రైటా మోచర్ల (ఫిన్లాండ్‌కు చెందిన యువతి) తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు. పారిశ్రామిక రంగంలో మహిళలు మరింతగా రాణించడానికి అనుకూలమైన విధానాలు, వెసులుబాట్లు కల్పించాలని వారంతా అభిలాషించారు. ఈ కార్యక్రమంలో తేజస్విని యార్లగడ్డ, కవితా దత్ తదితరులు అతిథులను శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. చర్చా కార్యక్రమం అనంతరం ప్రముఖ గాయకుడు రామ్ విఠరియాల నిర్వహించిన సంగీత విభావరి సభికులను ఆకట్టుకుంది.



అగ్గిపెట్టెలో.. ఐదున్నరడుగుల చీర

ఫొటోలో కనిపిస్తున్న ఈ చీర పొడవు ఐదున్నర అడుగులు. వెడల్పు 48 ఇంచులు. ఇది అగ్గిపెట్టెలో ఇమిడిపోతుంది. సిరిసిల్లకు చెందిన చేనేత కార్మికుడు నల్లా విజయ్ దీన్ని తన స్వహస్తాలతో రూపొందించారు. తిరుమల శ్రీవారికి సమర్పించేందుకు దీన్ని 15 రోజులు కష్టపడి తయారు చేసినట్లు విజయ్ తెలిపారు.

భారత ప్రభుత్వ టంకశాల / INDIA GOVERNMENT MINT

(A UNIT OF SPMCIL)

WHOLLY OWNED BY GOVERNMENT OF INDIA

I.D.A. PHASE II, CHERLAPALLY, HYDERABAD - 500 051

ई-मेल / e-mail:- igm.hyderabad@spmcil.com; फ़ोन /PHONE 040- 27268300

NF.No.12018/6/2024/Legal/ASK/ Dated: 04.01.2025

MEMORANDUM

Sri.A.Sudheer Kumar, Jr.office Assistant(Stores), SAP ID: 22628 was charge sheeted vide Memorandum No.12018/6/2024/ Legal /ASK /346 dated 27.05.2024, for initiating disciplinary proceedings for Major Penalty under Rule 25 ofthe SPMCIL (CDA) Rules, 2020 for his un authorised absence for a total period of 224 days intermittently on 11.07.2022 and 10.04.2024 and continuously w.e.f.15.07.2022 to 09.01.2023 (179 Days) and w.e.f.16.04.2024 to 27.05.2024 (43 Days). Further, the official is continuously absent for the duties as on date.

2. Shri. Visal V Prabhu, Deputy Manager(OL), India Government Mint, Hyderabad was appointed as Inquiry Officer vide order dated 19.07.2024 to inquire into the charges framed against Sri.A.Sudheer Kumar and on completion of the department alinquiry proceedings, the Inquiry Officer has submitted the Inquiry Report dated 02.01.2025. It was brought out that Sri. A. Sudheer Kumar has not presented him selves during the inquiry as a result of which the inquiry is set ex-parte.

3. A copy of the Inquiry Report, is forwarded to the residential address of Sri. A. Sudheer Kumar, Junior Office Assistant by speed post & placed on the website ofIndia Government Mint, Hyderabad i.e. igm hyderabad.spmcil.com for his representation/reply, if any, in terms of Rule 26 (2) of the SPMCIL (CDA) Rules, 2020,with the direction to submit reply within15 days from the date of publication of this Memorandum in the newspaper failing which it will be construed that he has nothing to say and appropriate action as deemed fit will be taken. A Copy of the inquiry reportmay also be obtained from this office if Sri. A. Sudheer Kumar desires so immediatelyand not later than 15 days from the date of publication of this Memorandum.

Sd/-
(V. Kiran Kumar),
Joint General Manager (Materials) &
Disciplinary Authority.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

RC No. D/3339/2024, తేది: 28.12.2024

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లా, 2025-26 (12 నెలలు అనగా 01.04.2025 నుండి 31.03.2026 వరకు) సంవత్సర కాలానికి ప్రొవిజన్ల సరఫరా కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్లు కోరుచున్నారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in ను దర్శించగలరు (లేదా) 8333994017, 9885048201ను సంప్రదించగలరు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

DIPR RO No.8636-PP/CL/ADVT/1/2024-25 తేది: 04.01.2025

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనాల శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

1. రూ.14.49 కోట్ల అంచనా మొత్తంతో CE(R): NIT No.3215/CE(R)/NZB/EE(R)/DEE-8/AEE-13/2024-25, Dt: 04.01.2025 ప్రకారం (ఆర్&బి) శాఖలో నాన్-ప్లాన్ క్రింద ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. I) నిజామాబాద్ జిల్లాలో నాన్-ప్లాన్ క్రింద రోడ్ పని (1), మరియు సూర్యాపేట జిల్లాలో వంతెన పనులు (2), మరియు ఖమ్మం జిల్లాలో వంతెన పనులు (2). ఆన్‌లైన్ టెండర్ల స్వీకరణకు చివరి తేది: 15.01.2025న మ.03.30 గం.ల వరకు (మొత్తం 5 పనులు).
2. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. సం/- చీఫ్ ఇంజనీర్ (ఆర్&బి), స్టేట్ రోడ్స్ & CRN తరఫున

DIPR RO No.8654-PP/CL/ADVT/1/2024-25, Dt: 04.01.2025

తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, పిఆర్ సర్కిల్, పెద్దపల్లి

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No. 294 to 343/SE/Tenders/2024-25 తేది: 04.01.2025

పెద్దపల్లి మరియు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో అందుబాటులో ఉన్న ఫండ్, ZP ఫండ్, IMSBCSR, CRR 2024-25, DMFT, SDF మరియు 15వ ఫైనాన్స్ గ్రాంట్ క్రింద మొత్తం 50 నం.ల పనుల కొరకు పిలువనిచ్చారు. మొత్తం అంచనా వ్యయం: రూ.5,024.95 లక్షలు. టెండరు షెడ్యూలు తేది: 07.01.2025 నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ నుండి పొందగలరు. ఇతర వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tenders.telangana.gov.in నుండి పొందగలరు. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, పిఆర్ సర్కిల్, పెద్దపల్లి

DIPR RO No.8667-PP/CL/ADVT/1/2024-25 తేది: 04.01.2025

పరకాల పురపాలక సంఘ కార్యాలయం
హన్మకొండ జిల్లా

ఫైల్ నం. E1/01/MCP/2025 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది: 03.01.2025

1. కొటేషన్ ప్రకటన కొరకు పనుల సారాంశం

పని పేరు - అంచనా మొత్తం: 1) శానిటేషన్ సెక్షన్‌కు బ్లీచింగ్ మరియు సున్నం పొడి కొనుగోలు - 3.00 లక్షలు; 2) పరకాల పురపాలక సంఘంకు ట్రాక్టర్ (3 నం.ల ఐచర్) కొనుగోలు - 30.00 లక్షలు; 3) విలీనమైన రాజిపేట గ్రామం వద్ద బతుకమ్మ విగ్రహం స్థాపన - 0.80 లక్షలు; వివరాలు:- కొటేషన్ల స్వీకరణకు ఆఖరి తేది: 10.01.2025న మ. 03.00 గం.లకు. కొటేషన్లు తెరుచుట: అదే రోజున మ. 03.40 గం.లకు

2. ఇ-ప్రొక్యూర్‌మెంట్ కొరకు టెండరు ప్రకటన

మొత్తం రూ. 120.47 లక్షల అంచనా వ్యయంతో వివిధ గ్రాంట్ల క్రింద మొత్తం 13 నం.ల పనులు. 1వ పిలుపునకు 3 నం.ల పనులు (13.50 లక్షలు):- బిడ్ల డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 06.01.2025న ఉ. 11.00 గం.లకు, బిడ్ల డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 08.01.2025న ఉ. 11.00 గం.ల వరకు, బిడ్లు తెరుచు తేది & సమయం: 08.01.2025న ఉ. 11.10 గం.లకు. 4వ & 6వ పిలుపునకు 10 నం.ల పనులు (106.97 లక్షలు):- బిడ్ల డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 10.01.2025న ఉ. 11.00 గం.లకు, బిడ్ల డౌన్‌లోడింగ్ ముగింపు తేది: 24.01.2025న ఉ. 11.00 గం.ల వరకు, బిడ్లు తెరుచు తేది & సమయం: 24.01.2025న ఉ. 11.10 గం.లకు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పనుల తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.in లో చూడగలరు (ఫోన్ నం. 9347945697). ఎటువంటి కారణం తెలుపకుండా టెండరు రద్దు చేయు హక్కులు కమిషనర్ కలిగి ఉన్నారు.

సం/- కమిషనర్ (FAC), పరకాల పురపాలక సంఘం

DIPR RO No.8632-PP/CL/ADVT/1/2024-25, తేది: 04.01.2025

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

వరుడు కావలెను



★ కుల అస్తి పట్టింపు లేదు / చౌదరి / లేట్ మ్యారేజ్ / 41y/ 5'5" / కార్డియాలజిస్ట్ / వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ / FAIR/ మంచి ఆస్తి గల వధువుకు వరుడు కావలెను. వాట్సాప్ : 8501023957 AJH-002759

★ కుల అస్తి పట్టింపు లేదు / చౌదరి / 2nd మ్యారేజ్ / 43y/ 5'5' / Fair / డాక్టర్ (కార్డియాలజీ) మంచి ఆస్తి గల వధువుకు 1వ, 2వ వరుడు కావలెను. వాట్సాప్ : 9666832809 AJH-002759

★ 58y / రెండవ పెళ్ళి /విడో/ఫెయిర్/Govt. ఫ్యామిలీ పెన్షనర్ / సొంత ఇల్లు రెంట్స్ / పిల్లలు లేదు / ఏలాంటి బాదరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను.(కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 7995376608 AJH-002996

★ 60y / రెండవ పెళ్లి / విడో / ఫెయిర్ / Govt. ఫ్యామిలీ పెన్షనర్ /సొంత ఇల్లు రెంట్స్/వ్యవసాయ భూములు / ఏలాంటి బాధరబందీలేని ఏకైక వధువుకు వరుడు కావలెను. (కుల/ఆస్తి పట్టింపు లేదు) ఫోన్ : 9030858258 AJH-002996

★ రెండోపెళ్ళి /24y & 25y & 27y & 29y & 30y & 32y & 33y & 35y & 36y & 37y & 39y & 40y & 42y & 43y & 44y & 45y & 47y & 48y & 50y & 51y & 53y & 55y & 57y & 59y / "మా సేవ" (Since 1998):PH/WA:9291503949 AJH-002997

★ రెడ్డి / 2nd విడో / కుల, ఆస్తి ప్రసక్తి లేదు / డిగ్రీ, Age:30/ సొంత బిజినెస్‌లు అందమయిన వధువుకి వరుడు కావలెను /1st/2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. ఫోన్ : 9515673252 AJH-15375

★ గౌడ / B.Tech / C. Govt. ఇన్స్‌పెక్టర్ / కస్టమ్స్ & GST Dept./ మంచి జీతము / 5'5" ఎత్తు / 25 సం.ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్ : 9618008271 AJH-15377

★ కమ్మ / కుల ఆస్తి పట్టింపు లేదు /40y/ 5'5" / Fair / గైనకాలజిస్ట్ / డాక్టర్ / ఓన్ క్లినిక్ / 10 ఎకరాల పొలం / హౌస్ ఉన్న వధువుకు వరుడు కావలెను (అర్జెంట్) వాట్సాప్ : 9581263454 AJH-002759

★ కమ్మ / కుల ఆస్తి పట్టింపు లేదు /33y/ విడో / ఫెయిర్ / ఓన్ బస్ ట్రావెల్స్ బిజినెస్ / 8 ఎకరాల ల్యాండ్ / ఓన్ అపార్ట్‌మెంట్ ఉన్న వధువుకు 1వ, 2వ వరుడు కావలెను.Any Job OK. వాట్సాప్ : 7036487344 AJH-002759

★ పద్మశాలి / B.Tech / C. Govt. Asst. మేనేజర్ / HPCL / మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్ : 8297439565 AJH-15377

★ గౌడ / B.Tech / Govt. Asst. Exq. ఇంజనీర్ / RWS / మంచి జీతము / 5'5" ఎత్తు / 24 సం.ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్ : 7032058965 AJH-15377

★ SC మాల / ఏకైక కుమార్తె / B.Tech / C.Govt. సైంటిస్ట్ / DRDO / మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 9505687050 AJH-15377

★ రజక / ఏకైక కుమార్తె / B.Tech / Govt. Asst. ఇంజనీర్ / R&B Dept / మంచి జీతము / 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్ : 8897389698 AJH-15377

★ బ్రాహ్మణ / 30y / 5'3"/ డిగ్రీ / ప్రైవేట్ జాబ్ / అందమైన వధువుకి తగిన జాబ్ / బిజినెస్ / పురోహితం వరుడు కావలెను. ఫోన్ : 9701743336 AJH-15375

★ రెడ్డి / 2nd మ్యారేజ్ / కుల, ఆస్తి / పట్టింపు లేదు / 32y / డిగ్రీ / సొంత ఇల్లు, బిజినెస్, అందమైన వధువుకి వరుడు కావలెను. అన్ని వయస్సుల వారికి & కులాల వారికి 1,2వ సంబంధాలు కలవు. ఫోన్ : 9059507176 AJH-15375

★ రెడ్డి విడో / కుల, ఆస్తి ప్రసక్తి లేదు / Age:/35/B.Com/Private Job కలిగిన అందమయిన వధువుకి వరుడు కావలెను. All Caste Marriages Available. Ph: 8121347478 AJH-15375

★ వడ్డెర / ఏకైక కుమార్తె / వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ / M.Tech / C. Govt. Asst. మేనేజర్ / ఇన్‌కమ్ టాక్స్ Dept. / 5'5' ఎత్తు / 27 సం.ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618579861 AJH-15376

★ కాపు / 2వ పెళ్ళి / కుల ప్రసక్తి లేదు / B.Com /CA / ఓన్ బిజినెస్ / ఏకైక కుమార్తె / 5'4" ఎత్తు / 35 సం.ల అందమైన పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను. Ph: 9963757612 AJH-15376

★ SC హిందూ మాల / B.Tech, MBA, IIM, C.Govt. Asst. మేనేజర్ / IOCL / మంచి జీతము/ 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9908222406 AJH-15376

★ కుల పట్టింపు లేదు / Widow / ఆంధ్ర / 45y/ Govt. High School Teacher/Good Salary/Own House / Rents Agriculture Lands / పిల్లలు లేని అందమైన వధువుకు వరుడు కావలెను Ph: 9581155315 AJH-002837

★ కుల, ఆస్తి ప్రసక్తి లేదు / 55y/ Thirupati, Vijayawada / Family Pension / Own Business / Good Salary/Own House / Lands / 1 Girl Settled/ అందమైన వధువుకు వరుడు కావలెను Ph: 8374476725 AJH-002837

★ కుల పట్టింపు లేదు / 48y/ Widow / Andhra / పిల్లలు లేదు / Own షోరూమ్ బిజినెస్ / సొంత ఇల్లు / అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9989350417 AJH-002839

★ యాదవ / Govt. Employee / రెండవ మ్యాచ్ / విడో / 46 / Own Villa, Rents, Lands మంచి ఆస్తి ఆర్థికంగా స్థిరపడిన అందమైన వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 8125076013 AJH-002839

★ కుల పట్టింపు లేదు / 52y / Widow/ ఆంధ్ర / రైల్వే Employee / Good Salary / ఆస్తి ప్రసక్తి లేదు / సొంత ఇల్లు / వధువుకు వరుడు కావలెను. Ph: 7075948409 AJH-002839

★ ముదిరాజ్ / 25y / 5'4"/ B.Tech /C.Govt. బ్యాంక్ PO / ఇండియన్ బ్యాంక్ / మంచి జీతము / అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. ఫోన్:9963150162 AJH-15385

★ కుల పట్టింపు లేదు / విడో / 55 Y / Central Govt. Job / ఓన్ బిజినెస్ / రెంట్స్ / లాండ్స్ / మంచి ప్రాపర్టీ గల వధువుకి వరుడు కావలెను. సంప్ర. 80749 79279 AJB-756

వధువు కావలెను



★ నో క్యాస్ట్ 42 సంవత్సరాల లోపు విడో / డైవర్స్ వధువు కావలెను. నేను వైశ్య, B.A, ఉద్యోగం, డైరెక్ట్ సంప్రదించండి: 9494604396 AJH-002837

★ అందమైన 45-55 బాధ్యతలు లేని వధువు కావలెను. విడో / డైవర్స్ / అన్ మ్యారీడ్. కమ్మ, కాపు, బ్రాహ్మణ, క్యాస్ట్‌కి చెందిన వధువు కావలెను. డైరెక్టు నెం.8332871226 AJH-002837

★ కుల / వయస్సు ప్రసక్తి లేదు. గవర్నమెంట్ ఉద్యోగం / స్థిరపడిన వధువు కావలెను. డైరెక్ట్. K.V.P. PH: 9494604396 తెనాలి, గుంటూరు డిస్ట్రిక్ట్ AJH-002839

★ CNB /46y/5'8"/Govt. Emp / Business స్థిరాస్తులు కలిగిన వరునకు ఏ బాదరబందీలేని వధువు కావలెను. (అర్జెంట్)(నో బ్రోకర్స్) ఫోన్: 7816078811 AJH-002760

★ కాపు /43y/1st మ్యారేజ్ /5'9"/MA / FAIR / అందమైన వెల్ సెటిల్డ్ వరునకు OC లేక BC వధువు కావలెను. డైరెక్ట్ ఫోన్: 9346474999 VJA AJH-002760

★ కుల ప్రసక్తి లేదు 37 సం. గల బిజినెస్ చేసే వరునికి 1వ లేదా 2వ సంబంధం వధువు కావలెను. పిల్లలు ఉన్నా పర్వాలేదు. నో డౌరీ. ఫోన్: 9866724586, 6301943220 AJH-607

★ కాపు / డైవర్స్ / కుల పట్టింపు లేదు / 51/ బిజినెస్ & రెడ్డి / 1st మ్యారేజ్ / 33 / Govt.జాబ్ / స్థిరాస్తులు / వెల్ సెటిల్డ్ (రెడ్డి / కాపువారు) వరులకు వధువులు కావలెను. డైరెక్ట్: 9059018907 AJH-002996

★ కుల పట్టింపు లేదు / 35 / ప్రైవేట్ జాబ్ చేయుచున్న వరునికి 1వ/2వ/పిల్లలున్నా పర్వాలేదు / పేదరికం అయినా / ఏ బాదరబందీలేని సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువు కావలెను నో బ్రోకర్స్, డైరెక్ట్:9952882957 AJH-002997

★ SC మాల / కట్న ప్రసక్తి లేదు / B.Tech / Govt. Asst. ఇంజనీర్ / ట్రాన్స్‌కో /మంచి జీతం/ 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 AJH-15376

★ క్రిస్టియన్ మాల / కట్న ప్రసక్తి లేదు / 29y/5'9"/B.Tech / C. Govt. Asst. మేనేజర్ / SBI / మంచి జీతము / అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9963150162 AJH-15376

★ రజక / M.Com / Govt. Asst. స్టాటిస్టికల్ ఆఫీసర్ / MRO ఆఫీస్ / మంచి జీతము/ 5'4" ఎత్తు / 26 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6305007091 AJH-15376

★ కుమ్మరి / కట్న ప్రసక్తి లేదు / B.Tech / C.Govt. Jr. ఇంజనీర్ / BSNL / మంచి జీతము/ 5'11" ఎత్తు / 29 సం.ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 9618008271 AJH-15376

★ విశ్వబ్రాహ్మణ / CA / చార్టెడ్ అకౌంటెంట్ / మంచి జీతము/ 5'10" ఎత్తు / 28 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6305007091 AJH-15376

★ బెస్త గంగపుత్ర / M.Tech / Govt. Asst. ఇంజనీర్ / ట్రాన్స్‌కో / మంచి జీతం / 5'10" ఎత్తు / 29 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9618007652 AJH-15377

★ వడ్డెర / కట్న ప్రసక్తి లేదు/ M.Tech, NIT/C. Govt. సైంటిస్ట్/ DRDO / మంచి జీతం / 6' ఎత్తు / 30 సం.ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9618007652 AJH-15377

★ కమ్మ / B.Tech/Govt. జాబ్ / రైల్వే / ఎలక్ట్రికల్ Dept. / మంచి జీతము / 5'11" ఎత్తు / 29 సం.ల వరుడికి అందమైన వధువు కావలెను. Ph: 8790689274 AJH-15377

★ వైశ్య డైవర్సీ :వయస్సు 56, పిల్లలు లేరు, ఒంటరి మంచి సంపాదన కలిగిన వరునికి వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు, నోబ్రోకర్స్ డైరెక్ట్ సంప్రః 73862 13167 AJG-2485

★ ఆర్యవైశ్య అబ్బాయి 36, M.Ed., ప్రైవేట్ లెక్చరర్, జూ.డి. కాలేజ్, వ్యవసాయం, వీరయ్య 9121325068. కోమట్ల అమ్మాయి కావలెను. 1వ M.9.HB మునుగోడు రోడ్ ట్రాయంచి. AJY_223959

★ డైరెక్ట్ కాంటాక్ట్ : ఆర్యవైశ్య 46 Yrs., 5.5 బిజినెస్, జాబ్, 30 కోట్ల స్థిరాస్తి గల అబ్బాయికి అందమైన 1వ, 2వ అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్) Cont : 7995585722, 9848817137 AJT - 4889

కళ్యాణ వేదిక

★ ఫ్రీ రిజిస్ట్రేషన్: / అన్ని కులాల Govt / SWE / డాక్టర్స్ / NRI / బిజినెస్ / PVT/2ND పెళ్లి సంబంధాలకై నిజాయితీగా సర్వీస్. ఈ ప్రకటన 100% నిజం. ఫోన్: 9866775306 AJH-002760

★ Brahmin, పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Shyam, Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002761

★ Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Srinivas Ph: 7032018248 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002761

★ Padmashali - పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Shyam. Ph: 7093969457 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002761

★ Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర. Verified Profiles & నమ్మకమైన సంస్థ. ★ Srinivas. Ph: 7032018248 / Blue Trend Matri Monial (P) Ltd. AJH-002761

★ Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE / Govt / Doctors / MNC / Matches / Late & 2nd Matches కై సంప్ర: Ph: 9704656103 / 9533608887 (Whatsapp) AJH-002996

★ రజక / డాక్టర్స్ / ఇంజనీర్స్ / Govt. Jobs / Abroads / పెళ్ళి సంబంధాలకై సంప్రదించండి. కోట్ల శ్రీనివాస్. ఫోన్ : 8106303155 / 9391265304 AJH-002997

★ కమ్మ చౌదరి మ్యారేజస్ /సైరేంజ్/ హైస్టడీస్ / Engineers & Doctors / ఇండియా మరియు బ్రాడ్, లెట్, 1st & 2nd సంప్ర: 9394002999, Mail:amaravatimatri25@gmail.com AJH-002997

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో / కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే. పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ. జాస్తి సైదారావు. ఫోన్ : 9182731506/9705588313 AJH-002760

★ వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 26-01-2025 వ తేది ఉ. 10 గం.లకు 66వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ. 2 గం.లకు 21వ పునర్వి వివాహ పరిచయ వేదిక విజయవాడ K.B.N. కాలేజీలో జరుగును. సంప్ర. 99895 00130 AJB-1166

V.I.P MATRIMONY

ONLY FOR KAMMA'S

కమ్మ వారి వివాహ సంబంధాలకై ప్రత్యేకముగా నడుపబడుచున్న సంస్థ

8143538383

వధువు కావలెను

★ కమ్మ (INDIA) : 27 6" IIT IIM 50LPA 75 Cr. Seeks Merit Girl From Good Family ★ 8143538383

★ కమ్మ (INDIA): 28 6'2" BE (Bits) IIM 66LPA 20 Cr. Seeks well settled Bride with Good Looking ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 25 5'10" MS BUSINESS 500Cr. Hyd Seeks V-Fair Bride From Well Settled Family ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 26 5'11" BS (USA) BUSINESS HYD 300Cr. Seeks V.Fair Girl with Settled Family ★ 8143538383

★ కమ్మ (USA): 28 5'8" MS $220K 50 Cr. ★ 26 5'11" MS $250K 70 Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 26 6'2" V.FAIR MS. Ph.D, $150K 100Cr. Seeks INDIA / USA Bride from Good Family ★ 8143538383

★ కమ్మ (AUS): 27 6'2" MS $150K P.R. 40Cr. ★ 28 5'11" MS $200K CITIZEN 30Cr. ★ 8143538383

★ కమ్మ (DOCTOR): 27 6'1" V.FAIR MD(GM) HYD. 200Cr. ★ 26 5'10" MS (ORTHO) 500Cr. ★ 8143538383

★ కమ్మ (DOCTOR): 28 5'11" MD(DERMA) 600Cr. Seeks Doctor / Engg. Well Settled Business Family Bride ★ 8143538383

★ కమ్మ (DIVORCE): 26 6'1" MBA BUSINESS 200Cr. Own Pharma Industry Hyd. Seeks 1st/2nd Bride From Good Family. ★ 8143538383

వరుడు కావలెను

★ కమ్మ (BUSINESS): 23 5'5" V.FAIR 5'6" MBA BUSINESS Family Hyd 700Cr. Seeks Well Settled Business Boy ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 25 5'4" V.FAIR M.Sc BUSINESS 500 Cr. Seeks Well Settled Boy Job Business ★ 8143538383

★ కమ్మ (BUSINESS): 26 5'3" V.FAIR MS BUSINESS 500 Cr. Seeks Only Business Family Boy. ★ 8143538383

★ కమ్మ (USA): 24 5'6" V.FAIR BE(IIT), MS $220K 70Cr. ★ 25 5'4" V.FAIR BE(Bits), MS $195K 50Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 23 5'7" V.FAIR Green Card BS $140K 200Cr. ★ 26 5'8" CITIZEN (US) $100K 100Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 24 5'7" MS $100K 100Cr. ★ 23 5'5" MS $120K 8Cr. ★ 8143538383

★ కమ్మ (USA): 23 5'4" MS, BE (NIT) $180K 150Cr. ★ 25 5'8" V.FAIR MS $100K 100Cr. ★ 8143538383

★ కమ్మ (INDIA): 24 5'5" V.FAIR MBA (IIM) 52LPA 50Cr. ★ 26 5'6" V.FAIR CA 30 LPA 20Cr. ★ 8143538383

★ కమ్మ (INDIA): 23 5'4" V.FAIR BE (IIT) 45LPA 30Cr. ★ 25 5'7" V.FAIR M.Tech 26LPA 50Cr. ★ 8143538383

★ కమ్మ (DIVORCE): 24 5'6" V.FIAR IIT MS $220K 40Cr. ★ 26 5'8" V.FAIR BE, MBA 100 Cr. ★ 8143538383

★ అన్ని కులాల వారికి సెకండ్ మ్యారేజ్ సంబంధాలు చూడబడును. (గవర్నమెంట్ ఎంప్లాయిస్, ప్రైవేట్ ఎంప్లాయిస్, సాఫ్ట్‌వేర్ మరియు డాక్టర్లు) సెల్: 9676982230 AJD:207858

★ కుందూరు రమేష్ రెడ్డి ఉచిత వివాహ పరిచయ వేదిక. రెడ్డి కులస్తులకు ఉచితంగా దేశీ/విదేశీ, మొదటి/రెండవ వివాహ సంబంధాలు కుదుర్చబడును. సంప్రః 8247814207, హన్మకొండ. AJW-27771

గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనకర్తలకు సంబంధించి ఎట్టి హామీలను పత్రిక ఇవ్వదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల పూర్వాపరాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. మీరు జరిపే లావాదేవీలకు ఆంధ్రజ్యోతి పత్రిక బాధ్యత వహించదు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.

9985921380, 9703618806, 9985921386

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

■ ఆర్కే RK



కొత్తపలుకు

ముప్పే... బాబూ!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మళ్లీ మొదటికే వచ్చారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ ఎదుర్కోనన్ని ఆటుపోట్లను, అవమానాలను, కష్టాలను 2019–2024 మధ్య ఎదుర్కొని నిలబడ్డ ఆయన మారతారనీ, అభివృద్ధి – సంక్షేమంతోపాటు రాజకీయం అజెండాగా పెట్టుకొని పనిచేస్తారని అందరూ ఆశించారు. ఆయన కూడా నేను మారాననీ, తనలో 1995 నాటి చంద్రబాబును 2.0 రూపంలో చూస్తారని అధికారంలోకి రాగానే నమ్మబలికారు. ఆరు నెలలు గడిచే సరికి ఆయనలో 1999–2004 నాటి చంద్రబాబు తన్నుకు వచ్చారు. పద్నాలుగేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు 2019లో ఓడిపోయిన తర్వాత పలకరించేవారు కూడా కరువై అల్లాడిపోయారు. పార్టీ నిర్వహణ కూడా పెను భారంగా మారింది. 2020లో వచ్చి పడిన కొవిడ్ పుణ్యమా అని మనుషులు కనపడకపోయినా ఆయన నెట్టుకొచ్చారు. 2022 నాటికి జగన్‌రెడ్డి అరాచక పాలన పుణ్యమా అని తెలుగుదేశం

> తనకు ఏం కావాలో స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం కలుషితమైందని అందరికీ తెలుసు. చంద్రబాబు సహా రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయడానికి జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డజను మంది అధికారులను ఎంచుకొని వారికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్న భావన ముఖ్యమంత్రి పేషీ అధికారుల్లో కనిపించడం లేదు. అంతా మొక్కుబడిగా సాగిపోతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. జగన్‌రెడ్డిని నమ్ముకుంటే ఆయనే తమను కష్టాల్లో కూడా చూసుకుంటారన్న నమ్మకం ఆయన కోసం పనిచేసిన అధికారుల్లో ఉండేది. ఇప్పుడు అలాంటి భరోసాను చంద్రబాబు ఇవ్వలేకపోతున్నారు. రాజకీయ ప్రత్యర్థుల విషయంలోనే కాదు– హద్దు మీరి ప్రవర్తిస్తున్న సొంత పార్టీ శాసనసభ్యులను కూడా చంద్రబాబు కట్టడి చేయలేకపోతున్నారు.

పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం పురుడు పోసుకుంది. జన సేనాని పవన్ కల్యాణ్ కూడా చంద్రబాబుతో చేతులు కలపాల్సిన పరిస్థితిని జగన్‌రెడ్డి కల్పించారు. దీంతో చంద్రబాబు రాజకీయంగా నిలదొక్కుకున్నారు. రాజకీయమే ప్రశ్నార్థకంగా మారిన దశ నుంచి నాలుగో పర్యాయం అధికార పగ్గాలు చేపట్టగలిగారు. అయితే, తాను మారానని చెప్పుకొన్న ఆయన ఈ ఆరు నెలల్లో నిజంగా మారారా లేదా అన్న ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పనితీరును పక్కన పెడితే తెలుగుదేశం పార్టీ అధినేతగా ఆయన పోకడలు పార్టీ శ్రేణుల్లో నైరాశ్యాన్ని నింపుతున్నాయి. రాజకీయంగా తనకు ఏమి కావాలన్న దానిపై ఆయనలో స్పష్టత కొరవడినట్టు ఈ ఆరు నెలల్లో చోటుచేసుకున్న పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. 2029 తర్వాత చంద్రబాబు రాజకీయ జీవితం గురించి ఇప్పుడే చెప్పలేం. అయితే, 2029 తర్వాత తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు ఏమిటనేది ప్రశ్నార్థకం కాకూడదని పార్టీ నాయకులు, శ్రేణులు బలంగా అభిప్రాయపడుతున్నారు.

భవిష్యత్తుపై భరోసా కోసం...

జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనకు వ్యతిరేకంగా ప్రజలు సమీకృతం కావడంతో పాటు జనసేన, బీజేపీ కూడా చేతులు కలపడంతో... చంద్రబాబు మాత్రమే కాదు, రాష్ట్రం కూడా గండం నుంచి బయటపడింది. ఇప్పుడు 2029 నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన పార్టీ వర్గాలనే కాదు – రాష్ట్ర హితవు కోరే వారిని కూడా కలవరపరుస్తోంది. వయసు రీత్యా 2029 నాటికి చంద్రబాబు క్రియాశీలంగా ఉండగలరో లేదో తెలియదు. రాష్ట్రంలో భవిష్యత్ రాజకీయాలు జగన్‌రెడ్డి, పవన్ కల్యాణ్, లోకేశ్ చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయి. జగన్‌రెడ్డి ఇప్పటికే తాను ఏమిటో రుజువు చేసుకున్నారు. అతనికి కొన్ని వర్గాలు బలంగా మద్దతు ఇస్తున్నాయి. పవన్ కల్యాణ్‌కు కాపు సామాజిక వర్గం పూర్తి అండగా ఉంది. మిగతా వర్గాలకు చేరువ కావడానికి ఆయన ప్రయత్నాలు మొదలుపెట్టారు. మరి లోకేశ్ పరిస్థితి ఏమిటి? మర్రిచెట్టు కింద మరో మొక్క బతికి బట్టకట్టదు అన్నట్టుగా అతడి పరిస్థితి ఉంది. చంద్రబాబు నీడలోనే ఆయన ఉన్నారు. చంద్రబాబు క్రియాశీలంగా ఉన్నంత వరకు లోకేశ్ ఎదగడం కష్టం. 'యువగళం' పేరిట పాదయాత్ర చేసినంత మాత్రాన అతడు ప్రజా నాయకుడిగా ఎదిగాడని భావించలేం. లోకేశ్‌కు మంత్రిత్వశాఖ కేటాయింపులో కూడా చంద్రబాబు తప్పు చేశారు. ఇప్పుడు లోకేశ్ ఎంతగా శ్రమించి పెట్టుబడులు, కంపెనీలు తీసుకువచ్చినా ఆ ఖ్యాతి చంద్రబాబు ఖాతాలోకే పోతుంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు ఐటీతో పాటు ఇతర రంగాల్లోకి పెట్టుబడులను ఆకర్షించే ఓపిక, నైపుణ్యం ఆయనలో ఉండేవి కావు. ఆ కారణంగా ఆ సబ్జెక్టులను కుమారుడు కేటీఆర్‌కు అప్పగించి తాను రాజకీయాలపై దృష్టిని కేంద్రీకరించారు. చంద్రబాబు, లోకేశ్ పరిస్థితి వేరు. అభివృద్ధికి చిరునామాగా చంద్రబాబుకు ఇప్పటికే పేరుంది. అధికారంలో ఉన్నంత సేపు చంద్రబాబు అభివృద్ధిపైనే దృష్టి కేంద్రీకరించేవారు. రాజకీయాన్ని గాలికి వదిలేసేవారు. ఈ కారణంగానే 2004, 2019లో ఆయన ఓడిపోయారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమంతోపాటు రాజకీయానికి కూడా సమ ప్రాధాన్యత ఇచ్చేవారు. ఈ కారణంగానే ఆయన అత్తెసరు మెజారిటీతోనైనా 2009లో తిరిగి అధికారంలోకి రాగలిగారు.

లోకేశ్ భవిష్యత్తు...

తెలుగుదేశం పార్టీని ఎన్టీ రామారావు ఏర్పాటు చేసినప్పటికీ 1995 తర్వాత నుంచి పార్టీని నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. ఎన్టీఆర్ వేసిన బలమైన పునాది, చంద్రబాబు చాణక్యం కారణంగా నాలుగు దశాబ్దాలు దాటినా తెలుగుదేశం పార్టీ మనుగడ సాగిస్తోంది. ఇప్పుడు చంద్రబాబుకు వయోభారం కమ్ముకొస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు తర్వాత ఎవరు? అనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నం అవుతుంది. చంద్రబాబు వారసుడిగా లోకేశ్ తెర మీద కనిపిస్తున్నప్పటికీ... చంద్రబాబు నీడ మీద పడుతున్నంత వరకు ప్రత్యామ్నాయ నాయకుడిగా అతడికి ప్రజామోదం లభిస్తుందా? అన్నది ప్రశ్నార్థకమే. 2029 నాటికి రాష్ట్ర రాజకీయాలు జగన్‌రెడ్డి, పవన్ కల్యాణ్, లోకేశ్ మధ్యనే కేంద్రీకృతం అవుతాయి. జగన్‌రెడ్డి, పవన్ కల్యాణ్ సొంత పార్టీలకు సారథ్యం వహిస్తున్నారు. లోకేశ్ పరిస్థితి అది కాదు. చంద్రబాబు ఉన్నంత వరకు అతను పార్టీ అధ్యక్షుడు కాగలరా? చంద్రబాబు ఫిజికల్‌గా ఎంత ఫిట్‌గా ఉన్నప్పటికీ 2029 నాటికి ఆయన ఎనిమిది పదుల వయసుకు చేరువవుతారు. అంటే ఈ లోపుగానే చంద్రబాబుకు ప్రత్యామ్నాయంగా తెలుగుదేశం పార్టీని నడిపించగల సత్తా లోకేశ్‌లో ఉందని అటు ప్రజలతోపాటు ఇటు శ్రేణుల్లోనూ నమ్మకం కలిగించాలి. ప్రస్తుతానికి జనసేనాని పవన్ కల్యాణ్ భారతీయ జనతా పార్టీకి ఆప్తుడుగా ఉంటున్నారు. బీజేపీ అగ్ర నాయకత్వం రాష్ట్రంలో చంద్రబాబును పూర్తిగా నమ్ముతుందని భావించలేం. పవన్ కల్యాణ్‌ను ప్రోత్సహించడం ద్వారా తెలుగుదేశం పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదగాలని బీజేపీ అగ్రనాయకత్వం తలపోస్తోందని చెబుతున్నారు. అవినీతి కేసుల కారణంగా జగన్‌రెడ్డి బలహీనపడితే ఆ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ ఆక్రమించే అవకాశం ఉంది. ఎన్నికలు జరిగి ఏడు నెలలైనా, తెలుగుదేశం పార్టీ మద్దతుతో కేంద్రంలో నరేంద్ర మోదీ మూడో పర్యాయం అధికారంలోకి రాగలిగినా జగన్‌రెడ్డి కేసులలో కదలిక మాత్రం ఉండటం లేదు. పవన్ కల్యాణ్ విషయానికి వస్తే ఆయన ఎప్పుడైనా కేంద్రంలో మంత్రి పదవి చేపట్టే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే రాష్ట్రంలో తన స్థానంలో తన సోదరుడు నాగబాబును మంత్రిని చేయాలని ఆయన కోరినట్టుగా ప్రచారం జరుగుతోంది. పవన్ కల్యాణ్ ఇటీవల రాష్ట్రంలో హిందూ ధర్మాన్ని నెత్తికెత్తుకున్నారు. అంటే, బీజేపీతో ఆయనకు బలమైన అనుబంధం ఏర్పడిందని భావించాలి. రాజకీయాలు నిశ్చలంగా ఉండవు. ఎప్పుడైనా ఏదైనా జరగవచ్చు. తెలుగుదేశం–జనసేన మధ్య ప్రస్తుతం ఉన్న సఖ్యత 2029 వరకు కూడా కొనసాగుతుందని చెప్పలేం. ఈ రెండు పార్టీల మధ్య చిచ్చు పెట్టడానికి వైసీపీ తన ప్రయత్నాలను ఇదివరకే మొదలుపెట్టింది. వయోభారం కారణంగా చంద్రబాబు పనైపోతుందని, జాతీయ స్థాయిలో అత్యధిక పాపులారిటీ కలిగి ఉన్న పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి సారథ్యం వహిస్తే బాగుంటుందని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి వంటి వారు ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారు. 2029 నాటికి తెలుగుదేశం పార్టీ ముందు ఉండబోయే సవాళ్లు ఇవే. ఈ నేపథ్యంలో చంద్రబాబు, లోకేశ్‌ల ఆలోచనలు ఏమిటో తెలియదు. ఇరువురూ క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు.



చంద్రబాబు మారారా...

తనలో 1995 నాటి వెర్షన్ చూస్తారని చంద్రబాబు చెప్పినప్పటికీ ఆయనలో 1999–2004 మధ్య పుట్టుకొచ్చిన చంద్రబాబే కనిపిస్తున్నారని అంటున్నారు. అధికారిక కార్యక్రమాలతో బిజీ బిజీగా ఉంటూ మంత్రులు, పార్టీ నాయకులకు కూడా సమయం ఇవ్వడం లేదని అంటున్నారు. ప్రభుత్వపరంగా వెలువడుతున్న అధికారిక ప్రకటనలు కూడా తెలుగుదేశం పార్టీకి మేలు చేసేవిగా కనిపించడం లేదు. 1999 తర్వాత తనను తాను సీఈవోగా పిలిపించుకోవడానికి ముచ్చటపడిన చంద్రబాబు జీఎంఆర్ ఎయిర్‌పోర్టుకు, ఔటర్ రింగురోడ్డుకు, సైబరాబాద్ నగరానికి అంకురార్పణ చేశారు. హైదరాబాద్ నగరంపై అధికంగా ఫోకస్ చేశారు. దీంతో అభివృద్ధి అంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతం అవుతోందని ఉమ్మడి రాష్ట్రంలోని మిగతా 22 జిల్లాల ప్రజలు అభిప్రాయపడ్డారు. సంపద సృష్టి గురించి అప్పుడు కూడా పదే పదే మాట్లాడేవారు. గిరిజన తండాలకు వెళ్లినప్పుడు వారి మౌలిక సమస్యలు అడిగి తెలుసుకోకుండా సత్యం కంప్యూటర్స్ రామలింగరాజువలె అందరూ అభివృద్ధిలోకి రావాలని చెప్పేవారు. తాగడానికి గుక్కెడు నీటి కోసం ఎదురు చూసే గిరిజనుల వద్ద సత్యం రామలింగరాజు గురించి చెబితే వికటించదా? అదే జరిగింది. తాను ఫోకస్ పెట్టిన హైదరాబాద్ నగరంలో కూడా 2004 ఎన్నికల్లో చంద్రబాబుకు పరాభవమే మిగిలింది. ఐఎస్బీ వంటి సంస్థలు హైదరాబాద్‌లో ఏర్పడటానికి చంద్రబాబే కారణమని ఇప్పటికీ పలువురు ప్రశంసిస్తారు. అంత మాత్రాన ఆ ప్రశంసలు ఓట్లు తెచ్చిపెట్టవని రుజువైంది. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పంచవర్ష ప్రణాళికలను అమలు చేశారు. అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులను దృష్టిలో పెట్టుకొని ఐదేళ్లలో చేయగలిగే వాటి గురించి మాత్రమే ఆయన చెప్పేవారు. ఫలితంగానే ఆయన మరణించే వరకు ప్రధానిగానే ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి పరిస్థితులతో ఇప్పటి పరిస్థితులను పోల్చలేం. ఆర్థిక సంస్థల వద్ద నిధులు మూలుగుతున్నాయి. ఎంతటి భారీ ప్రాజెక్టుకైనా నిధుల కొరత అడ్డంకి కావడంలేదు. లక్ష కోట్లతో తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారంటే నిధుల లభ్యత ఉన్నందునే కదా! ఇప్పుడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి–పెన్నా నదుల అనుసంధానానికి పూనుకుంది. పదేళ్లు దాటినా పోలవరం ప్రాజెక్టు పూర్తి కానందున ఇలాంటి భారీ ప్రాజెక్టులపై ప్రజలకు సహజంగానే అనుమానాలు ఉంటాయి. సంకల్ప బలం ఉండి సరైన ప్రణాళికతో వ్యవహరించి ఉంటే పోలవరం ఎప్పుడో పూర్తయ్యేది. 2014–2019 మధ్య కాలంలో వలె ఇప్పుడు చంద్రబాబు మళ్లీ పోలవరం–రాజధాని అమరావతి జపం చేస్తున్నారు. అమరావతి నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్న అపోహలు ఇతర ప్రాంతాల ప్రజల్లో ఏర్పడటానికి కారణం అవుతున్నారు. అమరావతిపై గతంలో విషం కక్కిన శక్తులే మళ్లీ విషం చిమ్మడానికి సిద్ధమవుతున్నాయి.

> 'తెలుగుదేశం పార్టీ భవిష్యత్తుకు ఢోకా లేదు– జగన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి రానివ్వబోం' అన్న భరోసా పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఇవ్వనంత వరకు తెలుగుదేశం పార్టీలో సణుగుళ్లు, గొణుగుళ్లు ఉంటూనే ఉంటాయి. పార్టీ భవిష్యత్తుకు ఢోకా లేదని రుజువు చేసినప్పుడే పార్టీలో క్రమశిక్షణ ఉంటుంది. లేకపోతే ఎవరికి వారు పక్కచూపులు చూస్తుంటారు. అధికారం ఉన్నంత వరకు పబ్బం గడుపుకొని ఆ తర్వాత నువ్వు కాకపోతే మరొకరు అని గెంతుతారు. ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు నమ్మాలంటే ఏం చేయకూడదో అవన్నీ జగన్‌రెడ్డి హయాంలో చేశారు. రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయించడానికి ఏం చేయవచ్చునో కూడా అతనే చేసి చూపించాడు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఈ దిశగా కొత్తగా మేధోమథనం చేయాల్సిన అవసరం లేదు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం వాళ్లను అరెస్టు చేసి న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టిన తర్వాత మాత్రమే వారిపై ఏమి కేసు పెట్టారో తెలిసేది. ఇప్పుడు అలా కాకుండా అరెస్టుల విషయం మరచిపోయి ఎఫ్ఐఆర్‌లోని వివరాలను పోలీసులు ముందుగానే చెప్పేస్తున్నారు. దీంతో ఆయా కేసులు మోపబడినవారు న్యాయ స్థానాల నుంచి ఉపశమనం పొందుతున్నారు. తెలుగుదేశం కేడర్‌లో అసంతృప్తి రగలడానికి ఇది ప్రధాన కారణం.

జగన్ అరాచకాలు మరిచిపోతే ఎలా?

ఇప్పుడు మళ్లీ అసలు విషయానికి వద్దాం! అభివృద్ధి అజెండాను జపిస్తున్న చంద్రబాబు రాజకీయ అజెండాను మళ్లీ పక్కన పడేశారు. తన రాజకీయ ప్రత్యర్థి జగన్‌రెడ్డిని కట్టడి చేసే విషయమై శక్తియుక్తులు అన్నింటినీ ఉపయోగించవలసిన

> 2029 నాటికి రాష్ట్ర రాజకీయాలు జగన్‌రెడ్డి, పవన్ కల్యాణ్, లోకేశ్ మధ్యనే కేంద్రీకృతం అవుతాయి. జగన్‌రెడ్డి, పవన్ కల్యాణ్ సొంత పార్టీలకు సారథ్యం వహిస్తున్నారు. లోకేశ్ పరిస్థితి అది కాదు. చంద్రబాబు ఉన్నంత వరకు అతను పార్టీ అధ్యక్షుడు కాగలరా?

ఆయన ప్రభుత్వ కార్యక్రమాల సమీక్షలతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఆరు నెలలు గడచినా రాజకీయ ప్రత్యర్థిపై కేసులకు అతీగతీ కనపడటంలేదు. దీంతో పార్టీ శ్రేణులే కాదు– గత ఐదేళ్ల చీకటి పాలనను గుర్తుచేసుకుంటున్న ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. జగన్‌రెడ్డి అనే రాజకీయ భూతాన్ని సీసాలో బంధించనంత వరకు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్న వారిలో కూడా ఆందోళన ఉంటుంది. జగన్మోహన్‌రెడ్డి విషయం అటుంచితే, ఆయన చుట్టూ ఉన్న వారి అరాచకాలను గుర్తించి కేసులు పెట్టి కట్టడి చేయడంలో కూడా ప్రభుత్వం విఫలమవుతోంది. కోడి కెలికినట్టుగా ఆయా కేసులను కెలికి వదిలేస్తున్నారు. దీంతో మనకు ఏమీ కాదులే అన్న ధీమా వైసీపీ నాయకుల్లో ఏర్పడుతోంది. ఈ పరిస్థితిని తెలుగుదేశం శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. తనకు ఏం కావాలో స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం కలుషితమైందని అందరికీ తెలుసు. చంద్రబాబు సహా రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయడానికి జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు డజను మంది అధికారులను ఎంచుకొని వారికి పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. చంద్రబాబు కోసం అలా చొక్కాలు చించుకొనే అధికారులు ఇప్పుడు కనిపించడం లేదు. ముఖ్యమంత్రి పేషీ కూడా బలహీనంగా ఉంది. అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్న భావన ముఖ్యమంత్రి పేషీ అధికారుల్లో కనిపించడం లేదు. అంతా మొక్కుబడిగా సాగిపోతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. జగన్‌రెడ్డిని నమ్ముకుంటే ఆయనే తమను కష్టాల్లో కూడా చూసుకుంటారన్న నమ్మకం ఆయన కోసం పనిచేసిన అధికారుల్లో ఉండేది. ఇప్పుడు అలాంటి భరోసాను చంద్రబాబు ఇవ్వలేకపోతున్నారు. రాజకీయ ప్రత్యర్థుల విషయంలోనే కాదు– హద్దు మీరి ప్రవర్తిస్తున్న సొంత పార్టీ శాసనసభ్యులను కూడా చంద్రబాబు కట్టడి చేయలేకపోతున్నారు. అరాచకంగా వ్యవహరించడంలో కొందరు తెలుగుదేశం శాసనసభ్యులు జగన్ హయాంను ఆదర్శంగా తీసుకుంటున్నారు. అప్పుడు శాసనసభ్యులకు జగన్‌రెడ్డి అంటే భయం ఉండేది. ఇప్పుడు అలాంటి భయం కూడా లేదు. కొంత మంది శాసనసభ్యుల దుశ్చర్యల గురించి వింటూ ఉంటే రోతగా ఉంటోంది. శాసనసభ్యుడు అనే పదానికి నిర్వచనం మారిపోయింది. రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత శాసనసభ్యులు లాభపడ్డారన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించింది. అది జగన్‌రెడ్డి హయాంలో మరింత వికృతంగా విస్తరించింది. తెలంగాణలో కేసీఆర్ అధికారం కోల్పోవడానికి బీఆర్ఎస్ శాసనసభ్యుల దందాలు కూడా ఒక కారణం. జగన్‌రెడ్డి కేవలం 11 సీట్లకే పరిమితం కావడానికి ఆయన పోకడలు, ప్రాధాన్యతల లోపాలతో పాటు శాసనసభ్యుల అరాచకాలు కూడా కారణం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో క్షేత్ర స్థాయిలో పలువురు ఎమ్మెల్యేలపై వ్యతిరేకత బలపడుతోంది. జనసేన, బీజేపీ బలంతో నిమిత్తం లేకుండానే తెలుగుదేశం పార్టీకి సొంతంగానే కావాల్సినంత మెజారిటీ ఉంది. ఈ పరిస్థితుల్లో కూడా చంద్రబాబు సొంత పార్టీ వారిని కట్టడి చేయలేకపోతే అది చేతగానితనమే అవుతుంది. కడప జిల్లాలో విమానాశ్రయానికి సంబంధించిన పనులను తమకే ఇవ్వాలంటూ స్థానిక ఎమ్మెల్యే అండతో ఎయిర్‌పోర్టు మేనేజర్‌ను కిడ్నాప్ చేయడాన్ని ఎలా చూడాలి? ఇలాంటి పనులు చేయడానికే అయితే ప్రభుత్వం మారడం ఎందుకు? జగన్‌రెడ్డి పాలనలో ఇంతకంటే దౌర్జన్యాలను పకడ్బందీగా చేశారు కదా? హద్దు మీరుతున్న శాసనసభ్యులను కట్టడి చేయడానికి పూనుకోని పక్షంలో ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా ఉంటుందా? అదే జరిగితే ప్రభుత్వం నుంచి పవన్ కల్యాణ్ వైదొలగినా ఆశ్చర్యపోవాల్సింది ఏమీ ఉండదు. ఇలాంటి అంశాలపై ఫోకస్ పెట్టవలసింది పోయి రాష్ట్రంలో మరో ఏడు ఎయిర్‌పోర్టుల నిర్మాణం చేపడతామని ప్రకటించడంలో ఔచిత్యం ఏమైనా ఉందా? ఎయిర్‌పోర్టుల వల్ల అభివృద్ధి జరుగుతుందా? ప్రజల కడుపు నిండుతుందా? ప్రభుత్వపరంగా ప్రాధాన్యతలు ఎలా ఉండాలి? పార్టీ పరంగా ప్రాధాన్యతలు ఏమిటి? అనే విషయాలపై ముఖ్యమంత్రికి స్పష్టత ఉండాలి. ఈ రెండింటినీ సమతుల్యం చేసుకుంటూ పోతేనే ప్రజల్లోనూ, కేడర్‌లోనూ ఫీల్ గుడ్ భావన ఏర్పడుతుంది.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

మోదీని చూసైనా...

రాజకీయ కక్ష సాధింపులకు తాము దూరమని చంద్రబాబు చెప్పడాన్ని స్వాగతించాల్సిందే! అయితే, తప్పు చేసిన వారిని వదిలిపెడితే అది చేతగానితనమే అవుతుంది. గత ప్రభుత్వంలో తప్పు చేసిన వారిని ఒదిలిపెట్టబోమని ముఖ్యమంత్రి కూడా చెబుతున్నారు. అయితే అది ఎప్పుడు? అని పార్టీ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. 'తెలుగుదేశం పార్టీ భవిష్యత్తుకు ఢోకా లేదు– జగన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి రానివ్వబోం' అన్న భరోసా పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఇవ్వనంత వరకు తెలుగుదేశం పార్టీలో సణుగుళ్లు, గొణుగుళ్లు ఉంటూనే ఉంటాయి. పార్టీ భవిష్యత్తుకు ఢోకా లేదని రుజువు చేసినప్పుడే పార్టీలో క్రమశిక్షణ ఉంటుంది. లేకపోతే ఎవరికి వారు పక్కచూపులు చూస్తుంటారు. అధికారం ఉన్నంత వరకు పబ్బం గడుపుకొని ఆ తర్వాత నువ్వు కాకపోతే మరొకరు అని గెంతుతారు. ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు నమ్మాలంటే ఏం చేయకూడదో అవన్నీ జగన్‌రెడ్డి హయాంలో చేశారు. రాజకీయ ప్రత్యర్థులను కట్టడి చేయించడానికి ఏం చేయవచ్చునో కూడా అతనే చేసి చూపించాడు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఈ దిశగా కొత్తగా మేధోమథనం చేయాల్సిన అవసరం లేదు. కట్టుతప్పుతున్న ఎమ్మెల్యేలను, ఇతరులను వెంటనే అదుపులో పెట్టాలి. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం వాళ్లను అరెస్టు చేసి న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టిన తర్వాత మాత్రమే వారిపై ఏమి కేసు పెట్టారో తెలిసేది. ఇప్పుడు అలా కాకుండా అరెస్టుల విషయం మరచిపోయి ఎఫ్ఐఆర్‌లోని వివరాలను పోలీసులు ముందుగానే చెప్పేస్తున్నారు. దీంతో ఆయా కేసులు మోపబడిన వారు న్యాయస్థానాల నుంచి ఉపశమనం పొందుతున్నారు. తెలుగుదేశం కేడర్‌లో అసంతృప్తి రగలడానికి ఇది ప్రధాన కారణం. రాజధాని నిర్మించి, నాలుగు ప్రాంతాలలో పరిశ్రమలు ఏర్పాటు చేయించినంత మాత్రాన ఓట్ల వర్షం కురవదు. 2019కి ముందే కియా పరిశ్రమ ఏర్పాటై, అనంతపురం జిల్లాలో ఆ పరిశ్రమ వల్ల లాభపడిన నియోజకవర్గాలలో కూడా తెలుగుదేశం పార్టీ గెలవలేదే? నెహ్రూ, ఇందిరాగాంధీ తర్వాత దీర్ఘకాలంపాటు దేశాన్ని పాలించిన ఘనత నరేంద్ర మోదీకి దక్కింది అంటే అందుకు ఆయన అనుసరించిన రాజకీయ వ్యూహాలే కారణం. ఆయన తనను తాను పెంచుకుంటూ భారతీయ జనతా పార్టీని కూడా పెంచారు. రాజకీయ ప్రత్యర్థులను ఎలా కట్టడి చేయాలో, ఎవరిని ఎలా దారికి తెచ్చుకోవాలో ఆయనను చూసైనా నేర్చుకోవాలి. చంద్రబాబు నాయుడు కొత్తగా శోధించి కనిపెట్టాల్సింది ఏమీ లేదు. ప్రధాని మోదీని గమనిస్తే చాలు. 2029 ఎన్నికల నాటికి తెలుగుదేశం పార్టీకి, తన కుమారుడైన లోకేశ్‌కు ఇబ్బంది లేకుండా భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలంటే జగన్‌రెడ్డిని రాజకీయంగా దెబ్బ తీయడమే ఏకైక మార్గం. జగన్‌రెడ్డిని అష్టదిగ్బంధనం చేయగలిగితే 2029 ఎన్నికల గురించి ఆలోచించాల్సిన అవసరం కూడా ఉండదు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు నల్లేరు మీద నడకలా ఉంటుంది. తెలుగుదేశం పార్టీ నాయకత్వాన్ని కూడా లోకేశ్‌కు బదలాయించడానికి ఆటంకాలు ఎదురు కావు. ఈ దిశగా చర్యలు తీసుకోకుండా ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు బిజీబిజీగా గడిపితే పార్టీ కేడర్‌తో పాటు ప్రజలకు కూడా చంద్రబాబు దూరం అవుతారు. 2019–2024 మధ్య కాలం నాటి చేదు అనుభవాలను చంద్రబాబు అనుక్షణం గుర్తు చేసుకోవాలి. ఇకపైనైనా చంద్రబాబు అడుగులు సరైన మార్గంలో పడనిపక్షంలో 2019–2024 మధ్య కాలంలో ఆయనకు అండగా నిలిచిన వర్గాలు, వ్యక్తులు కూడా ఆయనకు దూరం అవుతారు. 2029 నాటికి తనకు ఉండబోయే ప్రతికూలతలను దృష్టిలో పెట్టుకొని మెలిగితే చంద్రబాబుకే మంచిది!

> చంద్రబాబు నీడలోనే లోకేశ్ ఉన్నారు. చంద్రబాబు క్రియాశీలంగా ఉన్నంత వరకు ఆయన ఎదగడం కష్టం. 'యువగళం' పేరిట పాదయాత్ర చేసినంత మాత్రాన అతడు ప్రజా నాయకుడిగా ఎదిగాడని భావించలేం. లోకేశ్‌కు మంత్రిత్వశాఖ కేటాయింపులో కూడా చంద్రబాబు తప్పు చేశారు. ఇప్పుడు లోకేశ్ ఎంతగా శ్రమించి పెట్టుబడులు, కంపెనీలు తీసుకువచ్చినా ఆ ఖ్యాతి చంద్రబాబు ఖాతాలోకే పోతుంది. తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు ఐటీతో పాటు ఇతర రంగాల్లోకి పెట్టుబడులను ఆకర్షించే ఓపిక, నైపుణ్యం ఆయనలో ఉండేవి కావు. ఆ కారణంగానే ఆ సబ్జెక్టులను కుమారుడు కేటీఆర్‌కు అప్పగించి తాను రాజకీయాలపై దృష్టిని కేంద్రీకరించారు. చంద్రబాబు, లోకేశ్ పరిస్థితి వేరు. అభివృద్ధికి చిరునామాగా చంద్రబాబుకు ఇప్పటికే పేరుంది. అధికారంలో ఉన్నంత సేపు చంద్రబాబు అభివృద్ధిపైనే దృష్టి కేంద్రీకరించేవారు. రాజకీయాన్ని గాలికి వదిలేసేవారు. ఈ కారణంగానే 2004, 2019లో ఆయన ఓడిపోయారు.

ప్రగతిశీల భావోద్యమకారుడు

తెలుగునాట సాంస్కృతిక భావజాల రంగాన్ని సుసంపన్నం చేసిన తొలితరం బుద్ధిజీవి గద్దె లింగయ్య (1911–63). విశిష్ట ప్రచురణకర్తగా, స్వాతంత్ర సమరశీలిగా, సోషలిస్టు నేతగా, కమ్యూనిస్టు విప్లవకారుడిగా, అచంచల మానవతావాదిగా జీవించిన లింగయ్య కృషిని, భారత కమ్యూనిస్టు పార్టీ శత సంవత్సరాల సందర్భంగా ప్రత్యేకంగా గుర్తుచేసుకోవల్సిన అవసరమున్నది.



భారత కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవం సందర్భంగా తెలుగునాట స్మరించుకోవల్సిన తొలితరం భావోద్యమకారులలో గద్దె లింగయ్య ఒకరు. సహాయనిరాకరణోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని కారాగార వాసం చేసిన లింగయ్య తొలినాటి సామ్యవాదులలో ఒకరు. తెలుగులో మొట్టమొదటిసారిగా కమ్యూనిస్టు ప్రణాళికను ప్రచురించిన అభ్యుదయవాది. తొలి సామ్యవాద పత్రిక 'ప్రభ', ప్రగతిశీల 'నవయుగ' పత్రికల వ్యవస్థాపకుడు. ఫ్రెంచ్ సామ్యవాద రచయిత యూజన్ పాటియార్ రాసిన అంతర్జాతీయ శ్రామిక గీతాన్ని బాలాంత్రపు నళినీ కాంతరావు తెనిగించగా 1935లో లింగయ్య తన 'ప్రభ' పత్రికలో ప్రచురించినట్టు తెలుస్తోంది. ఉద్యమ ప్రచారోద్యమంలో భాగంగా ఆదర్శ గ్రంథ మండలి స్థాపించి క్రొవ్విడి లింగరాజు తర్జుమా చేసిన మాక్సిం గోర్కీ అద్వితీయ నవల 'అమ్మ' మొదలుకుని పదుల సంఖ్యలో స్ఫూర్తిదాయక పుస్తకాలను ప్రచురించిన ప్రగతిశీలి లింగయ్య. శరత్ మొదలు రాహుల్ సాంకృత్యాయన్ వరకూ ఎందరో మహారచయితల నవలలను లింగయ్య స్వయంగా అనువదించి తెలుగువారికి పరిచయం చేశారు. ఉద్యమానికి భావజాల ప్రచారం ఎంత అవసరమో గుర్తించి బ్రిటిష్ వారి కంటపడకుండా ఏకంగా పడవల్లో అచ్చు యంత్రాలు అమర్చి కరపత్రాలు, పుస్తకాలు ముద్రించిన యోధుడు లింగయ్య.

కృష్ణా జిల్లా ఎలమర్రులో రైతు కుటుంబంలో పుట్టిన లింగయ్య జీవితం ఒక నిరంతర చైతన్య ప్రవాహం. 'ప్రభ'ను మొదట ఎలమర్రులోనే స్థాపించి తర్వాత బందరు నుంచి ప్రచురించారు. ఆయన రాసిన 'విప్లవ వీరులు' 'విప్లవ యుగం' తదితర పుస్తకాలను ప్రభుత్వం నిషేధించింది. తొలి సామ్యవాద నాటకాల్లో ఒకటైన మునిమాణిక్యం నరసింహారావు రాసిన 'తిరుగుబాటు'ను ప్రచురించారు. మొదటి విప్లవ పాటల సంకలనం కూడా ఆయనే 'క్రాంతిగీతాలు' పేరిట ప్రచురించగా ప్రభుత్వం నిషేధించింది. నాలుగేళ్లపాటు లింగయ్యను డిటెన్యూగా చేసి వేధించారు. అయినా ఆయన ఎక్కడా వెనకడుగువేయలేదు. నిత్యం జన సమూహాల మధ్యనే ఉంటూ నిర్మాణాత్మకంగా పనిచేశారు. కృష్ణాజిల్లా సోషలిస్టు పార్టీకి ప్రథమ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. సమాజంలోని అట్టడుగు వర్గాల ఉన్నతి కోసం క్రియాశీలకంగా కృషి చేసిన ఉదాత్తుడు లింగయ్య.

ఆదర్శ గ్రంథ మండలిని స్థాపించి లింగయ్య చేసిన సాహిత్య సేవ మహత్తరమైనది. తెలుగునాట ఏకైక గదర్ వీరుడు దరిసి చెంచయ్య ఆత్మకథ 'నేనూ–నా దేశం', అయ్యదేవర కాళేశ్వరరావు స్వీయ చరిత్ర 'నా జీవిత కథ'ను తొలుత లింగయ్యే ప్రచురించారు. పుస్తకప్రచురణని కాలక్షేప వ్యవహారంగానో లాభార్జన వ్యాపారంగానో లింగయ్య చూడలేదు. అసమానతల సమాజంలో ఆధిపత్యానికి వ్యతిరేకంగా చేసే బహుముఖ పోరాటంలో ఆయుధాలుగా అక్షరాలని ఆయన చూశారు. ఆ సాహిత్యాన్ని ప్రజల దగ్గరకు ఎలా తీసుకెళ్ళాలో కూడా యోచించారు. విజయవాడ పుస్తకప్రచురణల సంఘానికి ఉపాధ్యక్షులుగా ఎన్నో నిర్మాణాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. 1963, జనవరి 7న నెల్లూరు వెళ్లిన లింగయ్య అక్కడే గుండెపోటుతో మరణించారు. అప్పుడు ఆయన వయస్సు 52 ఏళ్లు మాత్రమే. లింగయ్య తదనంతరం ఆయన పేరు మీద వారి సంతానం లింగయ్య గ్రూప్ వ్యాపార సంస్థలతో పాటు హర్యానాలోని ఫరిదాబాద్ దగ్గర 'లింగయాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ & టెక్నాలజీ' అనే విద్యాసంస్థను స్థాపించారు. అది ఇప్పుడు విశ్వవిద్యాలయంగా ప్రభుత్వ గుర్తింపును పొందింది. ఒక తెలుగు వ్యక్తి, అభ్యుదయ భావోద్యమకారుడి పేరుతో ఉత్తరాదిన అటువంటి విద్యాసంస్థ ఉండడం అరుదైన విశేషం. దురదృష్టవశాత్తూ గద్దె లింగయ్య జీవితాన్ని గురించిన సమాచారం కానీ, ఆయన పాల్గొన్న ఉద్యమాలు, చేసిన రచనలు, మొత్తం అనువాదాలు, ప్రచురించిన గ్రంథాలు, ఏర్పాటుచేసిన పత్రికలు, సంస్థల వివరాలేవీ ఒక్కచోట సమగ్రంగా నమోదు చేయబడలేదు. కారణాలు తెలీదు కానీ వారి వారసత్వ సంస్థలు కూడా అటువంటి ప్రయత్నం చేసినట్టు లేదు. అంతకంటే బాధాకరమైన విషయం లింగయ్య భావోద్యమానికి వారసులుగా ఉన్నవారు సైతం భావజాల రంగంలో ఆయన చేసిన క్రియాశీల కృషిని కొనసాగించినట్టు లేదు.

లింగయ్య 1911లో జన్మించారు. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించి వంద సంవత్సరాలు అవుతోంది. ఆ సందర్భంగా వివిధ కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. తెలుగు ప్రాంతాల్లో రమారమి తొంభై ఏళ్ళ క్రితం మొదట సామ్యవాద సంఘం ఏర్పడినట్లు తెలుస్తోంది. అందులో మొదటిసారిగా కమ్యూనిస్టు ప్రణాళిక నుంచి పదుల సంఖ్యలో ప్రగతిశీల సాహిత్యాన్ని విరివిగా ప్రచురించడం జరిగింది. అలా తెలుగు నేల మీద సాంస్కృతిక భావజాల రంగాన్ని సుసంపన్నం చేసిన తొలితరం బుద్ధిజీవి గద్దె లింగయ్య కృషిని ఈ సందర్భంలో గుర్తించి గౌరవించుకోవడం అభ్యుదయ భావజాల స్రవంతికి అవసరం.

నేడు విభిన్న కమ్యూనిస్టు పార్టీలు, ప్రగతిశీల సంఘాలు విలక్షణమైన ప్రయోగాలు చేస్తూ అనేక ప్రచురణలు తీసుకువస్తున్నాయి. ఎన్నో కొత్త తరహా కార్యక్రమాలు చేపడుతున్నాయి. వాటన్నిటిలో అంతర్లీనంగా ఒకనాడు ఏటికి ఎదురీదిన గద్దె లింగయ్య వంటి తొలితరం చింతనాశీలుర చిరస్మరణీయ కృషి ఉన్నది. నిత్య విద్యార్థిగా, నిరంతర ప్రవాహశీలిగా, ప్రజాపక్ష పత్రికా సంపాదకునిగా, అవిశ్రాంత రచయితగా, చారిత్రక అనువాదకునిగా, విశిష్టమైన ప్రచురణకర్తగా, స్వాతంత్ర సమరశీలిగా, సోషలిస్టు నేతగా, కమ్యూనిస్టు విప్లవకారుడిగా, అన్నింటినీ మించి అచంచల మానవతావాదిగా జీవించిన లింగయ్య స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేయాల్సిన గురుతర బాధ్యత ఇప్పుడు మరింత ఎక్కువగా ఉంది.

■ గౌరవ్
సామాజిక కార్యకర్త

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
ఆదివారం 5 జనవరి 2025

నేడు ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

హనుమకొండలో పాల్గొననున్న మంత్రులు, ఆర్టీసీ అధికారులు

హనుమకొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ప్రయాణం పెరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మహాలక్ష్మి పథకం లేకముందు 55 నుంచి 60 శాతం ఉన్న ప్రయాణం.. ప్రస్తుతం 90 శాతానికి పెరిగింది. దీంతో బస్సు సర్వీస్‌లు లేక పాత బస్సులనే పలు రూట్లలో తిప్పిన ఆర్టీసీ అధికారులు.. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం అందించలేకపోయారు. బస్సుల కొరతతో ప్రయాణికులు సీట్లు లేక నిల్చొని యేడాదిగా అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ ఉమ్మడి జిల్లాకు మొత్తం 112 ఎలక్ట్రిక్ బస్సు సర్వీస్‌లను ఏర్పాటు చేసింది. బస్సుల ఏర్పాటుతో రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించి ఎలక్ట్రిక్ బస్సులను నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సులకు చార్జింగ్ పాయింట్ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎలక్ట్రిక్ బస్సును ఒకసారి చార్జింగ్ చేస్తే 300 కిలోమీటర్ల వరకు ప్రయాణం సాగుతుందన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను హనుమకొండ నుంచి హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల, తొర్రూరు, జనగామ, ఏటూరునాగారం, మంగపేట, ఇతర రూట్లల్లో ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీస్‌లను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ మేరకు హనుమకొండలో ఆదివారం రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, భట్టి విక్రమార్క, కొండా సురేఖ, ధనసరి సీతక్క, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొని బస్సులను ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం డి.విజయ్‌భాను తెలిపారు.

రారండి.. ముగ్గులు వేయగ..

నేడు 'ఆంధ్రజ్యోతి - ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు



హనుమకొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా ప్రతీ సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. ఆదివారం హనుమకొండ కొత్త బస్టాండ్ రోడ్డులోని ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల (కేడీసీ) మైదానంలో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు ఈ పోటీలు జరగనున్నాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్.. సంతూర్ ముత్యాలముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న మహిళలు 9గంటలకల్లా గ్రౌండ్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ఇక జిల్లా స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.6వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4వేలు, తృతీయ బహుమతిగా రూ.3వేలు అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ మహిళకు ప్రోత్సాహక బహుమతి ఉంటుంది.

వేదిక : ప్రభుత్వ కాకతీయ డిగ్రీ కళాశాల (కేడీసీ) మైదానం, కొత్తబస్టాండ్ రోడ్, హనుమకొండ

సమయం : ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు

నిబంధనలివీ..

మహిళలు మాత్రమే పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు, తదితర సామగ్రి వారే తెచ్చుకోవాలి. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. ఎన్ని చుక్కలు, ఎన్నివరుసలో చెప్పగలిగి ఉండాలి. ముగ్గు వేయడానికి గరిష్ఠ సమయం రెండు గంటలు. విజేతల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుదినిర్ణయం. గొట్టాలు, బద్దలు, ఇతర పరికరాలు ఏమీ ఉపయోగించకుండా కేవలం చేతితోనే ముగ్గు వేయాల్సి ఉంటుంది. ఇక ముగ్గు అందంగా కనపడేందుకు సంప్రదాయరీతిలో గొబ్బెమ్మలు, బతుకమ్మలను అమర్చవచ్చు.

పారిశుధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- పలు డివిజన్లలో తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన



కిషన్‌పురలో కాలనీవాసులతో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగరంలో అమలవుతున్న పారిశుధ్య పనుల నిర్వహణలో ప్రజల భాగస్వామ్య అవసరమని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. సమగ్ర శానిటేషన్ నిర్వహణలో భాగంగా జీడబ్ల్యుఎంసీ తరుపున ఎంపిక చేసిన 6, 49 డివిజన్‌లలో కిషన్‌పుర, రెవెన్యూ కాలనీలలో తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాల ప్రజలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడి పలు సూచనలు చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 66 డివిజన్‌లలో ముందుగా రెండు డివిజన్‌లను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశామన్నారు. ప్రయోగాత్మకంగా సమగ్ర శానిటేషన్ నిర్వహణ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. రెండు డివిజన్‌లలో పలు కాలనీల ప్రజలు, అపార్ట్‌మెంట్ నిర్వాహకులు, ఎన్జీవోలు, విద్యాసంస్థల నిర్వాహకులు సహకరించాలన్నారు. కరపత్రాలు, బ్యానర్ల ద్వారా ప్రజలకు అవగాహన కలిగిస్తామన్నారు. 10 బయో కంపోస్టు యూనిట్లు ఏర్పాటు చేస్తామని, బయో కంపోస్టు యూనిట్‌కు అంబేద్కర్ జంక్షన్ సమీపంలోని పాత మున్సిపల్ గెస్ట్‌హస్‌ను ఎంపిక చేశామన్నారు. ప్రతీ రోజు 10 టన్నుల చెత్తను బయో కంపోస్టు ఎరువు తయారు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. సేకరించిన తడి, పొడి చెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ చేయడానికి ఐటీసీ వారికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మానస, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హార్టికల్చర్ అధికారులు పలాస రమేష్, లక్ష్మారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ మహేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, సంపత్‌రెడ్డి, ఐటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ పరికరాలను మరమతు చేయండి

పార్కుల్లో దిబ్బతిన్న పరికరాలను మరమతు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. వరంగల్ డాక్టర్ కాలనీ, ఎల్బీనగర్‌లోని పార్కులను శనివారం బల్దియా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పార్కుల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. దెబ్బతిన్న జిమ్ పరికరాలను ఇంజనీరింగ్ అధికారులు గుర్తించి రిపేరుకు కావలసిన అంచనాలను రూపొందించాలన్నారు. పార్కుల లోపల గోడలకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పార్క్‌లకు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆహ్లాదం కోసం గ్రీనరీ ఏర్పాటు చేసేందుకు మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హార్టికల్చర్ అధికారులు పలాస రమేష్, లక్ష్మారెడ్డితోపాటు ఏఈ నరేష్, హెచ్‌ఏలు ప్రిన్సీ, అనూహ్యలు పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి చేయండి

బల్దియా పరిధిలో జరుగుతున్న పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులు సమర్థవంతగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఐసీసీకి సంబంధించి జీఐఎస్ మ్యాపింగ్ పని తీరు పరిశీలించాలని, ఇందులో అన్ని కాంపోనెంట్స్ పని చేసేలా స్మార్ట్‌సిటీ ప్రతినిధులకు సూచించారు. అంతేకాకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. స్మార్ట్‌సిటీ పనులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. భద్రకాళి బండ్‌పై కొనసాగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతీరోజు స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు తాను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. ఇంకా వీధిదీపాల నిర్వహణ, వాహనాల మరమతుపై సంబంధిత ఈఈని అడిగి తెలుసుకున్నారు. తర్వాత వరంగల్ లక్ష్మీపురంలో నిర్మాణం జరుగుతున్న వెజ్-నాన్ వెజ్ మార్కెట్ పనుల పురోగతిపై సమీక్షించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల డీపీఆర్ తయారీపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఈఈలు శ్రీనివాస్, మహేందర్, ఏసీపీ ఇమ్రాన్‌ఖాన్, స్మార్ట్‌సిటీ పీఎంసీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మొగిలిచర్లకు డిప్యూటీ సీఎం రాక

ఏర్పాట్లను పరిశీలించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మొగిలిచర్లకు శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వస్తున్నట్లు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మొగిలిచర్లలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ మేరకు సబ్‌స్టేషన్ స్థలాన్ని ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. రూ.8.4కోట్లతో నిర్మించే మూడు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. మొగిలిచర్ల, గొర్రెకుంట, విశ్వనాథపురం గ్రామాల్లో ఈ మూడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. దీంతో మండలంలో లోవోల్టేజీ సమస్య పూర్తిగా తీరనుందని చెప్పారు. శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలను అధికసంఖ్యలో తరలించి విజయవంతం చేయాలని నాయకులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దిన్, పీసీసీ కార్యదర్శి భీమగోని సౌజన్య, పీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ గాదె దయాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు కొండేటి కొమురారెడ్డి, చాడా కొమురారెడ్డి, దూపాకి సంతోష్, పాలకుర్తి సంపత్, కొమ్ము శ్రీకాంత్, ఆకుల రుద్రప్రసాద్, క్లైమెంట్, పోలెపాక సుమన్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన స్థలంలో నాయకులతో మాట్లాడుతున్న రేవూరి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

- వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, ప్రతీ ఒక్కరికి రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించేలా రోడ్డు భద్రతా వారోత్సవాలను విజయ వంతంగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హైదరాబాద్ నుంచి రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్‌రాజ్‌తో కలిసి మంత్రి పొన్నం శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని నేడు రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతా మాసోత్సవం చేపడుతోందని అన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రతీ శాఖను భాగస్వా మ్యం చేస్తూ ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా గురుకులాల్లో పిల్లలకు అం దించే ఆహార నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలన్నారు. రోడ్లు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్ మాట్లాడుతూ.. జనవరి నెల మొత్తం రోడ్డు భద్రతా ప్రమాణాల కార్యక్రమాల ను నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని పాఠశాలల ప్రిన్సిపాళ్లతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ప్రతీరోజు వారికి రహదారుల భద్రతపై ఒక సందేశాన్ని పంపిస్తామని, దానిని వారు పాఠశాల్లో ఉదయం జరిగే అసెంబ్లీలో పిల్లలకు వివరిస్తారన్నారు. ఈ నెలలో ప్రతీరోజు రహదారి భద్రతపై పిల్లలకు అవగాహన కల్పిస్తామన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వో అప్పయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ఆర్టీసీ ఆర్ఎం బానుప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఈ సురేష్, నేషనల్ హైవే ఈఈ మనోహర్‌తోపాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆత్మకూరు సీఐ సంతోష్‌పై డీజీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తనను ఆత్మకూరు సీఐ సంతోష్ అవమానించారని నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన తేజావత్ సమ్మయ్య నాయక్ శనివారం రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశాడు. బాధితుడు సమ్మయ్య నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడుంబా రవాణాకు సంబంధించి నందిగామకు చెందిన ఓ యువకుడిపై ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు రాగా, సదరు యువకుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావాలని నల్లబెల్లి కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు సమ్మయ్యనాయక్‌కు ఆత్మకూరు పోలీసులు పలుమార్లు ఫోన్ చేశారు. ఈ క్రమంలో శనివారం ఉదయం యువకుడితో పాటు మరో 10మంది గ్రామస్థులను పట్టుకొని సమ్మయ్యనాయక్ ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. యువకుడిపై వచ్చిన ఫిర్యాదు గురించి సీఐతో మాట్లాడుతున్న తరుణంలో ఎలాంటి కారణం లేకుండానే సమ్మయ్యనాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'నిన్ను స్టేషన్ లోపలికి ఎవరు రానిచ్చారు..' అని గట్టిగా అరుస్తూ సిబ్బందితో ఫొటోలు తీయిస్తూ స్టేషన్ నుంచి బయటికి పంపించారన్నారు. గిరిజన బిడ్డనైన తనను అవమానించిన సీఐపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీతో పాటు జాతీయ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు, రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్, వరంగల్ పోలీస్ కమిషనర్‌కు రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చింతకింది రాజేశం

కేయూ క్యాంపస్ జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ వరంగల్ చాప్టర్ నూతన అధ్యక్షుడిగా ప్రొఫెసర్ చింతకింది రాజేశం ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ వరంగల్ చాప్టర్ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ చింతకింది రాజేశం, జనరల్ సెక్రటరీగా ప్రొఫెస్ కట్ల రాజేందర్, ట్రెజరర్‌గా డాక్టర్ ఫణీంద్ర, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ ఎమ్డీ యాకుబ్, డాక్టర్ పి.రాజిరెడ్డి, డాక్టర్ బి.ప్రగతి, ఎం.సదాశివుడులు ఎంపికయ్యారు. ప్యాటరన్స్‌గా అమరవేణి, వరలక్ష్మి, నరసింహచారి, రాజశేఖర్, దత్తాత్రేయులు, చంద్రశేఖర్, చంచల్ అగర్వాల్‌లు వ్యవరించారు. కాగా, నూతనంగా ఎంపికైన కార్యవర్గం మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వహిస్తారు. ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ బైలాస్, 2023-24 ఏడాది ఆడిట్ నివేదికలు, 2024-25 ఏడాది అకడమిక్ కార్యకలాపాలపై చర్చించారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా

లింగాలఘణపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా స్పష్టం చేశారు. శనివారం లింగాలఘణపురం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సీపీ వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించారు. రిసెప్షన్ కౌంటర్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, కేసుల దర్యాప్తు వివరాలను, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్సై బండి శ్రవణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

ఆవరణలో మొక్కలను నాటిన అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలు, అధికారులతో పోలీస్ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ప్రధాన రోడ్డు మార్గాల్లో అత్యధికంగా జరిగే రోడ్డు ప్రమాదాల ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టాలని, సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తు విషయంలో ఎట్టిపరిస్థితుల్లో అలసత్వం చేయొద్దన్నారు. పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకాన్ని పోలీసులు కల్పించాలన్నారు. ప్రతీ పోలీస్ సిబ్బంది నీతి నిజాయితీతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరు చేసిన కిట్ ఆర్టికల్స్‌ను పంపిణీ చేశారు. కాగా, సీపీకి సాయుధ పోలీసులు గౌరవ వందనంచేసి ఘనంగాస్వాగతించారు. కార్యక్రమంలో జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొత్తగా మూడు గ్రామ పంచాయతీలు

- హనుమకొండ జిల్లాలో రెండు, వరంగల్ జిల్లాలో ఒకటి
- ప్రతిపాదనలు పంపిన అధికారులు

హనుమకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఎక్కడెక్కడ కొత్తగా గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందో ఆరా తీసింది. సంబంధిత అధికారులు నుంచి ఇటీవల ప్రతిపాదనలు స్వీకరించింది. ఆయా ప్రతిపాదనలను స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యేల ద్వారా కలెక్టర్లు, సంబంధిత పంచాయతీరాజ్ శాఖ మంత్రి పేషీకి సైతం పంపారు. తాజా ప్రతిపాదనల ప్రకారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో అదనంగా మూడు కొత్త పంచాయతీలు ఏర్పాటు కానున్నాయి. వీటిలో హనుమకొండ జిల్లాలో రెండు, వరంగల్ జిల్లాలో ఒక పంచాయతీ కొత్తగా ఏర్పాటవుతుంది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలో ఒక గ్రామ పంచాయతీని, అలాగే ఆత్మకూరు మండలంలో ఒక గ్రామ పంచాయతీ కొత్తగా ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో రెండు తండాలను కలిపి ఒక గ్రామ పంచాయతీని చేయనున్నారు. పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉన్న, గ్రామాలను కలిపి లేదా గతంలో పంచాయతీల పునఃవ్యవస్థీకరణలో భాగంగా రెండుగా విడిపోయిన తండాలను ఒక గ్రామ పంచాయతీగా చేసేందుకు వీలుగా సంబంధిత మంత్రిత్వశాఖ ప్రతిపాదనలు పంపారు.

ఓటర్లు, జనాభా ప్రాతిపదకన అన్ని విధాలుగా అర్హత ఉన్న గ్రామాలనే పంచాయతీల ఏర్పాటు కోసం ఎంపిక చేశారు. కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుపై త్వరలోనే ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయనున్నది. హనుమకొండ జిల్లాలో ప్రస్తుతం 208 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటయ్యే పంచాయతీలను కలుపుకొని వీటి సంఖ్య 210కి చేరనున్నది. అలాగే వరంగల్ జిల్లాలో ప్రస్తుతం మొత్తం 325 పంచాయతీలు ఉన్నాయి. కొత్తదానిని కలుపుకుంటే వీటి సంఖ్య 326కు చేరుకుంటుంది.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

జనగామ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రోడ్డు ప్రమాదాల ప్రమాణాలపై హైదరాబాద్ నుంచి రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులతో ప్రతి జిల్లా కేంద్రం, మండల కేంద్రాలలో ర్యాలీలు చేపట్టాలన్నారు. రోడ్డుభద్రత నియమా లను పాఠ్య పుస్తకాల్లో కూడా పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావే శంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీసీసీ పరీక్ష హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష హాల్ టికెట్లను ఆదివారం నుంచి సంబంధిత వెబ్ పోర్టల్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా డీఈవో డి.వాసంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, టీసీసీ పరీక్ష ఈ నెల 11 నుంచి 17 వరకు పరీక్షలు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

వడ్డెపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్(టీజీఎంఎస్‌సీ), హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గ్రూప్స్ -1, 2, 3, 4తోపాటు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, స్టాఫ్ సెలక్షన్ కమిటీ, బ్యాంకింగ్ మొదలైన వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి నాలుగు నెలల పాటు బేసిక్ ఫౌండేషన్ కోర్సును ఉచితంగా అందిస్తున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి డి.మురళీధర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని అర్హులైన మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 16లోపు హనుమకొండ సుబేదారిలోని సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్యాలయంలో విద్యార్హత సర్టిఫికెట్లు జతపర్చి సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 7330990322 లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో

వరంగల్ మెడికల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు, వ్యాక్సిలు, టెస్టులకు కావాల్సిన రియేజంట్లు, రాపిడ్ డయాగ్నోస్టిక్స్ వినియోగంపై హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య శనివారం జూమ్ కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. నెలవారిగా వస్తున్న పేషెంట్లు, మందుల లభ్యత వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. చైనా నుంచి వైరస్ వ్యాపిస్తుందన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అన్నదాతలకు అందని సాగునీరు

- వరి నాట్లకు నీరందక ముదురుతున్న వైనం
- కాలువల ద్వారా నీరందించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

హనుమకొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు సమయానికి సాగుకు నీరు అందకపోవడంతో వరినాట్లు వేసే రైతులు ఆందోళనకు గురవుతున్నారు. శిథిలావస్థలో ఉన్న ఎస్సారెస్పీ ఉప కాలువలను రైతులు తమ సొంత డబ్బులతో పూడిక మట్టి పనులు చేపట్టి సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రధాన కాల్వల నుంచి సాగునీరు పోతున్నా.. ఉప కాలువల ద్వారా సాగునీరు అందించకపోవడంతో రైతులు నీరు విడుదల కోసం ఎదురుచూస్తున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల,శ్రీరాములపల్లి, గోపాలపూర్, హసన్‌పర్తి మండలంలోని ముచ్చర్ల నాగారం, సుదాన్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులు నెల కిందట కాలువల మరమ్మతుల కోసం అధికారులను కలిశారు. కాలువలు సరిగా లేక సాగునీరు రావడం లేదని, నీరు అందక యాసంగి సమయంలో పంట పొలాలు ఎండిపోతున్నట్లు గోడు వెల్లబోసుకున్నారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కమలాపూర్ మండలం అంబాల, శ్రీరాములపల్లి, హసన్‌పర్తి మండలం నాగారం గ్రామాల రైతులు డబ్బులు వసూలు చేసి సొంతంగా రూ.3 నుంచి 4 లక్షల వరకు ఖర్చు చేసి శిథిలావస్థలో ఉన్న కాలువలోని పూడిక మట్టిని జేసీబీల ద్వారా తొలగించి కాలువ మరమ్మతుల పనులు చేశారు.

అందని సాగునీరు

రైతులు ఖరీఫ్‌లో వరి నారు కోసి నాటు కోసం సిద్ధం చేశారు. సమయానికి



చింతగట్టులోని ఎస్సారెస్పీ కెనాల్‌లో ప్రవహిస్తున్న సాగునీరు

సాగునీరు రాకపోవడంతో వరినార్లు ముదిరిపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సారెస్పీ, డీబీఎం 24 కాలువ ద్వారా రైతుల పంటలకు సాగునీరు అందించే ఉప కాలువలు శిథిలావస్థలోకి చేరినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా స్పందించడం లేదని కొంత మంది రైతులు చెబుతున్నారు.

మానేరు డ్యామ్ నుంచి నీటి విడుదల

రెండు రోజుల కిందట యాసంగి పంటల సాగు కోసం కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యామ్ నుంచి బుధవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రధాన కాలువ గుండా నీరు పోతున్నా.. కమలాపూర్‌తో పాటు ఇతర మండలాలకు సాగునీటిని అందించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులను అన్నదాతలు వేడుకుంటున్నారు.

ఇంటర్ విద్యార్థులకు 9న కేడీసీలో జాబ్‌మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పూర్తయిన విద్యార్థులకు ఈనెల 9న హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(కేడీసీ)లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈవో డాక్టర్ సుమన్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టెక్‌బీ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో 2023-24లో ఇంటర్ పూర్తి చేసిన వారితో పాటు ఈవిద్యా సంవత్సరం ఇంటర్ పూర్తి చేయనున్న విద్యార్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు వారి పదో తరగతి, ఫస్ట్ ఇయర్ జిరాక్స్ మెమోలతోపాటు ఆధార్ కార్డు, ఫొటో, స్మార్ట్ ఫోన్‌తో హాజరు కావాలని ఆయన కోరారు.

అప్రెంటిషిప్ కోసం దరఖాస్తులు..

ఇంటర్మీడియెట్ వొకేషనల్ కోర్సు పూర్తైన విద్యార్థులు అప్రెంటిషిప్‌కు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఐఈవో డాక్టర్ సుమన్ శ్రీధర్ ఒక ప్రకటనలో కోరారు. 2022 నుంచి 2024 వరకు ఎంఎల్‌టీ, నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన వారు అప్రెంటిషిప్ చేసేందుకు ఈ నెల 8లోపు హనుమకొండలోని డీఐఈవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

సుదర్శన్‌కు యూనివర్సల్ ఎక్సలెన్స్ అవార్డు



కేయూ క్యాంపస్ జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్‌కు ఉత్తమ న్యాయకత్వ ప్రిన్సిపాల్ కేటగిరిలో యూనివర్సల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఈ మేరకు శనివారం సోషల్ క్రాప్ సొల్యూషన్ సంస్థ వివిధ రంగాల్లో విశిష్ట సేవలను అందించిన వ్యక్తులను ఎంపిక చేసి ఏటా ఈ అవార్డులను ప్రకటిస్తోంది. 2024 ఏడాదికి గత డిసెంబరు 30న ఈ అవార్డులను ప్రకటించింది. ఈ అవార్డు కింద ప్రశంసాపత్రం, ట్రోఫీని సుదర్శన్ అందుకున్నారు. ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ వర్సిటీ పాలక మండలి సభ్యుడిగా పనిచేస్తున్నారు. గతంలో లా హాస్టల్ జాయింట్ డైరెక్టర్‌గా, బీవోఎస్ స్టడీస్ చైర్మన్‌గా, ఎన్ఎస్ఎస్ పీవోగా, ఆర్టీఐ లైజెన్ అధికారిగా, టీఎస్ లాసెట్ వరంగల్ ప్రాంత కోర్డినేటర్‌గా విధులు నిర్వహించారు. 2010లో ఉద్యోగంలో నియమితులైన గతంలో 11 న్యాయ శాస్త్ర గ్రంథాలకు ఎడిటర్‌గా వ్యవహరించారు. తాను ఎడిట్ చేసిన రిలీజియస్ ఫ్రీడం అండ్ సెక్యులరిజం - థియరీ అండ్ ప్రాక్టీస్ అనే గ్రంథాన్ని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి కేజీ బాలకృష్ణన్ 2017లో న్యూఢిల్లీలో ఆవిష్కరించారు. సుదర్శన్ 4 అంతర్జాతీయ న్యాయ జర్నల్స్‌కు ఎడిటోరియల్ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. ఇంత వరకు సుదర్శన్ 14 అవార్డులను అందుకున్నారు. ఓయూ నుంచి న్యాయ శాస్త్రంలో, బాటనీలో పీజీ, న్యాయశాస్త్రంలో పీహెచ్‌డీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సైబర్ లాస్, మేధోసంపత్తి లాస్ సబ్జెక్టులో పీజీ డిప్లొమో చేశారు. 2005లో యూజీసీ నెట్ అర్హత ఉత్తీర్ణత సాధించారు. కేయూలో వర్సిటీ సర్వీసుకు ముందు కేంద్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్, రాష్ట్ర ఫారెస్టు రేంజ్ అధికారిగానూ ఎంపికయ్యారు. 2019లో మాతృభాషలో న్యాయశాస్త్ర అవగాహన అనే కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా పరిషత్ హాల్‌లో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా రూ.80వేల విలువగల న్యాయ శాస్త్ర గ్రంథాలను గ్రామీణ నేపథ్యంలో కలిగిన ఎల్ఎల్‌బీ కోర్సులను చదువుతున్న తెలుగు మీడియం విద్యార్థులకు ఉచితంగా అందచేశారు.

పెళ్లి కావడం లేదని యువతి ఆత్మహత్య



వసంత (ఫైల్)

నల్లబెల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి కావడం లేదని ఓ యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రుద్రగూడెంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. అజ్మీర కళమ్మ - అర్జీ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. అందరి కంటే పెద్దదైన అజ్మీర వసంత(32)కి ఇంకా పెళ్లి కాలేదు. వసంత కన్నా చిన్నవారైనా ముగ్గురికీ వివాహాలయ్యాయి. కాగా, ఎన్ని పెళ్లి సంబంధాలు వచ్చినా కుదరకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వసంత.. శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. అవస్థను భరించలేక పురుగుల మందు తాగానని కుటుంబ సభ్యులకు తెలిపింది. కుటుంబ సభ్యులు వెంటనే ద్విచక్ర వాహనంపై నర్సంపేటలోని ఓ ప్రైవేటు దవాఖానాకు తరలించగా, వసంత మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తమ్ముడు అజ్మీర రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ వెల్లడించారు.

నేటి నుంచి ప్రైవేటు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రైవేటు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి ఈ నెల 26 వరకు హనుమకొండ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో హాస్పిటల్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-5 క్రికెట్ టోర్నీని నిర్వహించనున్నట్లు ప్రైవేటు హాస్పిటల్స్ క్రీడా పోటీల కార్య నిర్వాహకుడు డాక్టర్ అమర్‌నాథ్ శనివారం తెలిపారు. వరంగల్ ట్రైసిటీస్ నుంచి 32 జట్లు క్రీడా పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఇందులో ప్రథమ స్థానంలో గెలిచిన జట్టుకు రూ.50వేలు, ద్వితీయ స్థానంలో గెలిచిన జట్టుకు రూ.30వేల నగదు పారితోషికాన్ని అందిస్తామన్నారు.

వర్గీకరణ చేయకుంటే మాదిగల గుండె చప్పుడు వినిపిస్తాం

- ప్రజా వాగ్గేయకారుడు గిద్దె రాంనర్సయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాంనర్సయ్య

జనగామ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోతే మాదిగల గుండె చప్పుడు వినిపించేందుకు డప్పులై మోగుతామని, ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో సాంస్కృతిక మహా ప్రదర్శన నిర్వహిస్తామని మహా ప్రదర్శన కమిటీ కోఆర్డినేటర్, ప్రజా వాగ్గేయకారుడు గిద్దె రాంనర్సయ్య పిలుపునిచ్చారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో దండోరా కళామండలి, ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో జనగామ జిల్లా కవులు, కళాకారుల సన్నాహక సమావేశం దండోరా కళామండలి జిల్లా అధ్యక్షుడు గజవెల్లి ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి రాంనర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని రక్షించేందుకు కలాలు, గళాలను కలిపి ఉద్యమించాలన్నారు. జిల్లాలో కవులు, కళాకారులు ఏకమై వర్గీకరణ అమలుకు పోరాడాలన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని సైతం విభేదిస్తూ కొందరు కుట్రలు చేస్తున్నారన్నారు. కుట్రలను తిప్పికొట్టేందుకు మాదిగ, మాదిగ ఉపకులాలు డప్పు చేతబట్టి హైదరాబాద్‌కు తరలి రావాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ, కొయ్యడ మల్లేష్, డాక్టర్ రాజమౌళి, గద్దల కిషోర్, పైసా రాజశేఖర్, గట్టగల్ల సంజీవ, బరిగెల బాబు, జనగామ శంకర్, గుగ్గిల్ల నర్సయ్య, సురేష్, ఎర్ర సూర్య, మేడ సుధాకర్ పాల్గొన్నారు.

పాట కట్టి.. పదం కదిపి..

- సమాజం కోసం గళం విప్పుతున్న ప్రవీణ్
- చిన్నతనం నుంచే నాటకాలు, పాటలతో ప్రయాణం
- రాష్ట్ర సాంస్కృతిక సారథి సభ్యుడిగా రాణిస్తున్న యువకుడు

యువ


కళాకారుడు దేశెట్టి ప్రవీణ్‌కుమార్

మహబూబాబాద్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆ యువకుడికి పాటంటే ప్రాణం.. చిన్ననాటి నుంచే పాటల పట్ల మక్కువ. కాలుకు గజ్జె కట్టి పాటలు పాడుతూ.. వీధి నాటకాలు వేస్తూ కళాకారుడిగా గుర్తింపు పొందాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో గోసి కట్టి.. కాలుకు గజ్జె కట్టి..భుజంపై గొంగడి వేసుకుని ఊరూరా తిరిగి ప్రదర్శనలిచ్చి ప్రజలను చైతన్యవంతం చేసిన యువకెరటం. తనదైన శైలిలో ముందుకు సాగుతూ ప్రజలను చైతన్యపరుస్తూ.. కళాకారుడిగా గుర్తింపు పొంది.. స్వరాష్ట్రం సిద్ధించాక తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యుడిగా ఎంపికై అందులో రాణిస్తున్నాడు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. అతడే మహబూబాబాద్ మండలం కొత్తరెడ్యాల గ్రామానికి చెందిన దేశెట్టి రామచంద్రయ్య-ధనమ్మల కుమారుడు ప్రవీణ్ కుమ్యార్. ప్రస్తుతం తన కలం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేకంగా పాటలు రాస్తూ గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాడుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు. తాజాగా ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా పాటను రాసి ఆలపించి అందరి మనసులను గెలుచుకున్నాడు.

చిరుప్రాయం నుంచే కాలుకు గజ్జె కట్టి ..

ప్రవీణ్‌కుమార్‌కు చిరుప్రాయం నుంచే పాటంటే ప్రాణం. పోరాటాల గడ్డ ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పమ్మి గ్రామంలో తన అమ్మమ్మ ఇంటివద్ద ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదివి.. అక్కడ కమ్యూనిస్టు పాటలకు ఆకర్షితుడయ్యాడు. చిన్నతనం నుంచే పాటలు పాడుతూ వీధినాటకాలు వేస్తూ పాఠశాల స్థాయి లోనే ప్రసంశలు, మన్ననలు పొందాడు. ఏడో తరగతి చదువుతున్న సమయంలో 1997 సంవత్సరంలో సామాజిక చైతన్య గీతాల పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రథమ బహుమతిని సాధించి అప్పటి కలెక్టర్ నీరాబ్ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులను అందుకున్నాడు. ఆ తర్వాత మహబూబాబాద్‌లో 9 నుంచి డిగ్రీ వరకు చదివి.. కళాశాల స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొని సామాజిక, అభ్యుదయ గీతాలు ఆలపించి బహుతులు దక్కించుకున్నాడు.

కళాకారుడిగా రాణింపు..

తెలంగాణ ఉద్యమంలో తాను సైతం అంటూ ప్రవీణ్‌కుమార్ తన పాటల ద్వారా ప్రజలను ఉత్తేజ పర్చడమే కాకుండా పోరాటాల వైపు నడిపించారు. పూర్వ మహబూబాబాద్ డివిజన్ ప్రాంతంలో ప్రతీ పల్లె, తండాల్లో ధూందాంలు నిర్వహిస్తూ కళాకారుల బృందంలో ప్రవీణ్‌కుమార్ కూడా తన గానం ద్వారా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను తన పాటల ద్వారా ప్రజలకు చేరవేశాడు. మంచి కళాకారుడిగా గుర్తింపు పొందిన ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక సారథి బృందం సభ్యుడిగా నియమించింది. అప్పటి నుంచి మహబూబాబాద్ నియోజకవర్గ సాంస్కృతిక సారథి బృందంలో పని చేస్తూ నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల గూర్చి పాటల రూపంలో వివరిస్తూ ప్రజలు, అధికారుల మన్ననలు పొందుతూ రాణిస్తున్నారు.

పాటలు పాడటమే కాకుండా దరువు వేయడంలో కూడ దిట్ట. అంతే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తన కలం ద్వారా సొంతంగా కొన్ని పాటలు రాసి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాడుతూ గుర్తింపు పొందుతున్నాడు. తాజాగా కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి నుంచి గాన కోకిల అవార్డును అందుకున్నాడు.


ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నుంచి సత్కారం పొందుతున్న ప్రవీణ్‌కుమార్ (ఫైల్)


హుస్నాబాద్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి నుంచి గానకోకిల అవార్డును అందుకుంటున్న ప్రవీణ్ (ఫైల్)

ఐదు దశాబ్దాల అక్షర సౌరభం

- రచనలు, కవితలతో ప్రశంసలందుకున్న అనిశెట్టి రజిత
- కవయిత్రిగా, సామాజిక పరిశోధకురాలిగా ప్రత్యేక గుర్తింపు

సాహితి శిఖరం


ప్రజాకవి కాళోజీతో అనిశెట్టి రజిత (ఫైల్)

హనుమకొండ కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆమెది ఐదు దశాబ్దాల అక్షర ప్రయాణం. తన రచనలు, కవితలతో పాటు సాహిత్య రంగంతో అపూర్వ అనుబంధాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తన అర్థ శతాబ్దపు ప్రయాణంలో దాశరథి, కాళోజీ, డాక్టర్ సి. నారాయణరెడ్డి లాంటి ప్రముఖుల ప్రశంసలు అందుకుని కవయిత్రి, సామాజిక పరిశోధకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందరు హనుమకొండ పట్టణానికి చెందిన అనిశెట్టి రజిత. మనసు తలపులకు తోరణాలు తన సాహితీ జ్ఞాపకాలని అనిశెట్టి రజిత చెబుతుంటారు. ఉద్యమాలు, సాహిత్య రంగంతో తన ప్రయాణంలో ఎన్నో మైలు రాళ్లఉన్నాయని చెబుతున్న ఆమెకు ఉమ్మడి రాష్ట్రంలో 1975లో వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్ర సాంస్కృతిక రజతోత్సవాల్లో సుప్రసిద్ధ కవులతో నిర్వహించిన కవిసమ్మేళనంలో స్థానం దక్కింది. ప్రముఖ కవులు డాక్టర్ దాశరథి, డాక్టర్ సి. నారాయణరెడ్డి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు, నాయిని కృష్ణకుమారి, కొలకలూరి ఇనాక్ లాంటి వారి సమక్షంలో కవిత వినిపించారు. ఆ సమయంలో ప్రపంచ మంతా పైసా మయం అనే కవితను వినిపించిన రజితను కవులంతా ఎంతగానో ప్రశంసించి ఆమె తలమీద చెయ్యి పెట్టి ప్రత్యేకంగా ఆశీర్వదించారు. అది తనకు అపూర్వ జ్ఞాపకమని, తన సాహితీ చరిత్రలో మరువలేని సంఘటన అని అనిశెట్టి రజిత పేర్కొ న్నారు. హనుమకొండలో మరోసారి కేతవర పు రామకోట శాస్త్రి అధ్యక్షతన నిర్వహిం చిన కవి సమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే.. కవిత ప్రమాణికంగా ఉంటేనే వచ్చి వినిపించాలని రామకో టశాస్త్రి ఆదేశించగా.. భయపడుతూనే ఆమె తన కవితను వినిపించారట. ఆ తర్వాత రామకోటశాస్త్రి ఆమెను ప్రశంసించారట. 1976-77 సంవత్సరం లో తన కవితా సంపుటి కి అచ్చు వేయా లని దాని ప్రతి ప్రజా కవి కాళోజీకి చూపించగా.. కవితలు బాగానే ఉన్నాయి. కానీ లకోటగా ఉన్నాయని, ఇంత చిన్న వయసులో పుస్తకం ఎందుకు ప్రచురిచడం అని సంశయించడంతో రెండు దశాబ్దాల అనంతరం 1997లో నెనొక నల్లమబ్బునవుతా అన్న తొలి ప్రచూరణతో సాహితీ ప్రపంచానికి పరిచమైనట్లు రజి త వివరించారు. కాళోజీనే ఆ సభకు అతిథిగా పిలుచుకున్నానని, ఆకాశమెత్తుకు ఎదిగిన కాళన్న తన కవితలను ప్రశంసించడం ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆమె చెప్పారు. దాశరథి రంగాచార్య అక్షర షరతులు సంధించే మహా రచయిత ప్రశంసలు కూడా అనేక సందర్భాల్లో అందుకున్నట్లు చెప్పారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రమంతా వందలాది సాహిత్య వేదికలపై పరిచయాలు, స్నేహం, అనుబంధాలు అనేకం. ఇప్పటి వరకు 13 గ్రంథాలు ముద్రించాను. రుద్రమ వేదిక ప్రచురణల వ్యవస్థాపక సభ్యురాలిగా గత దశాబ్దంన్నర కాలంగా మూడోసారి ఆమె జాతీయ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు.

సామాజికం, సాహిత్యం సమాంత రంగా 20కి పైగా సంకలనాలకు సంపా దక బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకు 38 పురస్కారాలు అందుకున్నారు రజిత. కవి అయిన రచయిత అయిన కళాకారులైనా సాహిత్య, సాంస్కృతిక సైనికుల్లా క్రమశిక్షణతో ఉండాలని, అధ్యయనంతో రచనలు సాధన చేయాలని, వేదికలు సన్మానాలకు లొంగకూడదని ఆమె యువతకు పిలుపునిస్తున్నారు. సమాజం పట్ల పీడిత జన సమూహాల పట్ల ప్రేమతో సాను భూతి చూపేలా కవిత్వంతో కారుణ్యం కలిగి ఉండేలా రచనలు చేయాలన్నారు. నైతిక విలువలు మానవీయత కవి గమ్యం కావా లన్నారు. మానవ సంబంధాల విస్తరణ సామాజిక శాంతి, కవితా లోకం లక్ష్యం కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.


కాళోజీ జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను పంపిస్తున్న సీఐ సత్య నారాయణరెడ్డి

రేవంత్‌రెడ్డి.. ఇచ్చిన మాట మరువొద్దు

- సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల నినాదాలు
- కాళోజీ జంక్షన్‌లో రాస్తారోకో

హనుమకొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను మరువొద్దని సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జేఏసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దొనికెల శ్రీధర్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రం నుంచి కాళోజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా దొనికెల శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చేతిలోనే విద్యాశాఖ ఉన్నదని, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను వెంటనే వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష అసోసియేషన్ ఆల్ వింగ్స్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 29 రోజులుగా ఏకశిలా పార్కు వద్ద దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవాలని డిమాండ్ చేస్తూ కాళోజీ జంక్షన్‌లో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. సుబేదారీ సీఐ పి.సత్యనారాయణరెడ్డి, పోలీస్ సిబ్బంది కాళోజీ జంక్షన్ వద్దకు చేరుకుని కాంట్రాక్ట్ ఉద్యోగులతో మాట్లాడి అక్కడి నుంచి పంపించి వేశారు. కాళోజీ జంక్షన్‌లో అరగంట పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో కొద్దిసేపు ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు షఫీ, కుమార్, రమేష్, మనోజ, సరిత, రుద్రారపు రాజు, తండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు మునిసిపాలిటీకి

కేబినెట్ ఆమోదం

పాత బిల్లును సవరిస్తూ.. జాకారం విలీనం

- నాలుగు గ్రామ పంచాయతీలతో విస్తరణ
- బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు



ములుగు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ములుగు మునిసిపాలిటీ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ములుగు, బండారుపల్లి, జీవంతరావుపల్లి, జాకారం గ్రామాలను విలీనం చేయనున్నారు. శనివారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం ఈమేరకు నిర్ణయం తీసుకుంది. వాస్తవానికి 2022సెప్టెంబరు 12న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మునిసిపాలిటీ చట్టసవరణ బిల్లులో ములుగును మునిసిపాలిటీగా ఏర్పాటుచేస్తూ తీర్మానించింది. ములుగు గ్రామపంచాయతీతోపాటు బండారుపల్లి, జీవంతరావుపల్లిని విలీనం చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అయితే బిల్లు సుదీర్ఘకాలం రాజ్‌భవన్‌లోనే నిలిచిపోయింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ములుగు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ధనసరి అనసూయ సీతక్కకు మంత్రివర్గంలో కీలక పదవి రావడంతో ప్రజల్లో ఆశలు కలిగాయి. ఆమె చొరవతో గతేడాది జూలై 6న గవర్నర్ మునిసిపాలిటీ బిల్లుకు ఆమోదం తెలిపారు. ఆవెంటనే రాష్ట్రపతి పరిశీలనకు కూడా పంపించారు. అయితే ములుగు మునిసిపాలిటీ పరిధిలోకి జాకారం గ్రామాన్ని తీసుకురావాలనే అంశం తెరపైకి వచ్చింది. జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం తాత్కాలిక క్యాంపస్ జాకారంలోనే ఉండటం, భవిష్యత్ అవసరాలకు ఇక్కడికి సమీపంలో ప్రభుత్వ భూములు ఉండటంతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క జాకారంతో కూడిన మునిసిపాలిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మంత్రి సూచనతో జిల్లా కలెక్టర్ గ్రామ సభ ఏర్పాటు చేయించారు. ప్రజలు అంగీకారం తెలపడంతో తీర్మానం నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. ప్రస్తుతం జనాభా ప్రకారం ములుగు, బండారుపల్లి, జాకారం, జీవంతరావుపల్లి కలుపుకొని 25వేల మందికిపైగా జనాభా ఉంటుందని అంచనా. ఓపక్క స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర సర్కారు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో కేబినెట్ ఆమోదం పొందిన మునిసిపాలిటీ బిల్లును వెంటవెంటనే గవర్నర్, రాష్ట్రపతి పరిశీలనకు పంపించి సాధ్యమైనంత త్వరగా ఆమోదింపజేయాలని మంత్రి సీతక్క కృషి చేస్తున్నారు.

అంబరాన్నంటిన సంబురాలు

ములుగు మునిసిపాలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి ములుగులో సంబరాలు చేసుకున్నారు. జాతీయ రహదారిపై బాణాసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ ఏర్పాటుతో ములుగు అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, పట్టణాధ్యక్షుడు చింతనిప్పుల బిక్షపతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మర్రి రాజు, నల్లెల భరత్‌కుమార్, యాసం రవికుమార్, ఇమ్మడి రాజుయాదవ్, ఎల్లావుల అశోక్‌యాదవ్, లావుడ్య రమేష్, మట్టెవాడ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


ములుగు పట్టణం

కర్షకుల్లో హర్షాతిరేకం

- కిసాన్ సమ్మాన్ నిధి పెంపుతో ఆనందం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 4 లక్షల మంది లబ్ధిదారులు
- ఆంక్షలతో అందరికీ కేంద్ర ప్రభుత్వ పథకం



హనుమకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి మొత్తాన్ని రూ.6000 నుంచి రూ.10000 వేలకు పెంచుతున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటనతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ పెంపు వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్నదాతలకు అదనంగా రూ.162 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 4 లక్షల మంది రైతులు పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని పొందుతున్నారు. కిసాన్ నిధి మొత్తాన్ని పెంచుతూ 2025-26 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన చేయబోతున్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఆరేళ్లుగా అమలు చేస్తున్న ఈ పథకానికి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. రైతులకు పంట సాయం కింద బాగా ఉపయోగపడుతోంది. ఇప్పటి వరకు కేంద్రం 18 వాయిదాల్లో చెల్లించింది. కొత్త ఏడాది ఫిబ్రవరిలో 19వ వాయిదా జమ కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో ప్రధాని ప్రకటన వారిలో ఆనందోత్సహాలు రేపింది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కిసాన్ సమ్మాన్ యోజన నిధి కింద 4,07,246 మంది రైతులు ప్రస్తుతం లబ్ధిపొందుతున్నారు. హనుమకొండ జిల్లాలో 60,100 మంది, వరంగల్ జిల్లాలో 62, 1213, జనగామ జిల్లాలో 73,420, మహబూబాబాద్ జిల్లాలో 95, 321, ములుగు జిల్లాలో 58,761, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 57,523 మంది రైతులు సమ్మాన్ నిధి పొందుతున్నారు. కాగా, వివిధ కారణాల వల్ల ఉమ్మడి జిల్లాలో 9,253 మంది రైతులకు ఈ పథకం కింద లబ్ధి నిలిచిపోయింది. వీరిలో హనుమకొండ జిల్లాలో 1,520, వరంగల్‌లో 1,652, జనగామలో 17,358, మహబూబాబాద్‌లో 1,842, ములుగులో 1,376, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,128 మంది రైతులు వీరిలో ఉన్నారు. వీరుకాకుండా కొత్తగా పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందినవారు, ధరణిలో భూముల వివరాలు సరిగా నమోదు కానివారు, తప్పులు దొర్లిన వారు, ఇతరత్రా కారణాల ఫలితంగానూ మరో 1,19,534 మంది రైతులు కిసాన్ సమ్మాన్ నిధికి దూరంగా ఉన్నారు.

కొత్తగా పట్టాలు

నాలుగేళ్లగా ఇప్పటి వరకు 18 విడతలుగా ఏటా రూ.6వేలను మూడు దఫాలుగా జమ చేసింది. 2019 నుంచి కేంద్రం నిబంధనలను సడలించకపోవడంతో కొత్తగా పట్టాలు పొందిన రైతులకు సాయం అందడం లేదు. 2019 ఫిబ్రవరి వరకు పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులను మినహాయించి మిగిలిన పట్టాదారు రైతులకు కిసాన్ సమ్మాన్ జాబితాలో చేర్చారు. ఒకే కుటుంబంలో ఇద్దరి వ్యక్తుల పేరిట భూములు ఉంటే ఒక్కరికే వర్తింపచేస్తున్నారు. పట్టాదారు మరణిస్తే ఆ భూమిని విరాసత్ చేసుకున్న వారికి తిరిగి పథకాన్ని వర్తింపజేస్తున్నారు. తమ అవసరాల రిత్యా లబ్ధిదారులు భూములను విక్రయిస్తే ఆ భూములు కొనుగోలు చేసిన వారికి వర్తింపచేయకపోవడంతో ఏటా లబ్ధిదారుల సంఖ్య తగ్గుతోంది.

ధరణి కారణంగా..

2015లో రాష్ట్ర ప్రభుత్వం భూ ప్రక్షాళన చేపట్టిన తర్వాత 2018 నుంచి హైసెక్యూరిటీ గల పాస్‌బుక్‌లను రైతులకు అందజేస్తోంది.



2019 ఫిబ్రవరి నాటికి చాలామందికి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందలేదు. ధరణి పోర్టల్‌లో అందుబాటులోకి వచ్చిన తర్వాత అప్పటి భూముల వివరాలు అప్‌డేట్ కాలేదు. భూ రికార్డుల ప్రక్షాళనలో కొన్ని తప్పులు దొర్లాయి. వాటిని సరిద్దిద్దే నాటికి ప్రభుత్వానికి రెండేళ్లు పట్టింది.

ఈ కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో చాలా మందికి 2019 ఫిబ్రవరి తర్వాత పట్టాదారు పాస్ పుస్తకాలు అందలేదు. రాష్ట్రంలో త్వరలో భూ భారతి అమలులోకి వస్తున్నందువల్ల దీని ద్వారా అయిన రైతుల సమస్యలను పరిష్కరించి కిసాన్ లబ్ధిదారుల జాబితాలో చేర్చాలని రైతులు కోరుతున్నారు. రైతుబంధు పథకంలో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులకు దరఖాస్తు చేసుకోవడానికి ఏటా అవకాశం కల్పిస్తున్నారు. కానీ కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో ఆ అవకాశం లేదు. ఐఎఫ్ఎస్సీ కోడ్ తప్పుగా నింపిన రైతులు సైతం తిరస్కరణకు గురయ్యారు.


బ్యాంకు ఖాతాలు మూతపడ్డ రైతులు, బ్యాంకు ఖాతాలు చెల్లని వారు కూడా ఈ పథకానికి దూరమయ్యారు. 18 ఏళ్ల వయసులోపు రైతులకు ఇది వర్తించడం లేదు. దరఖాస్తు పరిశీలన సమయంలో రైతుల రికార్డులను బ్యాంకు లేదా పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) తిరస్కరించడంవల్ల కూడా కొందరు రైతులు సమ్మాన్ నిధిని పొందలేకపోతున్నారు. కిసాన్ సమ్మాన్ నిధిలో చేరాలంటే రైతులు తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలి. అవగాహన లేక చాలా మంది రైతులు చేసుకోవడం లేదు. వీరి సాయం పొందలేపోతున్నారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేకపోవడంతో కూడా డబ్బులు రావడం లేదు. ఆదాయం పన్ను చెల్లించే రైతులను ఈ పథకం నుంచి తొలగించారు. రేషన్ కార్డుల ప్రకారం కుటుంబంలో ఒక్కరికే వర్తింపచేస్తున్నారు. రూ.10వేల కంటే ఎక్కువ పింఛన్ తీసుకున్నవారిని పథకం పరిధి నుంచి తొలగించారు. తర్వాత విడతల్లో అయినా కిసాన్ సమ్మాన్ నిధి అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. అర్హులైన రైతులందరికీ డబ్బులు ఖాతాల్లో పడేలా ప్రస్తుతం ఉన్న నిబంధనలను సడలించాలని, కొత్తగా పట్టాదారు పాస్‌బుక్‌లు పొందిన రైతులకు కూడా ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తున్నారు.

మరి ఆంక్షల మాటేమిటి ?

సమ్మాన్ నిధి అమలుపై కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షల సంగతేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా అంత సులువుగా ఈ పథకం లేదు. అర్హులైన అన్నదాతలకు మాత్రమే పెట్టుబడి సాయం అందాలన్న లక్ష్యంతో కేంద్రం సమ్మాన్ నిధి వర్తింపుపై అనేక ఆంక్షలు విధించింది. కేవైసీ తప్పని సరి చేసుకోవాలన్న షరతు పెట్టింది. దీనితో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది రైతులు ఇప్పటికీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పరిధిలోకి రాలేకపోతున్నారు. సకాలంలో కేవైసీ చేసుకోలేని వేలాది మంది రైతులు డబ్బులు విడుదలైన బ్యాంకుల నుంచి పొందలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో పీఎం కిసాన్ నిధిని నోచుకోలేని రైతులు సుమారు లక్ష మంది వరకు ఉంటారని అంచనా.

నిబంధనలు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన నిధి పథకంలోని నిబంధనలు సడలించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో చాలా మంది రైతులు ప్రయోజనం పొందలేకపోతున్నారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల కొంత మంది రైతులు లబ్ధిపొందలేకపోతుండగా, నిబంధ నల సడలింపు లేకపోవడం వల్ల మరి కొంత మంది ఈ పథకం పరిధలోకి రాలేకపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కిసా న్ సమ్మాన్ యోజన నిధి ద్వారా సుమారు 4,07,246 మంది ప్రస్తుతం లబ్ధిపొందుతున్నారు. అయితే ఈ పథకం అమలులోకి వచ్చిన మొదట్లో వీరి సంఖ్య 4,16,499 ఉండగా, ఆ తర్వాత కాలంలో వీరి సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. వివిధ కారణాల వల్ల 9,253 మంది రైతులవి పెండింగ్‌లో ఉన్నాయి.



ఆంధ్రజ్యోతి

హనుమకొండ సిటీ

HANUMAKONDA CITY ■ ఆదివారం 5 జనవరి 2025 V 8

అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు

హసన్‌పర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని జడ్పీ సీఈవో విద్యాలత అధికారులను ఆదేశించారు. మండలంలోని గంటూర్‌పల్లి గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇందిరమ్మ లబ్ధిదారుల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీలో మొక్కల పెంపకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎంపీడీవో వెంకటరెడ్డి, ఎంపీవో కర్ణాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పొడిశెట్టి రజనీ, ఫీల్డ్ అసిస్టెంట్ కిరణ్‌రెడ్డి, కారొబార్ సమ్మిరెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.



గంటూర్‌పల్లిలో సమస్యలను తెలుసుకుంటున్న జడ్పీ సీఈవో విద్యాలత

కేయూ-2025 క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్ జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ 2025 క్యాలెండర్‌ను శనివారం కేయూ పరిపాలన భవనంలో కేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పాలక మండలి సభ్యుడు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ బి.వెంకట్రావిరెడ్డి, ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ ఈసం నారాయణ, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.నరసింహరావు, ఆర్.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ ఆదర్శనీయుడు



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యార్థులు

హసన్‌పర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు లూయిస్ బ్రెయిలీ ఆదర్శనీయుడు అని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ అన్నారు. భీమారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలు ప్రధానోపాధ్యాయుడు దేవేందర్ అధ్యక్షతన శనివారం జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక అంధ ఉపాధ్యాయురాలు స్వరూపరాణిని సన్మానించారు. అనంతరం మహేందర్ మాట్లాడుతూ.. చిన్న వయసులో చూపును కోల్పోయినప్పటికీ చదవాలనే పట్టుదలతో అంధుల పాఠశాలలో విద్యనభ్యసించడమే కాకుండా అతడి లాంటి ఎందరో అంధులు సులువుగా చదువుకునే విధంగా ఆరు చుక్కల లిపిని కనిపెట్టి అంధులకు వెలుగు ప్రదాత అయిన లూయిస్ బ్రెయిలీ సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులు వి.వాసుదేవరెడ్డి, బి.ఉమాదేవి, సృజన, రవీందర్, చేరాలు, తిరుపతిరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

షైన్ స్కూల్‌లో ఘనంగా ఇన్నోఫెస్ట్ సంబరాలు



ఎగ్జిబిట్ల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న షైన్ విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్

హనుమకొండ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని షైన్ స్కూల్‌లో శనివారం ఘనంగా ఇన్నో ఫెస్ట్ సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ పాల్గొని సైన్స్ ఎగ్జిబిట్లను ప్రారంభించిన అనంతరం విద్యార్థులను అడిగి ఎగ్జిబిట్ల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత శక్తిని బయటకు వెలికి తీసేందుకు సామాన్య శాస్త్రం, గణిత శాస్త్రం ఎగ్జిబిట్లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. శాస్త్ర సాంకేతిక నైపుణ్యానికి దోహదం చేస్తాయన్నారు. ఎగ్జిబిట్లు తయారు చేసిన విద్యార్థులను అభినందిచారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాజేంద్రకుమార్, ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, షైన్ ప్రాథమిక పాఠశాల డైరెక్టర్ మూగల రమ, వైస్ చైర్మన్ మూగల రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక శాస్త్రాలు జాతిని నిర్మిస్తాయి..



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సామాజిక శాస్త్రాల్లో నిష్ణాతులైన విద్యార్థులు జాతిని నిర్మిస్తారని డీఈవో వాసంతి అన్నారు. తెలంగాణ రాష్ట్ర సోషల్ ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణమండపంలో 10వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు నిత్యం వార్తా పత్రికలు చదువుతూ సమకాలీన సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత ఉద్యోగాలు పొంది సమాజసేవ చేయాలన్నారు. అనంతరం ఆహూతుల చేతుల మీదుగా టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, ఫోరమ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్‌రెడ్డి, సతీష్‌ప్రకాశ్, ఎంఈవో నెహ్రూనాయక్, నవీన్‌కుమార్, రాధాకృష్ణచారి, జయ, రేవతి, వెంకటయ్య, అశోక్‌కుమార్, శ్రీనివాస్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మట్టెవాడ పోలీసు స్టేషన్‌కు సీసీరోడ్డు వేయాలి

▸▸ బల్దియా కమిషనర్‌ను కలిసిన ఏసీపీ, సీఐ

వరంగల్ కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాకతీయ టాకీస్ రోడ్డు నుంచి మట్టెవాడ పోలీసుస్టేషన్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉందని, సీసీరోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ కార్యాలయంలో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపిరెడ్డి కలిసి పూలమొక్కను అందించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వెంటనే స్పందించిన కమిషనర్ తప్పకుండా చేస్తానని సానుకూలంగాస్పందించినట్టు పోలీసుఅధికారులు వెల్లడించారు.



కమిషనర్‌కు పూల మొక్క అందిస్తున్న పోలీసు అధికారులు

కార్మికులకు రూ.26వేల వేతనం అందించాలి

▸▸ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్

▸▸ బల్దియా కార్యాలయం ఎదుట 48 గంటల ధర్నా

వరంగల్ కార్పొరేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో 48 గంటల దీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. 2016లో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు తెప్పిందని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు బీజేపీ ప్రభుత్వం అమలు చేయడం లేదని మండిపడ్డారు. రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాలకు వేతనాలు పెంచడంలో చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో శానిటేషన్ కార్మికుల పాత్ర కీలకమని గుర్తు చేశారు. తక్షణమే మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని గుర్తు చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాల్సి ఉన్నా ప్రభుత్వాలు అమలు చేయడం లేదని విమర్శించారు. బల్దియా ఔట్ సోర్సింగ్, మలేరియా కార్మికులకు వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద సంపత్, సీఐటీయూ నాయకులు మహేశ్, జన్ను ప్రకాశ్, బాబురావు, కృష్ణ, యాస బాబు, నవనీత, కోటేశ్వర్, సుశీల్, కుమార్, రాజు, రంజీత్, నగేశ్, పాపయ్య, సుజాత, ప్రభ, సువర్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాగుల రమేష్

నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

● కాజీపేట ఏసీపీ తిరుమల్

హసన్‌పర్తి, జనవరి4(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని కాజీపేట ఏసీపీ తిరుమల్ అన్నారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా శనివారం మండలంలోని నాగారం గ్రామంలో కాజీపేట ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి, కమలాపూర్, ఎల్కతుర్తి ఇన్‌స్పెక్టర్‌లు వట్టి చేరాలు, హరికృష్ణ, పులి రమేష్‌లు పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా కాజీపేట ఏసీపీ తిరుమల్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ విలువైన జీవితాలను దుర్భరం చేసుకోవద్దని సూచించారు. నేరాలు జరిగినప్పుడు ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి నేరాల నియంత్రణకు తమ సంపూర్ణ మద్దతు ఇచ్చి పోలీసులతో సహకరించాలన్నారు. అంతేకాకుండా యువత మత్తు పానీయాలు, మాదక ద్రవ్యాలు, రోడ్డు భద్రతా వారోత్సవాలు, సైబర్ క్రైం, మూఢనమ్మకాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో హసన్‌పర్తి, కమలాపూర్, ఎల్కతుర్తి పోలీసు సిబ్బంది, నాగారం గ్రామస్తులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే

హసన్‌పర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం హైదరాబాద్ హయత్‌నగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన వారిలో హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులున్నారు.



మహేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నాగరాజు

ఎంఈఎఫ్ సదస్సును విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న శనివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీలోని ఠాకూర్ ఆడిటోరియంలో నిర్వహించే మాదిగ ఉద్యోగుల సదస్సును విజయవంతం చేయాలని కేయూ ఎంఈఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ పోడేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం కేయూ బయోటెక్నాలజీ విభాగంలో ఎంఈఎఫ్ పోస్టర్ కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం నేతలు ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యోగులందరూ ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. వేల గొంతుల లక్ష డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.సుజాత, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, డాక్టర్ సంకినేని వెంకట్, రాష్ట్ర నేతలు కుమ్మరి రాజయ్య, ఇన్‌చార్జి మంద రాజు, బొల్లపాక ప్రభాకర్, బొక్క మొగిలి, డాక్టర్ ఎఫ్రాహ్‌మ్‌రాజ్, బాబు , తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మడికొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కెనరా బ్యాంకు మడికొండ బ్రాంచి సీనియర్ మేనేజర్ జి.ప్రభాకర్ అన్నారు. మడికొండ మున్సిపల్ కార్యాలయంలో సిరి స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో మహిళలకు మూడు నెలల పాటు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పరికి సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి బ్యాంకు మేనేజర్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన మహిళలకు అవసరమైన యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకు ద్వారా సహకార లోన్లు అందజేస్తామని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు లింకు లోన్ల ద్వారా ఉచిత కుట్టు మిషన్లు ఇప్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.డి.మహమ్మద్ పాషా, కుమారస్వామి, మడ్డి రాజారాం, కుట్టు శిక్షణ టీచర్ మడ్డి అరుణ, శ్రీదేవి, బండి త్రివేణి, మూల స్వరూపరాణి, పెద్ది లావణ్య, బి.స్వప్న, బి.ఉమ, దీప, కె.సింధు, అక్షయ, లక్ష్మీసౌజన్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన బ్యాంకు మేనేజర్ ప్రభాకర్

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంలో డీఈవో దర్పం

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారి డెడ్డే వాసంతి దర్పం.. జిల్లా అధికార యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది. మహాత్మా సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో డీఈవో వాసంతి వ్యవహార శైలి అక్కడున్న అధికార, రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసినట్లు విశ్వసనీయ సమాచారం. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డితో పాటు ఇతరత్రా అధికారులు వారి పాదరక్షలను విడిచి మహనీయురాలు సావిత్రిబాయి పూలే చిత్రపటం ముందు నివాళులు అర్పించగా డీఈవో వాసంతి తనదర్పాన్ని ప్రదర్శిస్తూ బూట్లతో నివాళులు అర్పించడంపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆమె వ్యవహార శైలి సరిగా లేదని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

గ్రీన్ ఫీల్డ్ రైతులకు న్యాయం చేయాలి

వడ్డెపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఫీల్డ్ రైతులకు తగిన పరిహారం చెల్లించి న్యాయం చేయాలని గ్రీన్ ఫీల్డ్ ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల జేఏసీ కన్వీనర్ బి.రాంచందర్‌రావు జిల్లా కలెక్టర్‌ను కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు జేఏసీ నేతలు ఎం.సంధ్యారాణి, స్వప్న, బి.రాజిరెడ్డిలు మాట్లాడారు. నాగపూర్ నుంచి అమరావతి వరకు వెళ్లే గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వ్యవసాయ భూముల నుంచి వెళ్తోందని అన్నారు. దీంతో కోట్లాది విలువ చేసే లక్షలాది ఎకరాల భూములు గ్రీన్ ఫీల్డ్ రోడ్డులో పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అభివృద్ధికి ఆటంకం కాదని చెప్పారు. గ్రామ గ్రామాన భూముల బహిరంగ మార్కెట్ రేటును పరిగణలోకి తీసుకోవాలని కోరారు. చట్టప్రకారం తమకు నష్టపరిహారం మూడు రేట్లు కలపాలని డిమాండ్ చేశారు. భూ సేకరణకు సంబంధించి రైతుల అనుమతిని తీసుకున్న తర్వాతే ఒకే దఫాగా డీడీ రూపంలో అవార్డును ప్రకటించాలనిఅన్నారు. రైతులందరు శాశ్వతంగా భూమిపై ఉన్న జీవన భృతిని తరతరాలుగా కోల్పోనున్నారని పేర్కొన్నారు. టోల్ రుసుములో 70శాతం శాశ్వత వాటాను భూములు కోల్పోయిన రైతులందరికీ ఇప్పించాలని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వివిధ జిల్లాల కలెక్టర్లకు రైతులు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రైతు జేఏసీ నేతలు సతీష్, వేణు, దేవేందర్‌రెడ్డి, రాజేందర్, మనోహర్‌రావు, సాంబయ్య, రాజు, మనోహర్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, రఘుపతి, బాబుచారి, శివకుమార్, బొల్లు సమ్మిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బి.రాంచందర్‌రావు, రైతులు

పారాలీగల్ వలంటీర్లు ప్రజలకు సేవలందించాలి

▸▸ జిల్లా ఇన్‌చార్జ్ జడ్జి అపర్ణాదేవి

వరంగల్ లీగల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పారాలీగల్ వలంటీర్లు ప్రజలకు, న్యాయ సేవాధికార సంస్థకు వారధిగా ఉండి సేవలందించాలని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి జడ్జి, మొదటి అదనపు జిల్లా జడ్జి బి.అపర్ణాదేవి సూచించారు. శనివారం జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మానసిక అనారోగ్యం, మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు - 2024(నాల్సా) పథకంపై పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్‌చార్జి జిల్లా జడ్జి మాట్లాడుతూ.. న్యాయసేవా సంస్థల ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు న్యాయ సేవాధికార సంస్థల విధులను, లక్ష్యాలను ప్రజలకు తెలియజేసి ఏ పౌరుడైనా అన్యాయానికి గురికాకుండా బాధ్యత తీసుకోవాలని అన్నారు. మానసిక అనారోగ్యం, మేధో వైకల్యం ఉన్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు అందుబాటులో ఉన్నాయని, ఈ విషయాలను లీగల్ వలంటీర్లు ప్రజలకు తెలియజేయాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్.సురేష్, డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్ పి.శ్రీనివాసరావు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు

కేయూ క్యాంపస్ జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కేయూ మహిళా ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ భిక్షాలు పాల్గొని మాట్లాడారు. కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. 2013 నుంచి 2024 వరకు విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలలోని ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా అప్‌గ్రేడ్ చేసేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థిని భవానీ కళాశాలలో తన గతానుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వైష్ణవి,టీపీఓ బొల్లం కిరణ్‌కుమార్, తూర్పాటి వెంకటేష్, సురేందర్, సాయి తరుణ్, వాణిశ్రీ, డాక్టర్ ఎన్.వీణ, స్వప్న, దీప్తి, రచన, శ్రీజ, అనూష, జ్యోత్స్న, రమ, జ్యోతి, కిషన్, శ్రీనివాస్, ఏఆర్ ఆర్. వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ వీరునాయక్, మల్లేశం, జగన్, సంజయ్, సుమన్, యాదగిరి, జ్యోతి, చైతన్య, లావణ్య, ఫిరోజ్, తాజ్‌బాబా, నాగరాజు, మమత,ప్రమీల, సుజాత పాల్గొన్నారు.

రైల్వే టెక్నీషియన్ ప్రవీణ్‌కుమార్‌కు అవార్డు

కాజీపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాజీపేట డీజిల్‌షెడ్ ఎలక్ట్రానిక్ ల్యాబ్‌లో టెక్నీషియన్ గ్రేడ్-1గా పనిచేస్తున్న టి.ప్రవీణ్‌కుమార్‌కు విశాల్ రేల్ సేవా పురస్కార్ అవార్డు దక్కింది. వివిధరకాల లోకో ఇంజన్‌లను అతి తక్కువ ఖర్చుతో ఎలక్ట్రానిక్ కార్డు, కాంపోనెంట్స్‌తో రిపేర్ చేసి రైల్వేకు రూ.2కోట్ల 73 లక్షలు ఆదా చేసినందుకు ఈ అవార్డు దక్కింది. శుక్రవారం రాత్రి ఈ అవార్డును రైల్వే జీఎం అరుణ్ కుమార్ చేతుల మీదుగా సికింద్రాబాద్‌లో తీసుకున్నాడు. అవార్డు దక్కించుకున్న ప్రవీణ్‌కుమార్‌ను రైల్వే కార్మిక సంఘ నాయకులు, ఉద్యోగులు శనివారం అభినందించారు.



రైల్వే జీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్

నేను ఎలాంటి కబ్జాలు చేయలేదు

న్యూశాయంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తాను ఎలాంటి భూకబ్జాలు చేయలేదని 31వ డివిజన్ దీన్‌దయాల్‌నగర్‌కు చెందిన కానిస్టేబుల్ దేవర బక్కయ్య స్పష్టం చేశారు. ఈ నెల 1వ తేదీన తనపై దీన్‌దయాల్‌నగర్‌కు చెందిన అనంతుల వెంకటేశ్వర్లు చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమన్నారు. తనను కావాలనే ఉద్యోగ రిత్యా ఇబ్బందులకు గురి చేస్తున్నారని బక్కయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతుల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తనకు ప్లాటు కొనిస్తానని నమ్మించి మోసం చేశాడని, ఆపై తనపైనే తప్పుడుఆరోపణలు చేస్తున్నాడన్నారు. ఆయన మోసాలకు సంబంధించి ఆధారాలు ఉన్నాయని తెలిపారు.

కాంగ్రెస్ నమ్మించి మోసం చేస్తోంది..

రాంనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలను నమ్మించి కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆరోపించారు. బీజేపీ సంస్థాగత పర్వం-2024కు సంబంధించిన స్క్రీనింగ్ కమిటీ సమావేశం శనివారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలోని 7 మండలాలు, 29 డివిజన్‌లు కలిపి 36 డివిజన్‌ల అధ్యక్ష నియామకాల్లో 30 డివిజన్‌ల అధ్యక్షుల ఎంపికపై ఏకాభిప్రాయం కుదిరింది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి గంగారెడ్డి, విజయరామారావు, రాజేశ్వర్‌రావు, మార్తినేని ధర్మారావు, ఒంటేరు జైపాల్, విజయ్‌చందర్‌రెడ్డి, పగడాల కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ దిలీప్‌రాజ్ జన్మదిన వేడుకలు

కాజీపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్‌రాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.35 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కాజీపేట, తరాలపల్లి, మడికొండ, కడిపికొండ, బట్టుపల్లి, కుమ్మరిగూడెం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ పరీక్ష ప్యాడ్‌లు, స్టడీ మెటీరియల్స్ ఉపయోగించేందుకు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు నాయకులు చెప్పారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కర్ర హరీష్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్కూరి రేవంత్, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, నాయకులు జెన్నపురెడ్డి, రుగ్వేద్ రెడ్డి, బస్కె ప్రణయ్, బోగి కృష్ణ, దాసరి కార్తీక్‌తోపాటు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

● హసన్‌పర్తి : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్.దిలీప్‌రాజ్ జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే వెయ్యి మంది విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు పరీక్షా ప్యాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ అర్బన్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గడ్డం వరుణ్, జిల్లా కాంగ్రెస్‌నాయకులు గడ్డం శివరాంప్రసాద్, సీనియర్ నాయకులు రాయికంటి సుధాకర్, యుగేందర్, వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల పవన్‌కళ్యాణ్, హసన్‌పర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వీర సుధాకర్, ఎర్రగట్టు దేవస్థానం పాలక మండలి సభ్యుడు చల్ల సుమంత్, యూత్ నాయకులు నాగరాజు, మురళి, రాజేష్, వంశీ, హరీష్, చింటూ, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్.దిలీప్‌రాజ్ జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డోలి సాగర్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంకా హరిబాబు, పార్టీ సీనియర్ నాయకులు చింత రమేష్ గౌడ్, దూలం సదానందంగౌడ్, భూక్య విజయ్ నాయక్, దూలం పరమేశ్ గౌడ్, యూత్ నేతలు బూర్ల శ్రీను, నూతనకంటి తేజతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాజీపేటలో విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా వి డుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
బ్లాక్‌వారెంట్	హిందీ సిరీస్	జనవరి 10
లెజెండ్ ఆఫ్ ఫ్లఫ్ఫీ	స్టాండప్ కామెడీ షో	జనవరి 07
జెర్రీ స్ప్రింగర్	డాక్యుమెంటరీ సిరీస్	జనవరి 07
ది అప్‌షాస్ 6	వెబ్‌సిరీస్	జనవరి 09
గూస్‌బంప్స్	వెబ్‌సిరీస్	జనవరి 10
అమెజాన్ ప్రైమ్		
ఫోకస్	హాలీవుడ్ మూవీ	జనవరి 10
జియో సినిమా		
రోడీస్ డబుల్ క్రాస్	రియాలిటీ షో	జనవరి 11
జీ 5		
సబర్మతి రిపోర్ట్	హిందీ చిత్రం	జనవరి 10
సోనీ లివ్		
షార్క్ ట్యాంక్ ఇండియా 4	రియాలిటీ షో	జనవరి 06

చెరసాల చెప్పిన కథ



జైల్ పాలిటిక్స్ నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'బ్లాక్ వారెంట్'. సునీల్ గుప్తా, సునేత్రా చౌధురి రాసిన 'బ్లాక్ వారెంట్: ఏ కన్ఫెషన్స్ ఆఫ్ ఏ తీహార్ జైలర్' పుస్తకం ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కించారు. బాలీవుడ్ నటదిగ్గజం శశికపూర్ మనవడు జహాన్ కపూర్ హీరోగా నటించాడు. 'తీహార్ జైలుకు కొత్త జైలర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత అతను పై నుంచి ఎలాంటి ఒత్తిళ్ల ఎదుర్కొన్నాడు, జైలు సిబ్బంది, నేరస్తులు పన్నిన కుట్రలను ఎలా ఛేదించాడు, తీహార్ జైలు నిర్వహణను రాజకీయాలు ఎలా ప్రభావితం చేస్తున్నాయి లాంటి వెలుగులోని రాని పలు అంశాలను ఈ సిరీస్‌లో ఆవిష్కరిస్తున్నాం' అని దర్శకుడు చెప్పారు.

ముత్యాల ముగ్గు





సుజాత
హైదరాబాద్

17 చుక్కలు
9 వచ్చేవరకు
సంధు చుక్కలు

ఈ-మెయిల్: features@andhrajyothy.com



రాషా తడాని

బాలీవుడ్‌లో స్టార్ కిడ్స్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇతర చిత్ర పరిశ్రమలతో పోలిస్తే హిందీలోనే ఈ ట్రెండ్ ఎక్కువ. అయితే వారసత్వంతో తెరకు పరిచయమైనా... స్వయం ప్రతిభతో స్టార్స్‌గా ఎదిగినవారెందరో ఉన్నారు. ఈ ఏడాది ఏకంగా ఎనిమిది మంది వారసులు వెండితెరకు పరిచయం కాబోతున్నారు. బిగ్ స్క్రీన్‌పై తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరిలో ఒకరు మినహా విఎగిలిన వారంతా సినీ నేపథ్యమున్న కుటుంబాల నుంచి వచ్చిన వారే. మరి వీరిని బాలీవుడ్ ప్రేక్షకులు ఏ మాత్రం ఆదరిస్తారో చూడాలి!



షనాయా కపూర్

వారసులొస్తున్నారు

అమన్ దేవ్‌గణ్- రాషా తడాని



బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని, స్టార్ హీరో అజయ్ దేవ్‌గణ్ మేనల్లుడు అమన్ దేవ్‌గణ్ జంటగా 'ఆజాద్' చిత్రం ద్వారా బాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం అభిషేక్ కపూర్ దర్శకత్వంలో తెరకెక్కింది. ఇందులో అజయ్ దేవగణ్ కూడా ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాషా తడానికి ఇప్పటికే సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. పైగా రవీనా కూతురిగా కూడా మంచి ఇమేజ్ సొంతం చేసుకున్నారు. దీంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది.

ఇబ్రహీం అలీఖాన్



సైఫ్ అలీఖాన్, మొదటి భార్య అమృతాసింగ్ కుమారుడు ఇబ్రహీం అలీఖాన్ 'సర్‌జమీన్' చిత్రం ద్వారా వెండి తెరకు పరిచయమవుతున్నాడు. కయోజ్ ఇరానీ దర్శకత్వంలో కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. ఇదొక ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రం. హీరో పాత్రకు ఇబ్రహీం అలీఖాన్ పర్ఫెక్ట్ చాయిస్ అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కరణ్ జోహార్ చెప్పుకొచ్చారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అన్ని భాషల్లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

షనాయా కపూర్

ప్రముఖ నటుడు సంజయ్ కపూర్, మహీప్ కపూర్‌ల ముద్దుల కుమార్తె షనాయా కపూర్. కపూర్ ఫ్యామిలీ నుంచి ఇప్పటి తరానికి చెందిన అర్జున్ కపూర్, జాన్వీ కపూర్ సినిమాల్లో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలోనే షనాయా కపూర్ కూడా గ్లామర్ ఫీల్డ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ధర్మ ప్రొడక్షన్స్ బేనర్‌పై కరణ్ జోహార్ 'బేధడక్' అనే చిత్రాన్ని షనాయా కపూర్ హీరోయిన్‌గా 2022లోనే అనౌన్స్ చేశారు. కానీ ఏవో తెలియని కారణాలతో ఈ చిత్ర నిర్మాణం పట్టాలెక్కలేదు. దీంతో షనాయా విక్రాంత్ మాస్సే సరసన 'అంఖోన్ కి గుస్తాకియాన్' అనే చిత్రంలో నటిస్తున్నారు.

అహాన్ పాండే



బాలీవుడ్ నటి అనన్య పాండే కజిన్ బ్రదర్, చుంకీ పాండే మేనల్లుడు 'అహాన్ పాండే' యశ్ రాజ్ ఫిల్మ్స్ బేనర్‌పై మోహిత్ సూరీ దర్శకత్వం వహించనున్న చిత్రం ద్వారా పరిచయం అవుతున్నారు. ఇందుకోసం యశ్‌రాజ్ ఫిల్మ్స్ అధినేత ఆదిత్య చోప్రా గత ఐదేళ్లుగా తన స్వీయ పర్యవేక్షణలో అహాన్‌కు ప్రత్యేక శిక్షణను ఇప్పిస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ సినిమా రానుంది.

అమన్ ఇంద్ర కుమార్




బాలీవుడ్ దర్శకనిర్మాత ఇంద్ర కుమార్ కుమారుడు అమన్ ఇంద్ర కుమార్ 'తేరా యార్ హూ మై' చిత్రంలో నటిస్తున్నారు. మిలాప్ జవేరీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం షూటింగ్ దాదాపు చివరి దశకు చేరుకుంది. ఆకాంక్ష శర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఐశ్వరీ థాకరే



శివసేన వ్యవస్థాపకులు బాల్ థాకరే మనవడు ఐశ్వరీ థాకరే. సాధారణంగా సెలబ్రిటీల సంతానం వారి తల్లిదండ్రులు రాణిస్తున్న రంగాల్లోనే ఎక్కువగా ఆసక్తి చూపుతుంటారు. కానీ అందుకు భిన్నంగా ఐశ్వరీ రాజకీయాలను కాదని గ్లామర్ ఫీల్డ్ బాట పట్టారు. అందుకోసం ఫిల్మ్ మేకింగ్‌లో ఐదేళ్ల శిక్షణ కూడా తీసుకున్నారు. బాలీవుడ్‌లోని ఓ బిగ్ బేనర్ ద్వారా ఐశ్వరీ థాకరే ఎంట్రీ ఇవ్వనున్నట్లు బాలీవుడ్ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కావల్సి ఉంది.

వీర్ పహారియా




జాన్వీ కపూర్ స్నేహితుడు శిఖర్ పహారియా సోదరుడు వీర్ పహారియా 'స్కై ఫోర్స్' అనే యాక్షన్ థ్రిల్లర్ చిత్రంతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అభిషేక్ కపూర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇంతకుముందు వరుణ్ ధావన్ నటించిన 'భేదియ' చిత్రానికి వీర్ పహారియా సహాయ దర్శకుడిగా పనిచేశారు.

కనుబొమ్మలు ఒత్తుగా పెరగాలంటే...

కనుబొమ్మలు ఒత్తుగా ఉంటేనే ముఖం కళగా కనిపిస్తుంది. కొంతమందికి కనుబొమ్మల్లోని వెంట్రుకలు రాలిపోతూ ఉంటాయి. చాలా కాలం వరకూ అవి పెరగకపోవడంవల్ల కనుబొమ్మలు పలుచగా మారతాయి. అలాకాకుండా కనుబొమ్మలు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం!

- ఒక గిన్నెలో రెండు చెంచాల ఆముదం వేసి వేడిచేయాలి. దీనిని చూపుడు వేలితో కొద్దిగా తీసుకుని కనుబొమ్మల మీద రాసి ఒకే దిశలో అయిదు నిమిషాలపాటు మర్దన చేయాలి. ఇలా రోజుకు రెండుసార్లు చేస్తూ ఉంటే కనుబొమ్మలు రాలడం తగ్గుతుంది.
- రాత్రిపూట రెండు చెంచాల మెంతులను మంచినీటిలో నానబెట్టాలి. ఉదయాన్నే వీటిని మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని కనుబొమ్మలకు పట్టించాలి. పావుగంట తరవాత శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తూ ఉంటే కనుబొమ్మలు బాగా పెరుగుతాయి.
- కలబంద ఆకు లోపలి గుజ్జును తీసుకుని కనుబొమ్మలపై మెల్లగా



రుద్దాలి. పది నిమిషాలు ఆరనిచ్చి గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుంది.
- ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు కొబ్బరి నూనె, బాదం నూనె, ఆలివ్ నూనె, మందారం నూనెల్లో ఒకదాన్ని రాస్తూ ఉంటే ఎ, ఇ విటమిన్లు అంది కనుబొమ్మలు చక్కగా పెరుగుతాయి. ఇ విటమిన్ నూనె కూడా రాయవచ్చు.
- పాలలో దూదిని ముంచి దానితో కనుబొమ్మల మీద అద్దాలి. గంటసేపు ఆరిన తరవాత మంచి నీటితో శుభ్రం చేసుకోవాలి. పాలు కండిషనర్‌లా పనిచేసి కనుబొమ్మలకు పోషణ అందిస్తాయి. కొబ్బరి పాలు కూడా ఉపయోగించుకోవచ్చు.
- కనుబొమ్మలు అందమైన ఆకృతిలో కనిపించాలని చాలామంది థ్రెడింగ్ చేయించుకుంటూ ఉంటారు. మరీ పలుచగా, సన్నగా కాకుండా ఒత్తుగా కనిపించే విధంగా షేపింగ్ చేయించుకోవాలి. కనుబొమ్మల చుట్టూ అదనంగా ఉన్న వెంట్రుకలను మాత్రమే తీయించాలి. అప్పుడే కనుబొమ్మలు వేగంగా పెరుగుతాయి.





అసైన్డ్ భూముల అక్రమాలపై సర్కారు సీరియస్

» సిరిసిల్ల జిల్లాలో 500 ఎకరాల దాకా అక్రమ పట్టాలు

సిరిసిల్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవ్వడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. సాగుభూములు లేని పేద రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములు పెద్దల పంచనకు చేరాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల జిల్లాలో జరిగిన భూ భాగోతాలపై కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆరాతీయడం కలకలం రేపుతోంది. జిల్లాలో దాదాపు 300 నుంచి 500 ఎకరాల అసైన్డ్ భూములను అక్రమంగా పట్టాలు చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని పెద్దూర్, సర్దాపూర్, తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె, అంకుసాపూర్, తాడూర్, లక్ష్మీపూర్, పాపయ్యపల్లె, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామాల్లో 250 ఎకరాల వరకు అసైన్డ్ భూములపై గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా పట్టాలు పొందినట్లు గుర్తించారు. ఈ భూముల విలువ దాదాపు రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని భావిస్తున్నారు. అసైన్డ్ భూముల అక్రమాలపై అధికారులు దృష్టి సారించడంతోపాటు ఇప్పటికే పలువురు బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేశారు. ఇప్పటికే తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ బీఆర్‌ఎస్ మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ తన అధీనంలో ఉన్న రెండెకరాల భూమిని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వాపసు చేశారు. కాగా, గతంలో అతి తక్కువ ధరకు అసైన్డ్ భూములను పేదల నుంచి నయానా, భయానా బీఆర్‌ఎస్ నాయకులు పొందారనే ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతోనే భూములు కోల్పోయిన పేదలు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్రమాలపై విచారణ మొదలైంది.

ఒక్కొక్కరి సంగతి చూసుకుందాం: కేటీఆర్

సిరిసిల్లలో ఎవరెవరో భూ కబ్జాలయ్యాయని రాస్తున్నారని, మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని, ఒక్కొక్కరి సంగతి మళ్లీ చూసుకుందామని బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఉద్దేశించి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం సిరిసిల్ల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసులైతే ఒకటో రెండో కేసులు అవుతాయని, అంతకంటే ఏం చేయగలరని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో అక్రమ పట్టాలు, అన్యాక్రాంతమైన భూములపై సీనియర్ ఐఏఎస్ అధికారితో విచారణ చేపట్టాలని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండలంలో అక్రమ పట్టాలు పొందిన భూములను ఆయన పరిశీలించారు. అక్రమ ప ట్టాలు పొందిన బీఆర్‌ఎస్ నేతలు, రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి పీసీసీ చీఫ్ జిల్లాల పర్యటన

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోసం కార్యకర్తలను సమాయత్తం చేయడంతో పాటు ప్రచార కార్యక్రమాలకు టీపీసీసీ ఆదివారం శ్రీకారం చుడుతోంది. అలాగే ప్రజాపాలన మొదటి వార్షికోత్సవాలను ఆయా స్థాయుల్లో నిర్వహించనుంది. ఆదివారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నుంచి జిల్లాల పర్యటనను టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రారంభించనున్నారు. ఈనెల 6న ఆదిలాబాద్, 7న నిజామాబాద్ జిల్లాల్లో ఆయన పర్యటించనున్నట్లు పీసీసీ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత రావు చెప్పారు. గాంధీభవన్‌లో టీపీసీసీ చేనేత విభాగం చైర్మన్ శ్రీనివాస్‌తో కలిసి వీహెచ్ మీడియాతో మాట్లాడారు. కాగా, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు 'ప్రజావాణి' కార్యక్రమంపై బురద జల్లడం మానుకోవాలని, తన గౌరవాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి హితవు పలికారు. సచివాలయ మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు 92 సదస్సులు నిర్వహించి, 92,115 అర్జీలను స్వీకరించామని, అందులో 63 శాతం సమస్యలను పరిష్కరించామని చెప్పారు.

గుండె దడకు చెక్

» నిమ్స్‌లో రేడియోఫ్రీక్వెన్సీ క్యాథటర్ అబ్లేషన్

» 2024లో 109 మందికి చికిత్స

» రోగుల్లో 50 ఏళ్లలోపు వారే ఎక్కువ

» కార్డియాలజిస్టు డాక్టర్ సాయి సతీష్



రేడియోఫ్రీక్వెన్సీ క్యాథటర్ అబ్లేషన్ చికిత్స గురించి వివరిస్తున్న డాక్టర్ సాయి సతీష్

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుండె దడ.. ఇది పన్నెండేళ్ల పిల్లల నుంచి వృద్ధుల వరకు ఏ వయస్సు వారైనా ఎదుర్కొనే సమస్య! నిమిషానికి 60 నుంచి 70 సార్లు కొట్టుకోవాల్సిన గుండె 150 నుంచి 200 సార్లు కొట్టుకుంటుంది. కొన్నిసార్లు ప్రాణాపాయ స్థితి ఏర్పడవచ్చు. ఇలాంటి రోగులకు వెంటనే 'రేడియోఫ్రీక్వెన్సీ క్యాథటర్ అబ్లేషన్' చికిత్స అవసరం. ఇది గుండె దడకు శాశ్వత పరిష్కారం అందిస్తుందని నిమ్స్ వైద్యులు తెలిపారు. నిమ్స్‌లో గత ఏడాది రికార్డు స్థాయిలో 109 మందికి ఈ చికిత్స అందించామని కార్డియాలజిస్టు డాక్టర్ ఓరుగంటి సాయి సతీష్ తెలిపారు. శనివారం ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఇతర హృద్రోగ వైద్య నిపుణులతో కలిసి ఆయన మాట్లాడారు. గత ఇరవై ఏళ్లలో 1,100 నుంచి 1,200 మందికిపైగా బాధితులకు చికిత్స అందించి ఆరోగ్యవంతులను చేశామని తెలిపారు. వీరిలో 12 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వారి వరకు ఉన్నారని, 50 ఏళ్లలోపు వారే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. గుండె దడకు చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. 'సాధారణంగా గుండె నిమిషానికి 60 నుంచి 70 సార్లు కొట్టుకుంటుంది. కానీ ఇది అకస్మాత్తుగా 150 వరకు, ఒక్కోసారి 200 కూడా మించిపోతుంది. గుండెలో రెండు రకాల సర్క్యూట్లు ఉంటాయి. కొందరిలో సింగిల్ పాత్‌వే ఉండగా, మరి కొందరిలో అదనపు పాత్‌వే ఉంటుంది. రెండు పాత్‌వేల నుంచి వేగంగా విద్యుత్ సరఫరా అయినప్పుడు గుండె స్పందనలు పెరుగుతాయి. కొందరికి పుట్టుకతోనే ఈ సమస్య ఉంటుంది. దీన్ని 'వోల్ఫ్‌పార్కిన్‌సన్ వైట్ సిండ్రోమ్'గా వ్యవహరిస్తారని తెలిపారు. దీని వల్ల ఛాతీలో నొప్పి, ఆయాసం, కళ్లు తిరగడం వంటి ఇబ్బందులు ఏర్పడతాయని ఆయన చెప్పారు.

చికిత్స ఇలా..

గుండె దడకు నిమ్స్‌లో అధునాతన వైద్య పరికరాల సాయంతో చికిత్సను అందిస్తామని డాక్టర్ సాయి సతీష్ తెలిపారు. 'ఈ చికిత్స కోసం 3 రోజుల పాటు ఆస్పత్రిలో ఉండాల్సి వస్తుంది. గుండె దడతో ముప్పు ఉన్న బాధితులకు 3డీ మ్యాపింగ్‌తో, కాస్త తక్కువ దడ ఉన్న వారికి 2డీ మ్యాపింగ్‌తో చికిత్స అందిస్తాం. ఎలక్ట్రిక్ సర్క్యూట్ ద్వారా గుండె దడ పెరుగుతుంది. ఇది ఎక్కడి నుంచి ఎలా వస్తోంది, కారణాలను నిర్ధారిస్తాం. దానివల్ల ఎంత ముప్పు ఉందో అంచనా వేసి చికిత్స అందిస్తాం. గుండె దడ ఉన్న వారు ఎక్కువ కాలం మందులు వాడినా ముప్పు పొంచి ఉంటుంది. వారికి రేడియోఫ్రీక్వెన్సీ క్యాథటర్ అబ్లేషన్ ఒక్కటే మార్గం. ఈ చికిత్స తర్వాత రోగి మందులు వాడాల్సిన అవసరం ఉండదని ఆయన వివరించారు. ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి, ఆర్బీసీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్, సీజీహెచ్‌సీ హెల్త్ కార్డులు ఉన్న వారికి ఉచితంగా రేడియోఫ్రీక్వెన్సీ క్యాథటర్ అబ్లేషన్ చికిత్స అందిస్తున్నామని తెలిపారు.

ఏపీ మంత్రిగారి మంత్రాంగం!

వారంలో మూడురోజులు హైదరాబాద్‌లోనే... సారు దందాలు.. సరదాలు వేరే లెవల్

» తెలంగాణ భూవ్యవహారాల్లోనూ జోక్యం

» మంత్రి తీరుపై తెలంగాణ సర్కారు నిఘా

» మరీ శ్రుతి మించిపోతున్నారంటూ సీఎం బాబుకు సమాచారం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆయన తొలిసారి మంత్రి.. బాగా కీలకమైన మంత్రి. ఈ పదవిని ఆయనకు కట్టబెట్టినప్పుడే పొరుగురాష్ట్రం తెలంగాణతోపాటు, ఏపీలోను చర్చోపచర్చలు సాగాయి. "ఈయనకు ఆ పోర్టుఫోలియో(శాఖ) ఇచ్చారా? చంద్రబాబుకు అన్నీ తెలిసే నిర్ణయం తీసుకున్నారా? ఆయన ఇక్కడ ఏం పనులు చేస్తారో తెలిసే ఆయన్ను క్యాబినెట్‌లోకి తీసుకున్నారా?" అని తెలంగాణలోని ప్రభుత్వ పెద్దలు, రాజకీయవర్గాల్లో చర్చలు జరిగాయి. ఆ తర్వాత ఇవే చర్చలు చంద్రబాబుకు చేరాయి. కానీ, అప్పటికే ఆయనకు పదవి ఇచ్చేయడంతో చంద్రబాబు ఏమీ చేయలేని పరిస్థితి. ఫిర్యాదులున్నాయి.. పనితీరులో మంచి ఫలితాలతో ముందడుగు వేయాలని బాబు సూచన చేసినట్లు తెలిసింది. అధినేత సూచనను ఆ చెవితో విని, ఈ చెవితో వదిలేసినట్లుంది ఆ 'డార్లింగ్ మంత్రి'. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వారంలో రెండు రోజులు నియోజకవర్గం.. రెండు రోజులు అమరావతి, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో మకాం.. ఇదీ సదరు మంత్రి షెడ్యూల్. శుక్రవారం నుంచే ఆ మంత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టార్ హోటల్‌లో దిగిపోతారు. మంత్రికి ఆల్ ఇన్‌వన్‌గా ఒకరున్నారు. ఆయన షాడో మంత్రిగా వ్యవహరిస్తున్నారు. వ్యవహారాలన్నీ ఆయనే చక్కదిద్దుతారు. శుక్రవారం వచ్చిందంటే చాలు మంత్రి, ఆయన ఆల్ ఇన్‌వన్, మరో ఇద్దరు కలిసి హైదరాబాద్‌లో తేలుతారు. స్టార్ హోటల్‌లో నాలుగు రూమ్‌లు బుక్ చేస్తారు. ఏపీలో ఆ మంత్రితో పనులున్నవారు, కీలక వ్యవహారాలు చక్కబెట్టుకోవాల్సినవారు ఆ హోటల్‌లో బారులు తీరతారు. ఇప్పుడిప్పుడు తెలంగాణలోని భూ వ్యవహారాల్లోనూ వేలు పెడుతున్నట్టు చెబుతున్నారు. ఒక రోజంతా ఒక రూమ్‌లో పంచాయితీలు, పరిష్కారాలు, సెటిల్‌మెంట్లు. ఇవన్నీ మంత్రి ఆల్ ఇన్‌వన్ చూస్తుంటారు. మరో రూమ్‌లో మంత్రి దర్జాగా విలాసాన్ని ప్రదర్శిస్తుంటారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు అంతా ఇన్విజిబుల్. గానాభజానా.. కళా ప్రదర్శనలతో హోరెత్తిస్తుంటారు.

తొలినుంచీ కళా పోషకుడే..

నిజానికి మంత్రి కాకముందే, ఓ సాధారణ ఎమ్మెల్యేగా ఉన్నసమయంలో ఇదే జోరుండేది. మంత్రి అయ్యాక ఆ జోరు మరింత పెరిగింది. హైదరాబాద్‌లో ఆ మంత్రికి రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపార సంబంధాలున్నాయి. అదే సమయంలో ఏపీలోనూ పలు వ్యాపారాలున్నాయి. ఆయన హైదరాబాద్‌లో కాలుపెట్టారంటే బ్యాచ్‌కు పండగే. ఇది రానురాను ఓ పెద్ద అంశంగా మారిపోయింది. గత ఆరు నెలలుగా ఆ మంత్రి, ఆయన ఆల్ ఇన్‌వన్ ఎక్కడా తగ్గకుండా వీకెండ్ జోరుతోపాటు హైదరాబాద్ కేంద్రంగా వ్యవహారాలు అనేకం చక్కబెడుతున్న సమాచారం తెలంగాణ ప్రభుత్వ పెద్దలకు పక్కా ఆధారాలతో సహా చేరింది. దీంతో పూర్తిస్థాయి నిఘా పెట్టారు. అప్పుడే విస్మయం గొలిపే అంశాలు వారి దృష్టికి వెళ్లాయి. ఇక లాభం లేదనుకొని ఇటీవల సీఎం చంద్రబాబుకు తెలంగాణ ప్రభుత్వం ఓ లిఖితపూర్వక సమాచారం అందించింది. దాంతోపాటు మౌఖిక సూచనలతో ఒక కాల్ వచ్చినట్లు తెలిసింది. ఆ మంత్రి సాధారణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏం చేశా రు? మంత్రి అయ్యాక ఏం చేస్తున్నారనేది ఆ నోట్‌లో సవివరంగా పేర్కొన్నట్లు తెలిసింది. "మీ మంత్రిని జర చూసుకోండి. ఆయన ఇక్కడ చేస్తున్న పనులేవీ బాగోలేవు. తెలంగాణ భూముల వ్యవహారాల్లో వేలు పెడుతున్నారు. సెటిల్‌మెంట్లకు కౌంటర్ తెరిచారు. మీరు కంట్రోల్‌లో పెట్టుకోండి. అ పనులేవో అక్కడే (ఏపీలో) చేసుకోమనండి" అని సూటిగా చంద్రబాబుకు సూచన చేసినట్లు తెలిసింది. ఆ తర్వాత ఆ మంత్రి లీలలు, పనితీరుపై చంద్రబాబు పూర్తి నివేదిక తెప్పించుకున్నారని తెలిసింది. ఈ సందర్భంగా ఆ మంత్రి పేషీలో ఆల్‌ఇన్‌వన్ చేస్తున్న పనులు వెలుగుచూశాయి. మంత్రికి సన్నిహితుడు, వ్యాపార భాగస్వామిగా ఉన్న వ్యక్తే ఆ శాఖకు ఆల్ ఇన్‌వన్‌గా వ్యవహరిస్తున్నారని బయటకొచ్చింది.

విజయవాడలోనూ అదే జోరు..

విజయవాడ గురునానక్ ఏరియాలో మంత్రికి ప్రైవేటు నివాసం ఉంది. దానికి కూతవేటు దూరంలో ఓ స్టార్ హోటల్ ఉంది. ఇక అక్కడ మంత్రి పరివారం చేసే కార్యక్రమాలు వేరే లెవల్ అని ప్రభుత్వం గుర్తించింది. అటు తెలంగాణ ప్రభుత్వం, ఇటు ఏపీ ప్రభుత్వ సొంత నివేదికలు ఆ డార్లింగ్ మంత్రిని పక్కాగా బుక్‌చేశాయి. మరి ప్రభుత్వాధినేత చంద్రబాబు ఎలా స్పందించనున్నారన్నది సహచర మంత్రులు, అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది.

సాగర్ డ్యాం స్పిల్‌వేను పరిశీలించిన సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ సభ్యులు

» స్టాప్ లాక్ గేట్ల ఏర్పాటుకు కేంద్రానికి నివేదిస్తామని వెల్లడి

నాగార్జునసాగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వేను శనివారం కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ), కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సభ్యులు పరిశీలించారు. ఈ నెల 1వ తేదీన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'సాగర్ స్పిల్‌వేపై మళ్లీ గుంతలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ సభ్యులు శనివారం సాగర్ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు నడక మార్గం పై నుంచి దెబ్బతిన్న స్పిల్‌వేని పరిశీలించి ఫొటోలు తీసుకున్నారు. ఈ విషయంపై కేంద్ర జలశక్తి శాఖకు నివేదికలు అందజేస్తామని సీడబ్ల్యూసీ సభ్యులు తెలిపారు. అనంతరం ప్రధాన జల విద్యుత్ కేంద్రాన్ని, గ్యాలరీలను, క్రస్ట్ గేట్లను పరిశీలించారు. ప్రధాన జల విద్యుత్ కేం ద్రంలో మరమ్మతులు చేస్తున్న రెండో నంబరు టర్బైన్‌నూ పరిశీలించారు. అనంతరం విజయవిహార్ అతిథి గృహంలో సీడబ్ల్యూసీ సీనియర్ జాయింట్ కమిషనర్ విలేకరులతో మాట్లాడారు. సాగర్ ప్రాజెక్టును పరిశీలించి పటిష్టతకు చేపట్టాల్సిన పనుల గురించి, అలాగే ఏపీ, తెలంగాణ మధ్య నెలకొన్న నీటి వివాదాల గురించీ తెలుసుకున్నట్లు చెప్పారు. సాగర్ ప్రాజెక్టు బలోపేతానికి గతంలో రూ.160 కోట్లు కావాలని నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఈ నిధుల మంజూరు, స్పిల్‌వే మరమ్మతులు, డ్యాంకు స్టాప్ లాక్ గేట్లు అమర్చడంపై నివేదికలు తయారుచేసి కేంద్ర జలశక్తి శాఖ ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కాగా, సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం పటిష్ఠంగానే ఉందని సాగర్ జలవిద్యుత్ కేంద్రం సీఈ మంగేష్‌కుమార్ తెలిపారు. ఇటీవల శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో జీరో ఫ్లోర్‌లోని ఒకటో యూనిట్‌లో డ్రాఫ్ట్ ట్యూబ్ నుంచి నీరు లీకవుతున్న నేపథ్యంలో శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. టర్బైన్లు నిరంతరాయంగా తిరగడం వల్లే శ్రీశైలంలో జీరో ఫ్లోర్‌లో నీటి లీకేజీలు కనిపించాయని, కానీ సాగర్ ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో ఉన్న ఎనిమిది టర్బైన్లలో ఆ సమస్య లేదని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965




ఆధ్యాత్మికత ఉట్టిపడేలా...

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ 'బుజ్జి తల్లి'ని విడుదల చేశారు. శనివారం రెండో పాట 'నమో నమః శివాయ'ను విడుదల చేశారు. కళాత్మకత..ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉన్న ఈ శివ శక్తి పాటను జొన్నవిత్తుల రచించగా.. అనురాగ్ కులకర్ణి, హరిప్రియ ఆలపించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. శేఖర్ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చారు. ఫిబ్రవరి 7న సినిమా విడుదల కానుంది. కాగా, నాగచైతన్య, సాయిపల్లవి కలసి నటిస్తున్న రెండో చిత్రమిది. 2021లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'లవ్ స్టోరీ' సినిమాలో మొదటిసారి కలసి నటించారు.

క్యారెక్టర్‌ను నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది

\- హీరో కిరణ్ అబ్బవరం



'స్ట్రాంగ్ మ్యాన్ డోంట్ హ్యావ్ ఆటిట్యూడ్..దే హ్యావ్ క్యారెక్టర్ అని 'దిల్ రూబా'లో సిద్ధు డైలాగ్ చెబుతాడు. క్యారెక్టర్‌ను నమ్ముకున్న ప్రతీ ఒక్కరికీ మా సినిమా నచ్చుతుంది' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. 'క' చిత్రం తరవాత కిరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రూబా'. రుక్సర్ థిల్లాన్ హీరోయిన్. విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సినిమా ఫిబ్రవరిలో విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను చేసిన సిద్ధు, సిద్ధార్థ్ క్యారెక్టర్ చాలా ప్రత్యేకంగా ఉంది. తను నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కట్టుబడి ఉంటాడు. ఆ పాయింట్ నాకు బాగా నచ్చింది' అని అన్నారు. చిత్రదర్శకుడు విశ్వకరణ్ మాట్లాడుతూ 'మనందరి జీవితాల్లో ప్రేమను స్ఫూర్తిగా తీసుకుని ఈ చిత్రాన్ని చేశా' అని అన్నారు. నిర్మాత రవి మాట్లాడుతూ ' కిరణ్ అబ్బవరంను ఇప్పటి వరకు చూడని విధంగా ఈ సినిమాలో చూస్తారు' అని చెప్పారు.

హీరోలు నమస్కారాలు పెట్టాలనుకునేంత

లో లెవల్ వ్యక్తులం కాము

- సినీ పరిశ్రమంటే చంద్రబాబుకు గౌరవం
- 'బ్లాక్' నిరోధానికే టికెట్ల ధరల పెంపు
- నిర్మాతలకే కాదు.. ప్రభుత్వానికీ 18 శాతం జీఎస్టీ రూపంలో ఆదాయం
- 'మెగా' కుటుంబానికి అహంకారం లేదు
- 'గేమ్‌ఛేంజర్' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు



"సినిమా టికెట్ల పెంపుతో హీరోలకు పనేంటి? ప్రభుత్వాల దగ్గరకు హీరోలు ఎందుకు రావాలి? అది మాకు ఇష్టం లేదు. నిర్మాతలు రండి. ఒక ట్రేడ్ బాడీ లేదా యూనియన్‌గా రండి. మేం అనుమతులు ఇస్తాం. అంతేగానీ హీరోలు వచ్చి మాకు నమస్కారాలు పెట్టాలి అని ఆలోచించేంత లో లెవల్ వ్యక్తులం కాదు మేం' అని పవన్ కల్యాణ్ అన్నారు. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'గేమ్‌చేంజర్'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈనెల 10న విడుదలవుతోంది. శనివారం రాజమహేంద్రవరంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టికెట్ల ధరల పెంపుతో కేవలం నిర్మాతలకు మాత్రమే కాకుండా ప్రభుత్వానికి కూడా ఆదాయం వస్తోందని తెలిపారు. ప్రతి టికెట్‌పై ప్రభుత్వానికి 18శాతం జీఎస్టీ రూపంలో ఆదాయం సమకూరుతోందన్నారు. ఇదంతా డిమాండ్, సప్లయ్ ఆధారంగా జరుగుతోందని తెలిపారు. అంతేకాదు.. బ్లాక్ టికెట్ల విక్రయాలను నిరోధించేందుకు కూడా ఇది దోహద పడుతుందన్నారు. గత ప్రభుత్వంలో తన సినిమా 'భీమ్లా నాయక్'కు టికెట్లు పెంచకపోగా తగ్గించేశారని తెలిపారు. సినిమా హీరోలు వచ్చి నమస్కారాలు పెట్టాలని తాము కోరుకోబోమని, గతంలో ఎప్పుడూ ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా చేయాలనుకోలేదన్నారు. కానీ, గత ప్రభుత్వం(వైసీపీ) మాత్రం తాను అభిమానించే చిరంజీవి తోపాటు ప్రభాస్, మహేశ్‌బాబు వంటి హీరోలను రప్పించుకుందని అన్నారు. తాము మాత్రం అలా కోరుకోలేదని చెప్పారు. "ఎక్కువమంది హీరోలు కూటమికి సపోర్టు చేయలేదు. అయినా మేం సినిమా పరిశ్రమకు రాజకీయ రంగు పులమం. మేం నిర్మాతలతో మాట్లాడతాం. వారిని గుర్తిస్తాం. టికెట్ ధరల పెంపు కోసం హీరోలు రావక్కర్లేదు. మేం అల్పస్థాయి వ్యక్తులం కాదు" అని పరోక్షంగా వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్ చిత్ర పరిశ్రమకు చెందిన హీరోలతో వ్యవహరించిన తీరును డిప్యూటీ సీఎం తప్పుబట్టారు. తమకు సినిమా పరిశ్రమ మీద గౌరవం ఉందన్నారు. చంద్రబాబు నాలుగోసారి సీఎంగా ఉన్నారని, ఆయన ఇప్పటి వరకు చిత్ర పరిశ్రమకు మేలు చేశారు తప్ప ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. చిత్ర పరిశ్రమకు రాజకీయ రంగు పులమడం కూడా తమకు ఇష్టం లేదన్నారు. టికెట్ల పెంపు అంశంపై ప్రతిసారీ తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

> "అడగ్గానే టికెట్ల ధరలు ఎందుకు పెంచారని, ఎందుకు పెంచాలని కొందరు అడుగుతుంటారు. సినిమాకు 'డిమాండ్-సప్లయ్' సూత్రం వర్తిస్తుంది. సినిమా విడుదలైన మొదటి రోజే చూడాలనుకోవడం డిమాండ్. ఇవాళ తెలుగు సినిమా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించింది. దానికి తగ్గట్లు సినిమాలు ఉండాలి. సినిమాలు అలా తీయాలంటే డబ్బు కావాలి. అందుకే టికెట్ల ధరలు పెంచాలని కోరతారు"
> \- పవన్ కల్యాణ్

» రాజకీయాలు చేయొద్దు

"సినిమాలు తీసేవాళ్లే మాత్రమే చిత్ర పరిశ్రమ గురించి మాట్లాడాలి. సినిమాలు తీయని వాళ్లు మాట్లాడొద్దు. సినిమాలు తీయకుండా రాజకీయాలు చేసేవాళ్లు మాకు నచ్చరు. ఈ మాట నేను ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం తరఫున చెబుతున్నా. ఎన్టీఆర్ పాటించిన ఔన్నత్యాన్ని మేం పాటిస్తున్నాం" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. సినిమాలు తీసి, దాని సాధకబాధకాలు తెలిసిన వారితోనే తాము మాట్లాడతామని స్పష్టం చేశారు. దర్శకుడు శంకర్ సామాజిక బాధ్యతతో సినిమాలు తీస్తారని పవన్ కల్యాణ్ కొనియాడారు. "ఆయన తీసిన సినిమా 'జంటిల్‌మెన్'కు నేను కూడా బ్లాక్‌లో టికెట్ కొనుక్కొని వెళ్లా. అదో సరదా. ఇలానే చాలామంది అభిమానులు తమకు ఇష్టమైన హీరో సినిమాలకు వెళ్తారు. వారి డబ్బులు 'బ్లాక్'లోకి వెళ్లకుండా నిర్మాతలకు, తద్వారా ప్రభుత్వానికి ఆదాయం రూపంలో వస్తేనే మంచిది" అని వ్యాఖ్యానించారు.

» ఈ సంస్కృతి సరికాదు

నేనైనా, రామ్‌చరణ్ అయినా చిరంజీవి ఇచ్చిన ఊతంతోనే నిలబడగలిగాం. తండ్రి మెగాస్టార్ అయితే కొడుకు గ్లోబల్‌స్టార్ అయ్యాడు. 'గేమ్ చేంజర్' సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నా" అని వ్యాఖ్యానించారు. 'మెగా' కుటుంబంలో ఎవరికీ అహంకారం లేదని, ఎవరి పట్లా వివక్ష చూపదని అన్నారు. "వేరే హీరోలను ద్వేషించే కుటుంబం కాదు మాది. ఒక హీరో సినిమా పోవాలని కూడా కోరుకోం. అందరూ బాగుండాలనే ఆలోచనను మా నాన్న నేర్పారు. సర్వేజనా సుఖినోభవంతు అని చెప్పారు" అన్నారు.

» ఆ ఔన్నత్యం కావాలి!

"మహానుభావుడు ఎన్టీఆర్ నుంచి ఎన్నో నేర్చుకోవాలి. కోట శ్రీనివాస్ వంటి నటులు ఎన్ని విమర్శలు చేసినా, షూటింగ్‌లో కలిసినప్పుడు మాత్రం.. 'ఏం బ్రదర్ ఎలా ఉన్నారని ఎన్టీఆర్ కుశల ప్రశ్నలు వేసేవారు. కృష్ణ కాంగ్రెస్ పార్టీలో ఉన్నా, ఇద్దరూ కలుసుకున్నప్పుడు ఆప్యాయంగా మాట్లాడుకునేవారు. అలా చిత్రపరిశ్రమ ఔనత్యాన్ని పెంచాలి" అని పవన్ కల్యాణ్ హితవు పలికారు.

\- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

అల్లు అర్జున్ బెయిల్ పత్రాల సమర్పణ



హీరో అల్లు అర్జున్ నాంపల్లి కోర్టులో బెయిల్ పత్రాలను సమర్పించారు. 'పుష్ప2' సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో ఏ11గా ఉన్న అర్జున్‌కు నాంపల్లి కోర్టు శుక్రవారం షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. శనివారం ఈ బెయిల్‌కు సంబంధించిన పత్రాలను సమర్పించడానికి మామ చంద్రశేఖర్ రెడ్డితో కలసి అర్జున్ కోర్టుకు హాజరయ్యారు. న్యాయస్థానం రెండు రూ.50 వేల పూచీకత్తులు అడిగిన నేపథ్యంలో ఒకటి అర్జున్ స్వీయ పూచీకత్తు ఇవ్వగా, మరొకటి తన మేనేజర్ పేరిట దాఖలు చేశారు. పత్రాలపై సంతకాలు చేసి మేజిస్ట్రేట్‌కు సమర్పించారు. ఇక, రెండు నెలల పాటు ఈ కేసుకు సంబంధించి పూర్తి ఎఫ్ఐఆర్ దాఖలు చేసే వరకు ప్రతీ ఆదివారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు అర్జున్ హాజరు కావాలి. అలానే కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లడానికి వీలు లేదు.

\- మంగళ్‌హాట్, ఆంధ్రజ్యోతి

'గేమ్ ఛేంజర్'.. 'డాకూ మహారాజ్' టిక్కెట్ల ధర పెంపు



సంక్రాంతికి విడుదలవుతున్న చిత్రాలు 'గేమ్ ఛేంజర్', 'డాకూ మహారాజ్'. ఈ సినిమాల టిక్కెట్ల ధర పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతినిచ్చింది. రామ్‌చరణ్ హీరోగా దర్శకుడు శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన 'గేమ్ ఛేంజర్' ఈ నెల 10న విడుదలవుతోంది. ఆరోజు మొత్తం 6 షోలు ఉంటాయి. మరోవైపు, బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన చిత్రం 'డాకూ మహారాజ్'. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ మేరకు హోమ్‌శాఖ ముఖ్య కార్యదర్శి శనివారం ఉత్తర్వులు జారీచేశారు.



సినిమా	బెనిఫిట్ షో	అదనపు షోలు	పెరిగిన టిక్కెట్ ధరలు	ఎన్ని రోజులు
గేమ్ ఛేంజర్	(సమయం.. టిక్కెట్ ధర) అర్ధరాత్రి ఒంటి గంటకు. రూ.600	ఒకటి(రోజుకు)	సింగిల్ స్క్రీన్స్ రూ.135 మల్టీప్లెక్స్ రూ.175	జనవరి 11 - 23 వరకు
డాకూ మహారాజ్	ఉదయం నాలుగు గంటలకు.. రూ.500	ఒకటి(రోజుకు)	సింగిల్ స్క్రీన్స్ రూ.110 మల్టీప్లెక్స్ రూ.135	జనవరి 12 - 25 వరకు

న్యాయ నిపుణులతో చర్చించాకే..
కేసీఆర్‌పై చర్యలు!

- లోకూర్ నివేదికను ఏజీకు పంపాలని క్యాబినెట్ నిర్ణయం
- విద్యుత్తు నివేదికపై మంత్రివర్గంలో చర్చ



హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఒప్పందాలు, ప్లాంట్ల నిర్మాణంలో తప్పిదాలపై విచారణ జరిపిన జస్టిస్ మదన్ బి.లోకూర్ కమిషన్ నివేదికను అడ్వకేట్ జనరల్(ఏజీ)కి పంపించి, న్యాయనిపుణుల సలహా మేరకు మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలకు ఉపక్రమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నివేదికపై చర్చించారు. అంతకు ముందు జరిగిన మంత్రివర్గంలోనూ దీనిపై చర్చ జరగ్గా.. తాజాగా మరోమారు లోతుగా పరిశీలన జరిపారు. మంత్రివర్గ సమావేశం ప్రారంభం కాగానే.. మంత్రివర్గ సహచరుల ముందు సీఎం ఈ నివేదికను పెట్టారు. దీనిపై లోతుగా చర్చించిన ప్రభుత్వం.. న్యాయ నిపుణుల పరిశీలనకు పంపించి, తదుపరి చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. ఆయా నిర్మాణాల్లో కీలకపాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు.. ఇతర పాత్రధారులపై చర్యలు తీసుకోవాల్సిందేనని అభిప్రాయపడింది. వాస్తవానికి విద్యుత్తు నిర్ణయాలపై విచారణ కమిషన్ వేయాలనే నిర్ణయం శాసనసభలో తీసుకున్నందున.. నివేదికను అసెంబ్లీలో పెట్టాలా..? లేక కేసుకు సిద్ధమవ్వాలా? అన్న దానిపై చర్చ జరిగినట్లు సమాచారం. విద్యుత్తు కొనుగోళ్లు, పవర్ ప్లాంట్ల నిర్మాణంలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో రానున్న 25 ఏళ్లపాటు తెలంగాణ సమాజం మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రివర్గం చర్చించింది. కాలంచెల్లిన టెక్నాలజీతో కట్టిన భద్రాద్రి పవర్ ప్లాంట్‌తో రానున్న 25 ఏళ్లకాలంలో రూ.9 వేల కోట్ల దాకా భారం ప్రజలపై పడనుందని చర్చలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం వల్ల రూ.3,642కోట్ల నష్టం జరిగిందని, అప్పట్లో పోటీ బిడ్డింగ్‌కు వెళ్లడం వల్ల కేరళకు యూనిట్ కరెంట్ రూ.3.60కే లభించిందని, వెయ్యి మెగావాట్ల కరెంట్‌ను తీసుకోవడానికి ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం చేసుకున్నప్పటికీ.. ఆ మేరకు కరెంట్ ఇవ్వకపోవడంతో ఆ స్థానంలో బహిరంగ విపణిలో కొన్న విద్యుత్తు వల్ల రూ.2వేల కోట్ల అదనపు భారం పడిందని మంత్రివర్గం ఆక్షేపించింది.

వడ్డీలు.. పెనాల్టీలు

కరెంట్ కొనుగోళ్లు జరిగినా.. ఛత్తీస్‌గఢ్‌కు సకాలంలో చెల్లింపులు చేయని కారణంగా వడ్డీలు/పెనాల్టీల రూపంలో లేట్‌పేమెంట్ కింద రూ.750 కోట్ల మేర చెల్లింపులు చేస్తున్నారని, ఇక వెయ్యి మెగావాట్ల కోసం పీజీసీఐఎల్(పవర్ గ్రిడ్)తో కారిడార్ బుక్ చేసుకున్నప్పటికీ.. కరెంట్‌ను ఆ మేరకు తరలించకపోవడం వల్ల రూ.635 కోట్లు చార్జీలను కలుపుకొని ఛత్తీస్‌గఢ్ కరెంట్‌తో రూ.3385 కోట్ల మేర భారం పడిందని కమిషన్ ఇచ్చిన నివేదికపైనా మంత్రివర్గం చర్చించినట్లు సమాచారం. మరో వెయ్యి మెగావాట్ల కారిడార్‌ను రద్దు చేసుకున్నందుకు నష్టపరిహారం కింద రూ.261 కోట్లు చెల్లించాలని పవర్‌గ్రిడ్ నోటీసు ఇవ్వడం(ఈ కేసు అప్పీలేట్ ట్రిబ్యునల్‌లో ఉంది) పైనా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గోదావరి ఒడ్డున బొగ్గు నిల్వలున్నాయని, బొగ్గు గని ఉపరితల భాగం(పిట్‌హెడ్)లోనే ప్లాంట్‌లు కట్టాలని, దీనివల్ల విద్యుదుత్పత్తి ధర తగ్గుతుందని కేంద్ర విద్యుత్తు అథారిటీ(సీఈఏ) పలు దఫాలుగా గుర్తుచేసిందని, బొగ్గు గనులకు సగటున 280 కిలోమీటర్లదూరంలో(ఇల్లెందు 179 కిలోమీటర్లు, ఇతర గనులు 360 కిలోమీటర్లు) దూరంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టారని, దీనికి ఏటా బొగ్గు రవాణా చేయడానికి అయ్యే భారం రూ.1600 కోట్లుగా ఉంటుందని కమిషన్ తేల్చిన అంశంపైనా చర్చ జరిగినట్లు తెలిసింది.

రైతు భరోసా 12 వేలు



మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు భట్టి, దామోదర, తుమ్మల

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా' రైతు భరోసా' ఒకటి. దీనిపై ఎవరికి వారే ఊహించుకుని రకరకాల సమాచారంతో రైతుల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. ఆ గందరగోళాన్ని దూరం చేస్తూ రైతులకు ఒక శుభవార్త వినిపించాలని నిర్ణయించాం. 'రైతు భరోసా' పథకం కింద వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ పెట్టుబడి సాయం అందజేస్తాం. గత ప్రభుత్వం రైతుబంధు కింద ఏటా రూ.10 వేలు ఇస్తే.. మా ప్రభుత్వ ప్రజా పాలనలో ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించింది" అని సీఎం రేవంత్ వివరించారు.

భూమి లేనివారికి ఏడాదికి రూ.12 వేలు

తండాలు, గూడేలు, మారుమూల పల్లెల్లో ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుని జీవించే భూమి లేని కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున సాయం చేయాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ పథకానికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'గా నామకరణం చేసినట్లు చెప్పారు. రేషన్ కార్డులు లేనివారందరికీ నూతన కార్డులు ఇవ్వాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకాలన్నీ ఈ నెల 26 నుంచి ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

అలాంటి భూములకు రైతుభరోసా ఇవ్వం

వ్యవసాయ యోగ్యంకాని భూములకు రైతు భరోసా ఇవ్వబోమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. "రాళ్లు, రప్పలు, గుట్టలు ఉన్న భూములు, రోడ్లు, మైనింగ్ కింద పోయిన భూములకు, నాలా కన్వర్షన్ కింద రియల్ ఎస్టేట్‌గా మారిన భూములకు, పరిశ్రమలకు తీసుకున్న భూములకు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములకు రైతు భరోసాను వర్తింపజేయం. ఇందులో ఎలాంటి గందరగోళ ఉండాల్సిన పనిలేదు. దీనికి సంబంధించి మా రెవెన్యూ అధికారులు గ్రామాలవారీగా సమాచారాన్ని సేకరించి, గ్రామసభల ద్వారా ప్రజలకు వివరిస్తారు. పరిశ్రమలుగా, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిన, ప్రభుత్వం సేకరించిన భూములకు ఇకపై రైతు భరోసా ఇవ్వడం జరగదు. గతంలో ధరణి లోపాల వల్ల ఇలాంటి కొన్ని భూములకు కూడా రైతుబంధు సొమ్ము అందింది. ఇలాంటి భూముల విషయంలో ప్రజలే స్వచ్ఛందంగా ముందుకొచ్చి ప్రభుత్వానికి ఆ వివరాలు అందించడం ద్వారా సహకరించాలని కోరుతున్నాను. ఇప్పటి ఆర్థిక పరిస్థితులు, వెసులుబాటును దృష్టిలో పెట్టుకుని గతంలో రైతుబంధు కింద ఇచ్చిన రూ.10 వేల నుంచి మా రైతు భరోసా కింద రూ.12 వేలకు పెంచాం. అదే విధంగా భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు కూడా రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడం, పేదలకు పంచడం అనే భావనతో.. ఎంత వెసులుబాటు ఉంటే అంత వెసులుబాటుతో రైతులకు మేలు చేయాలన్నదే మా ఆలోచన. ఈ పథకాలను జనవరి 26 నుంచి అమలు చేయాల్సి ఉన్నందున.. ప్రస్తుతం అధికారుల వద్ద ఉన్న సమాచారం మేరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. గతంలో ఏం జరిగిందో వెనక్కి వెళ్లి చూస్తే.. కేసీఆర్ కుటుంబం వెయ్యి సంవత్సరాల జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుంది. వాటికంటే భవిష్యత్తులో నిజమైన రైతులకు మేలు చేయాలన్నదే మా ప్రభుత్వ విధానం. వ్యవసాయ యోగ్యమైన ప్రతిఎకరాకు రైతుభరోసా వస్తుంది"అని అన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి'కి జైపాల్‌రెడ్డి పేరు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మాజీ కేంద్ర మంత్రి, దివంగత నేత సూదిని జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అంతేకాకుండా జూరాల నుంచి కృష్ణా జలాలను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తరలించడానికి వీలుగా కొత్తగా మరింత ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఉన్న మార్గాలు, ప్రత్యామ్నాయాలను పరిశీలించేందుకు సాంకేతిక నిపుణుల కమిటీని నియమించాలని నిర్ణయం తీసుకుంది. ఎక్కడ నీటి లభ్యత ఉంది, ఎక్కడి నుంచి ఎంత నీటిని తీసుకునే వీలుంది, ఎక్కడెక్కడ రిజర్వాయర్లు నిర్మించాలి.. అనే విషయాలతోపాటు ఇప్పుడున్న ప్రాజెక్టులకు మరింత నీటిని తీసుకునే సాధ్యాసాధ్యాలపై కమిటీ అధ్యయనం చేస్తుంది. ఇక సంగారెడ్డి జిల్లాలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు కాలువకు మాజీ మంత్రి సిలారపు రాజనర్సింహ పేరు పెట్టాలనే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గోదావరి ఉపనది అయిన మంజీరాపై 30 టీఎంసీల సామర్థ్యంతో 1979లో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టగా.. 1989లో నిర్మాణం పూర్తయింది.

కారుణ్య నియామకాలకు మోక్షం..

పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర క్యాబినెట్ శనివారం ఆమోదం తెలిపింది. మొత్తం 588 కారుణ్య నియామకాలకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ శాఖలో పనిచేస్తూ అనారోగ్యం, ఇతర కారణాలతో 588 మంది సిబ్బంది మరణించగా.. వారి కుటుంబ సభ్యులకు ఆ ఉద్యోగాలు కల్పించేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందుకు మంత్రి సీతక్క ఎంతో కృషి చేశారంటూ కారుణ్య నియామకం పొందే అభ్యర్థులు ఆమెకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక ములుగు జిల్లా కేంద్రాన్ని మునిసి పాలిటీగా మారుస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీగా ఉన్న ములుగును మునిసిపాలిటీగా మారుస్తూ 2022లోనే అసెంబ్లీ తీర్మానం చేసినా.. బిల్లులో పలు లోపాలు ఉండడంతో నాటి గవర్నర్ ఆమోదించలేదు. ప్రస్తుత మంత్రివర్గం ఆ బిల్లును రీకాల్ చేసి ఆమోదం తెలపడంతో ములుగు మునిసిపాలిటీగా అవతరించేందుకు మార్గం సుగమమైంది. దీంతోపాటు ప్రస్తుతం మునిసిపాలిటీగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణాన్ని మునిసిపల్ కార్పొరేషన్‌గా మారుస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలిపి కొత్తగూడెం కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయనున్నారు.

నార్లాపూర్ రిజర్వాయర్ అంచనాల సవరణకు ఆమోదం

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన 6.4 టీఎంసీల సామర్థ్యం కలిగిన నార్లాపూర్ రిజర్వాయర్ సవరణ అంచనాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలుత రూ.884 కోట్లతో దీన్ని చేపట్టగా.. ఆ తర్వాత రూ.1448 కోట్లకు సవరించారు. తాజాగా రూ.1784 కోట్ల సవరణ అంచనాలకు ఆమోదముద్ర వేశారు. ఇదే పథకంలోని ప్యాకేజీ-3 నార్లాపూర్ నుంచి ఏదులకు నీటిని తీసుకెళ్లే ఓపెన్ కెనాల్ సవరణ ప్రతిపాదనలు నిబంధనల ప్రకారం లేని క్రమంలో.. మంత్రివర్గం వాటిని తిరస్కరించింది. మరోవైపు డిండి ఎత్తిపోతల పథకంలో రూ.1788.89 కోట్లతో ఏదుల రిజర్వాయర్ నుంచే నీటిని తరలించే(ఏదుల-డిండి) అలైన్‌మెంట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకంలో ఏదుల నుంచి శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తరలించనున్నారు.

దరఖాస్తులేకుండానే
'భరోసా'

- సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా
- 1.38 కోట్ల ఎకరాలకు రూ.8,300 కోట్లు అవసరం
- 26 నుంచి విడతల వారీగా రైతుల ఖాతాల్లో జమ
- 12లక్షల మంది కూలీలు.. ఉపాధి కార్డే ప్రాతిపదిక
- ఉగాది నుంచి సన్నబియ్యం.. క్యాబినెట్‌లో చర్చ

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పంటల సాగుతో సంబంధం లేకుండా సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం నిర్ణయించింది. పెట్టుబడి సాయం కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించరు. రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూములు ఎన్ని ఉన్నాయో అన్నింటికీ రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. సాగు భూములు ఎన్ని ఎకరాలు అనేది తేల్చేందుకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో పది రోజుల్లో సర్వే పూర్తి చేయాలని నిర్ణయించారు. రైతు భరోసాపై చర్చ సందర్భంగా గతంలో రైతుబంధు కింద 1.53 కోట్ల ఎకరాలకు సాయం అందిందని, అందుకు అయిన ఖర్చు రూ.7,665 కోట్లు అని లెక్క తేలింది. ప్రస్తుతం కొండలు, గుట్టలు, లేఅవుట్లు, సాగునీటి ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములను తొలగించి రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించారు.. ఇలాంటి భూములు పది శాతం ఉంటాయని ప్రభుత్వ అంచనా. ఇవి పోనూ సాగుభూములు సుమారు 1.38 కోట్ల ఎకరాలు ఉంటాయని ఇందుకు రైతు భరోసా కింద సుమారు రూ.8,300 కోట్లు అవసరపడతాయని శనివారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో అంచనా వేశారు. ఈ మొత్తాన్ని జనవరి 26 నుంచి దశల వారీగా రైతుల ఖాతాల్లో వేయనున్నారు. ఐటీ, ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు అనేది లేకుండా సాగులో ఉన్న అన్ని భూములకు పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు కూలీల విషయంపైనా మంత్రి మండలిలో చర్చ జరిగింది. ఉపాధి హామీ పథకం కింద నమోదు చేసుకున్న భూమిలేని కూలీలందరినీ ఈ పథకానికి అర్హులుగా గుర్తించాలని, ఇలాంటి వారు రాష్ట్రంలో 10 నుంచి 12 లక్షల మంది ఉంటారని అంచనా వేశారు. వీరికి ఒక విడతలో రూ.6 వేల చొప్పున, రెండు విడతల్లో ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనున్నారు. మరోవైపు రేషన్ ద్వారా సన్నబియ్యం ఇవ్వడాన్ని త్వరలోనే అమల్లోకి తీసుకువచ్చే అంశంపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. ఫిబ్రవరి లేదా మార్చిలో ఈ సన్నబియ్యం ఇవ్వడం ప్రారంభించాలని నిర్ణయించారు.

ఈ ఏడాది ఎలాంటి ఆంక్షలు లేకుండానే

రైతు భరోసా అంశంపై గతంలో రూ.10 వేలు ఉండగా దాన్ని రూ.2వేలు పెంచి రూ.12వేలు చేయడంపై చర్చ జరిగింది. రూ.14 వేలు ఇవ్వాలా? రూ.15 వేలు ఇవ్వాలా? అనే చర్చలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడ్డాక రాబోయే సంవత్సరాల్లో పెంచేలా చర్చ జరిగినట్లు తెలిసింది. ఈ ఏడాదికి అయితే ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడానికి వీలుగా నూతన ఇంధన విధానానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రానున్న కాలంలో 20వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంగా సోలార్, పంప్డ్ స్టోరేజ్, పవన విద్యుత్తు, బ్యాటరీ స్టోరేజ్‌ల రూపంలో గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహం అందివ్వనుంది. దీని కోసం ప్రభుత్వం రాయితీలను కూడా అందించాలని నిర్ణయించింది.

రోడ్డు ప్రమాదాల్లో రోజుకు 20 మంది మృతి

- రోడ్డు భద్రతపై అవగాహన కల్పించండి
- కలెక్టర్లతో సమీక్షలో మంత్రి పొన్నం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల్లో ప్రతి రోజూ రాష్ట్ర వ్యాప్తంగా 20 మంది ప్రాణాలు కోల్పోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారిలో యువతే ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. రోడ్డు భద్రతా విభాగంతోపాటు పోలీస్, ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసినప్పుడే ఈ పరిస్థితిలో మార్పు వస్తుందన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు జిల్లాల్లో అవగాహన సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పాఠశాల, కాలేజీలు, గురుకులాలు, వృత్తి శిక్షణ సంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మరోవైపు.. బీసీ సంక్షేమ శాఖలో అమలవుతున్న వివిధ పథకాలకు అవసరమైన నిధులు కేటాయించేందుకు నిర్దుష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి పొన్నం అధికారులను ఆదేశించారు. కాగా ఆర్టీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం కేక్ కట్ చేసి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఖాళీ అయిన వెంటనే ఉద్యోగాల భర్తీ: దుద్దిళ్ల

హైదరాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఖాళీ అయిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలోని 'టీజీ ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శనివారం జరిగిన 196 మంది అగ్నిమాపక శాఖ డ్రైవర్ ఆపరేటర్ల పాసింగ్ ఔట్ పరేడ్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గత పదేళ్లుగా నిలిచిపోయిన ఉద్యోగాల భర్తీని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం తిరిగి పట్టాలెక్కించింది. భర్తీ ప్రక్రియలో ఏర్పడిన న్యాయపరమైన ఇబ్బందులను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ నియామక పత్రాలను అందజేస్తున్నాం. ఈ అంశంలో మా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంది. హోంశాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయడంపై సీఎం రేవంత్ ప్రత్యేకంగా దృష్టి సారించారు" అని పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సేవలు అభినందనీయమని, ముఖ్యంగా ఖమ్మంలో వరదలు తలెత్తినప్పుడు వీరు కీలకంగా వ్యవహరించారని కొనియాడారు.

పోలవరం ముంపుపై అధ్యయనం

ఐఐటీ హైదరాబాద్‌తో చేయించాలి.. నెల రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలి

- గోదావరి-బనకచర్ల అనుసంధానంపై అభ్యంతరాలను ఏపీ దృష్టికి తీసుకెళ్లాలి
- జలశక్తి శాఖకు ఫిర్యాదు చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో తెలంగాణలో ఏర్పడే ముంపుపై ఐఐటీ హైదరాబాద్‌తో అధ్యయనం చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి నెల రోజుల్లో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలన్నారు. ఐఐటీ హైదరాబాద్‌తో సమన్వయం కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని నిర్దేశించారు. శనివారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఆ శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్‌తో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలవరం బ్యాక్‌వాటర్‌తో 954 ఎకరాలు ముంపునకు గురవుతాయని, అంతేకాకుండా భద్రాచలం ఆలయంతోపాటు మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్‌పై ప్రభావం పడే అవకాశాలున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పోలవరం నిర్మాణంతో భద్రాచలం దేవాలయానికి ఏర్పడే ముప్పుపై సమగ్ర అధ్యయనం చేయించాలన్నారు. 1986లో గోదావరికి 27 లక్షల క్యూసెక్కుల వరద వస్తే.. భద్రాచలం వద్ద 76.5 అడుగుల ఎత్తుతో నది ప్రవహించిందని, అదే 2022 ఆగస్టులో 24.50 లక్షల క్యూసెక్కుల వరద రాగా.. 71 అడుగుల ఎత్తుతో గోదావరి ప్రవహించిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. 2022లో వచ్చిన వరదతో ఏకంగా 106 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, 16 వేల ఇళ్ల నీట మునిగాయని వివరించారు. 1986లో వచ్చిన వరద కన్నా 2022 ఆగస్టు వరద తక్కువే ఉన్నప్పటికీ ముంపు తీవ్రత అధికంగా ఉందని గుర్తు చేశారు. దాంతో సమగ్ర అధ్యయనం కోసం ఐఐటీ హైదరాబాద్‌తో సర్వే చేసి, ఒక అభిప్రాయానికి రావాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధానాన్ని కూడా అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. వరద జలాల ఆధారంగా ఈ ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించిందని, దీనికి ఇప్పటిదాకా ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. అనుమతుల కోసం ఇటీవలే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించిందని చెప్పారు. దీంతో ఈ విషయంలో అభ్యంతరాలు ఏమున్నా ఏపీ సీఎస్ దృష్టికి తీసుకెళ్లాలని సీఎం అన్నారు. దీని వల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటే.. వ్యతిరేకిస్తూ కేంద్ర జలశక్తి శాఖకు ఫిర్యాదు చేయాలన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లు: సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం సచివాలయంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను డిప్యూటీ భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సర్కారీ బడుల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. కాగా, యాదగిరిగుట్టలో వచ్చే నెల 19 నుంచి 23 వరకు నిర్వహించే సుదర్శన దివ్యవిమాన స్వర్ణ గోపుర మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందింది. సచివాలయంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆలయ అధికారులు, అర్చకులు సీఎంకు ఆహ్వానం అందజేశారు. కాగా, అజ్మీర్ దర్గాకు ప్రభుత్వం తరఫున సీఎం చాదర్ సమర్పించారు. మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజ్మతుల్లా, ముస్లిం మత పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెట్టుబడులకు విశ్వనగరం

- ఆప్తా అంతర్జాతీయ సదస్సులో సీఎం రేవంత్
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మా విధానం: ఏపీ మంత్రి నాదెండ్ల



హైటెక్స్‌లో జరిగిన తెలుగు ఎన్నారైల గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విశ్వనగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవాసులను కోరారు. పెట్టుబడులు పెట్టి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సినిమా, రాజకీయ రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఐటీ, ఫార్మా, మౌలిక వసతుల రంగంతో పాటు ఏఐ, ఫ్యూచర్ సిటీ, మూసీ రివర్‌ఫ్రంట్‌లో అపరిమిత అవకాశాలు ఉన్నాయన్నారు. అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) అంతర్జాతీయ వ్యాపార సదస్సు శనివారం హెచ్ఐసీసీలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని, పెట్టే పెట్టుబడులకు సంపూర్ణ రక్షణ ఉంటుందని చెప్పారు. స్థానికంగా స్థిరపడ్డ ఆప్తా మిత్రులకు పార్టీ, ప్రభుత్వం తరఫున రాజకీయపరమైన అవకాశాలు కూడా కల్పిస్తామని, పూర్తి భరోసా ఇస్తామని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో విధానం అమలు చేస్తున్నామని, ఇప్పటికే పర్యాటక విధానం ప్రకటించామని చెప్పారు. ఈరోజు విద్యుత్తు విధానానికి సంబంధించి క్యాబినెట్‌లో అనుమతి తీసుకున్నామన్నారు. పెట్టుబడులకు మరిన్ని అవకాశాలు కల్పించడానికి నూతన విధానాలు తోడ్పడతాయన్నారు. కాగా, ఆప్తా సదస్సులో పలువురు రాజకీయ, సినీ, వ్యాపార వర్గాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అపూర్వంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు వస్తున్నాయని, అదే రీతిలో అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. విదేశాల్లో ఉన్న మనవాళ్లు ఇండియాకు తిరిగి వచ్చి ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఏపీలో విధానాలను సరళీకృతం చేసి అవకాశాలను పెంచామన్నారు. రాష్ట్రంలో పరిస్థితులను చక్కదిద్దుతున్నామని చెప్పారు. 'ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే రీతిలో తమ ప్రభుత్వం పనిచేస్తోందని, 21 రోజుల్లోనే ఎంవోయూలు చేసుకుంటున్నామని తెలిపారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కే లక్ష్మణ్ మాట్లాడుతూ భారతీయులు ఏ దేశంలో ఉన్నా స్వదేశంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్నారు. 'హైడ్రా' కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ మన దేశాన్ని మనమే బాగు చేసుకోవాలని, మనమే వ్యవస్థను సరిదిద్దుకోవాలన్నారు. ఇదే తెలంగాణలో హైడ్రా ఏర్పాటుకు కారణమని చెప్పారు. ప్రపంచమంతా కూడా ఈ మోడల్‌ను అనుసరించాలని అనుకుంటోందని ఐఎస్‌బీలో వ్యాసం రావడం సంతృప్తి కలిగించిందని తెలిపారు.

ఎకరానికి 12 వేలే ఇస్తామనడం దుర్మార్గం

- రైతు భరోసాపై కాంగ్రెస్ దగా: కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భరోసా పేరుతో రైతులకు ఎకరాకు రూ.12వేలే ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం అన్నదాతలను దగా చేయడమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం, ఆ తర్వాత ప్రజలను దారుణంగా మోసం చేయడం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం పేరుతో ప్రకటించిన మ్యానిఫెస్టోలో ప్రతి రైతుకు, కౌలు రైతుకు ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. గతంతో పోలిస్తే కాంగ్రెస్ పాలనలో రైతులు ఎకరాకు మరో రూ.2 వేలు నష్టపోయినట్లయిందన్నారు. భరోసా మొత్తాన్ని ఎంతమంది రైతులకు చెల్లిస్తారో ప్రకటించకపోవడం విడ్డూరమని సంజయ్ చెప్పారు. మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లుగా వెంటనే రూ.15 వేలు ఇవ్వకపోతే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకత్వంలో ఉద్యమం చేసి, ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. ఓట్ల కోసం అందరినీ వాడుకుని, అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

రైతులను దగా చేసిన కాంగ్రెస్ సర్కార్

- రైతు భరోసాను రైతు గుండెకోతగా మార్చారు: హరీశ్



హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'రైతుబంధు కింద ఇచ్చే పెట్టుబడి సాయాన్ని పెంచుతామని.. రైతు భరోసా కింద ఏటా ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఆశలు పెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడేమో ఎకరానికి రూ.12 వేలు ఇస్తామంటూ రైతులను దగా చేస్తోంది" అ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. క్యాబినెట్ సమావేశం ద్వారా ఈ సర్కారు రైతుల ఆశలను అడియాశలు చేసిందని ధ్వజమెత్తారు. రైతు భరోసాను రైతు గుండెకోతగా మార్చారని విమర్శించారు. ప్రతి సీజన్‌లో ఎకరానికి రూ.7,500 ఇస్తామని చెప్పి.. ఇప్పుడేమో రూ.6 వేలకు కుదించారని, కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి ఇది పరాకాష్ట అని ధ్వజమెత్తారు. మోసానికి పర్యాయ పదం రేవంత్ రెడ్డి అనేది బయటపడిందన్నారు. భూమి కలిగిన రైతులకే కాదు.. కౌలు రైతులకు సైతం రెండు సీజన్లకు కలిపి రూ.15000 పెట్టుబడి సాయం అందిస్తామని ప్రమాణం చేశారని, క్యాబినెట్‌లో ఆ విషయాన్నే ప్రస్తావించలేదన్నారు. కౌలు రైతుల గుండెలపై గుద్దారని వ్యాఖ్యానించారు. వానాకాలంలో ఎగ్గొట్టిన రైతు భరోసాను కూడా యాసంగితో కలిపి రూ.15 వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా, రైతులను కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందని, ఇది వంచన ప్రభుత్వమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.

సచివాలయ సంఘం కోశాధికారిగా కైలాసం

- సంయుక్త కార్యదర్శిగా రాజేశ్వర్.. కొనసాగుతున్న లెక్కింపు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయ సంఘం కోశాధికారిగా జీఏడీ సెక్షన్ ఆఫీసర్(ఎస్ఓ) వికైలాసం ఘన విజయం సాధించారు. ఉద్యోగుల సంఘానికి శనివారం మధ్యాహ్నం వరకు ఎన్నికలు జరగ్గా.. 1,101కు గాను.. 1,059 (96.18%) ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం నుంచి కౌంటింగ్ కొనసాగుతోంది. తొలి ఫలితం కోశాధికారి విభాగానికి రాగా.. తన సమీప ప్రత్యర్థి ముత్తారెడ్డి(126 ఓట్లు)పై కైలాసం(377) భారీ మెజారిటీని సాధించారు. సంయుక్త కార్యదర్శిగా రాజేశ్వర్(283 ఓట్లు) తన సమీప ప్రత్యర్థి రవీందర్(198)పై విజయం సాధించారు. కడపటి వార్తలందేసరికి అధ్యక్షుడు, కార్యదర్శితోపాటు.. మరో 7 పోస్టులకు కౌంటింగ్ కొనసాగుతోంది.

హెచ్‌ఎంపీవీపై భయం వద్దు

- రాష్ట్రంలో ఒక్క కేసు కూడా లేదు: వైద్య, ఆరోగ్య శాఖ

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటానిమో వైరస్) అనే వైరస్ కరోనా మాదిరిగా చైనాలో విజృంభిస్తోందన్న వార్తల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం అయింది. తెలంగాణలో ఇప్పటి వరకు హెచ్‌ఎంపీవీ కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి శనివారం ఓ ప్రకటన జారీ చేసిన వైద్య, ఆరోగ్య శాఖ.. శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యల వ్యాప్తి నేపథ్యంలో ప్రజలకు పలు సూచనలు చేసింది. ఫ్లూ లక్షణాలతో బాధపడుతున్న వారు తక్షణమే మాస్కులు ధరించాలని కోరింది. జలుబు, దగ్గు వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించింది. అస్వస్థతకు గురైన వారు ఇంటికి పరిమితమవ్వాలని కోరింది. కరచాలనాలు వద్దని, అనారోగ్యంతో ఉన్న వారికి దూరంగా ఉండాలని ప్రజలకు సూచించింది.

చైనా వైరస్ సీజనల్ సమస్యే : కేంద్రం

హెచ్‌ఎంపీవీ వైరస్ వ్యాప్తితో చైనాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి సీజనల్ సమస్యేనని, ఆందోళన చెందాల్సినది ఏమీ లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. హెచ్‌ఎంపీవీ ముప్పుపై అంచనాకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ నేతృత్వంలో శనివారం ఓ కీలక సమావేశం జరిగింది. ఇన్‌ఫ్లూయెంజ వైరస్, ఆర్‌ఎస్వీ, హెచ్‌ఎంపీవీ వ్యాప్తి ఈ సీజన్‌లో చైనాలో సాధారణమేనని సమావేశంలో పాల్గొన్న బృందం తేల్చిందని ప్రభుత్వం ప్రకటించింది. అయినప్పటికీ చైనాలో పరిస్థితిని సమీక్షిస్తున్నామని వెల్లడించింది.

15న బీటెక్ పరీక్షలు రద్దు

హైదరాబాద్ సిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న (కనుమ పండగ) ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడంలేదని, ఆ రోజు జరగాల్సిన పరీక్షలను ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసినట్లు జేఎన్‌టీయూ అధికారులు స్పష్టం చేశారు. ఈమేరకు కొత్త టైంటేబుల్‌ను శనివారం పరీక్షల విభాగం పోర్టల్‌లో పొందుపరిచారు. 'పండుగ వేళ పరీక్షలు.. విద్యార్థుల మండిపాటు' శీర్షికన శనివారం 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో ప్రచురితమైన వార్తకు జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ నెల 15న నిర్వహించతలపెట్టిన సెమిస్టర్ పరీక్షలను రద్దు చేయాలని పరీక్షల విభాగం అధికారులను ఆదేశించారు.

తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడి ఆత్మహత్య

- రెండు రోజులుగా గదిలోనే మృతదేహాలు

అడ్డగుట్ట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ తల్లే లోకంగా బతికిన ఆ కుమారుడు ఆమె మరణాన్ని జీర్ణించుకోలేక నీ వెంటే నేనంటూ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని లాలాపేట్‌లో జరిగింది. లాలాపేట్‌లో నివాసముండే లక్ష్మి కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె కుమారుడు అభినవ్ (28)కు కూడా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇద్దరు మానసికంగా కుంగిపోతున్నారు. మంచానపడి ఉన్న తల్లి రెండు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందింది. దాంతో ఆవేదనకు గురైన అభినవ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఇంటి తలుపులు బద్దలు కొట్టి చూడగా.. మంచంపై లక్ష్మి శవం, ఫ్యాన్‌కు వేలాడుతూ అభినవ్‌కనిపించారు. మృతదేహాలను గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్ ఖాళీ చేయండి

- ప్రజాప్రతినిధులకు సర్కారు నోటీసులు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ప్రజాప్రతినిధులు, మంత్రులకు తెలంగాణ అసెంబ్లీ అధికారులు శనివారం నోటీసులు ఇచ్చారు. వసతి సముదాయాన్ని ఖాళీ చేయాలని కోరారు. సిటింగ్ ఎమ్మెల్యేలకు హైదరగూడలోని నూతన వసతి సముదాయాన్ని కేటాయిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం ఆదర్శనగర్‌లో ఉన్న సముదాయ ఆవరణలో కాన్‌స్టిట్యూషనల్ క్లబ్ నిర్మించబోతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ సహా అన్ని క్వార్టర్స్‌లో ఉంటున్న వారికి నోటీసులు ఇచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు సముదాయంలో ఉన్న దుకాణాలను కూడా ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీల కోసం ప్రభుత్వం కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ జనవరి 1న 'ప్రజాప్రతినిధులకు కాన్‌స్టిట్యూషన్ క్లబ్' శీర్షికతో పత్రికలో కథనం ప్రచురితమైంది. ఆదర్శనగర్‌లో ఉన్న ఎమ్మెల్యే క్వార్టర్స్ ఆవరణలో 4 ఎకరాల్లో ఈ క్లబ్ నిర్మించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మేథోపరమైన చర్చలు, సమావేశాలకు ఈ క్లబ్ వేదిక కానుందనేది అధికారుల సమాచారం.

ఇబాదత్ ఖానా కమిటీని తొలగించండి

- నిర్వహణ తీసుకోండి.. వక్ఫ్ బోర్డుకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పాతబస్తీ దారుల్‌షిఫాలోని ఇబాదత్ ఖానా (ఆరాధనా గృహం)ను ప్రత్యక్ష నిర్వహణలోకి తీసుకోవాలని తెలంగాణ వక్ఫ్‌బోర్డుకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. వక్ఫ్ చట్టానికి విరుద్ధంగా ప్రస్తుతం అక్రమంగా కొనసాగుతున్న ముత్తవల్లీ కమిటీని తొలగించాలని స్పష్టం చేసింది. ఆ ఆరాధనా గృహంలోకి మహిళలకు అనుమతించాలని సూచించింది. వక్ఫ్‌ఆస్తి అయిన ఇబాదత్ ఖానాపై ప్రస్తుత ముత్తవల్లీ కమిటీ అక్రమంగా పెత్తనం చెలాయిస్తోందని, చట్టవిరుద్ధంగా కొనసాగుతోందని పేర్కొంటూ అంజుమన్-ఏ-అల్వీ సొసైటీ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఇబాదత్ ఖానాను ప్రత్యక్ష నిర్వహణలోకి తీసుకోవాలని వక్ఫ్‌బోర్డుకు ఆదేశాలు జారీ చేసింది. ఆ సంస్థకు కొత్త మేనేజ్‌మెంట్ కమిటీని నియమించాలని పేర్కొంది. కొత్త కమిటీలో షియా వర్గంలోని అక్బరీ శాఖకు, వుసూలీ శాఖను సమాన ప్రాతినిధ్యం ఉండేలా చూడాలని స్పష్టం చేసింది.

లగచర్ల ఘటనలో విచారణ వేగవంతం

- రెండోసారి పోలీసుల కస్టడీకి ఏ-2 సురేశ్‌రాజ్

బొంరాస్‌పేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో అధికారులపై దాడి ఘటనలో అసలు విషయం రాబట్టేందుకు పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ ఘటనలో ఏ2 నిందితుడు బోగమోని సురేశ్‌రాజ్‌తో పాటు శివకుమార్‌ను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో విచారించినట్లు సమాచారం. దాడికి ఎవరు ప్రేరేపించారు? ఎందుకు దాడికి పాల్పడాల్సిన అవసరం వచ్చింది, దాడులకు సూత్రధారులు ఎవరు? ఎవరికి రాజకీయ ప్రయోజనం చేకూరుతుందని అనుకున్నారు? అనే కోణాల్లో వారిని విచారించినట్లు సమాచారం. పూర్తి విచారణ కోసం సురేశ్‌రాజ్‌ను మూడు రోజులు, శివకుమార్‌ను మరో రెండు రోజులు పోలీసులు విచారించనున్నారు.

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో పేలుడు

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు
- యాదాద్రి భువనగిరి జిల్లా పెద్దకందుకూర్‌లో ఘటన





ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ, కనకయ్య (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూర్‌లోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో శనివారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఒక కార్మికుడు మృతి చెందగా, మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. శనివారం ఉదయం 9.45 గంటల ప్రాంతంలో పీఆర్‌డీసీ విభాగం-3లోని (ఎంటీవీ) మెగ్నీషియం, టెఫ్లాన్, వైటాన్ అనే మూడు రసాయన పదార్థాలను (మొత్తం 450 గ్రాములు) కొలిచే సందర్భంలో భారీ పేలుడు సంభవించింది. ఈ సమయంలో విధులు నిర్వహిస్తున్న జనగాం జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన మార్క కనకయ్య (54) మృతి చెందగా.. యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామానికి చెందిన మొగిలిపాక ప్రకాష్, వగపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు, వేణుగోపాల్ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో హుటాహుటిన వారిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్‌స్టేషన్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఎంటీవీ రసాయన పదార్థాలను కొలిచే సందర్భంలో గ్యాస్ ఎనర్జీతో పేలుడు సంభవించిందని కంపెనీ ఆపరేషన్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ విభాగంలో 16 మంది పనిచేస్తుండగా.. 10మంది కార్మికులు భోజనానికి బయటికి వచ్చారని, మరో నలుగురు అక్కడే ఉండి విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఘటనపై పూర్తి విచారణ తర్వాత ప్రమాదానికి కారణాలు వెల్లడిస్తామన్నారు. కాగా, మృతిచెందిన కార్మికుడు కనకయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా.. కుమార్తె లండన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కనకయ్య 30 ఏళ్లుగా ఈ కంపెనీలో పని చేస్తున్నాడు.

ఇప్పటివరకు నలుగురి మృత్యువాత..

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీని 1985లో స్థాపించారు. నాటి నుంచి ఇప్పటివరకు పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. 2011లో పేలుడు సంభవించినప్పుడు ఇద్దరు కార్మికులు, 2019లో మరో కార్మికుడు, ప్రస్తుత ప్రమాదంలో కనకయ్య మృతిచెందారు. దీంతో కార్మికుల్లో కొంత వరకు భయాందోళన మొదలైంది. ఈ కంపెనీ ప్రధానంగా ఎంటీవీని ఉత్పత్తి చేసి భారత రక్షణ దళాలకు సరఫరా చేస్తుంది.

చర్యలు తీసుకుంటాం: బీర్ల అయిలయ్య

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో పేలుడు విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఘటనా స్థలానికి చేరుకొని కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంపెనీ కేవలం లాభాలకోసం చూస్తుందే తప్ప కార్మికుల భద్రతను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. అనంతరం భువనగిరిలో చికిత్స పొందుతున్న కార్మికులను ఆయన పరామర్శించారు. కాగా పేలుడు విషయం తెలుసుకున్న స్థానిక ఏసీపీ రమేష్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు.



కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో పొగ మంచు మాటున సూర్యుడు

గజగజ

- సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 6 డిగ్రీలు
- ఈ సీజన్‌లోనే అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు
- సిర్పూర్‌లో 6.1 డిగ్రీలు
- రాష్ట్రంలో విజృంభిస్తోన్న చలిపులి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకి అధికమవుతోంది. ముఖ్యంగా రాత్రి పూట అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో శనివారం ఉదయం 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటిదాకా రాష్ట్రంలో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత ఇదే. కోహీర్‌లో గత ఏడాది ఇదే రోజున 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి. కోహీర్‌లో 6 డిగ్రీలు, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో 6.1, తిర్యాణి మండలం గిన్నెధరిలో 6.2, ఆదిలాబాద్ జిల్లా అర్లి(టి)లో 6.2, సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 6.3, కామారెడ్డి జిల్లా డొంగ్లి మండలం 6.8, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 6.8, షాబాద్ మండలం చందనవల్లిలో 6.8, ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో 6.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దాదాపు 15 జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు పది డిగ్రీలలోపునకు పడిపోయాయి. మరోవైపు, రాష్ట్రంలో పలు జిల్లాల్లో శీతలగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శనివారం హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శనివారం శీతల గాలులు వీచాయని తెలిపింది. అలాగే రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. అలాగే, రాబోయే ఐదు రోజులు పలు జిల్లాల్లో ఉదయం వేళ పొగ మంచు ప్రభావం ఉంటుందని వాతావరణ కేంద్రం తెలిపింది.

పరిగిలో పావురాల రేసు

- ఏపీ నుంచి బాక్సుల్లో కపోతాలను తెచ్చి గాల్లోకి వదులుతుండగా పట్టివేత
- 16 బాక్సుల్లో 300కుపైగా పావురాలు
- 500 కి.మీ.కు రేసు.. లక్షల్లో పందాలు!
- పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు

పరిగి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఇప్పటివరకు కోడి పందాలు మొదలు ఆన్‌లైన్ బెట్టింగ్‌ల దాకా చూశాం. వాటిపై భారీగా డబ్బు చేతులు మారుతుంటుందనీ తెలుసు. తాజాగా వికారాబాద్ జిల్లా పరిగిలో కొందరు వ్యక్తులు పావురాల రేసు నిర్వహిస్తుండడం వెలుగుచూసింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లా గోరంట్ల ప్రాంతానికి మునావర్, బాబు జానీ కలిసి ఓ వాహనంలో 16 బాక్సుల్లో పావురాలను పరిగికి తీసుకొచ్చారు. ఒక్కో బాక్సులో ఇరవై వరకు... మొత్తం 300కుపైగా పావురాలు ఉన్నాయి. స్థానికులు వారిని ప్రశ్నించగా పావురాలకు శిక్షణ ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. తర్వాత పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకుని వాహనాన్ని, పావురాల బాక్సులను స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాక్సులకు, పావురాల కాళ్లకు కోడింగ్ ఉంది. దీంతో రేసింగ్ కోసమే తెచ్చినట్లు తెలుస్తోంది. నిందితులు మొదటగా రకరకాలుగా సమాధానాలు చెప్పినా చివరకు పావురాలను రేసింగ్ కోసమే తెచ్చామని ఒప్పుకున్నట్లు తెలిసింది. పరిగిలో వదిలిన పావురాలు వారు నిర్ణయించిన సమయంలో ఎంచుకున్న కేంద్రానికి చేరుకుంటే అవి ఎవరివో ఆ వ్యక్తి గెలిచినట్లు అని చెబుతున్నారు. దీనిపై లక్షల రూపాయల్లో పందాలు కాస్తున్నారని తెలిసింది. పరిగికి తీసుకొచ్చిన పావురాలతో 500 కి.మీ. దూరం రేసింగ్ పెట్టుకున్నట్లు సమాచారం. ఈ కేసు విషయంలో వివరణ కోరగా పోలీసులు స్పందించలేదు.



బాక్సుల్లో పావురాలు

అక్రమ నిర్మాణాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్



అక్రమ నిర్మాణం వద్ద రంగనాథ్

హైదరాబాద్, బేగంపేట, మోతీనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా నిర్మించిన భవనాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శనివారం పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ నోటీసులు, హైకోర్టు ఉత్తర్వులు పట్టించుకోకుండా సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి ఐదంతస్తుల భవనాన్ని నిర్మించడంపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ ఆ భవనాన్ని పరిశీలించారు. నోటీసులు ఇచ్చినా లెక్క చేయకుండా నిర్మించినందుకు త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

బాలికల వాష్‌రూంలో సెల్ కెమెరా!

- పాలమూరు పాలిటెక్నిక్ కాలేజీలో ఘటన
- ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా మౌనం
- ఏబీవీపీ నేతలు, విద్యార్థుల ఆందోళన
- నిందితుడి అరెస్టు.. ప్రిన్సిపాల్‌పైనా చర్యలకు డిమాండ్..



కళాశాలలో ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, పాలిటెక్నిక్ విద్యార్థులు

మహబూబ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వసతి గృహం వాష్‌రూంకు వెళ్లిన బాలిక అక్కడ కెమెరా ఆన్ చేసి ఉన్న సెల్‌ఫోన్ కనిపించడంతో దిగ్భ్రాంతికి గురైంది. ఆ వ్యక్తి ఎవరో గుర్తించి.. పోలీసులకు పట్టిస్తారనే ఆశతో తండ్రి వయసున్న ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసింది. ఆ ప్రిన్సిపల్ మాత్రం ఆ ఫోన్‌ను తీసుకొని, తన దగ్గరే అట్టి పెట్టుకొని, ఏమీ జరగనట్టుగా ఉండిపోయాడు. ఫిర్యాదు చేసి రెండు గంటలైనా పోలీసులకు ప్రిన్సిపల్ సమాచారం ఇవ్వకపోవడం.. అప్పటికే ఘటనపై కలకలం రేగడంతో కళాశాల విద్యార్థులంతా ప్రిన్సిపల్ గది ఎదుట బైఠాయించారు. పాలమూరు పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఈ దారుణం వెలుగుచూసింది. ఏబీవీపీ నాయకులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని విద్యార్థులకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన సిద్ధార్థ్ అనే పాత విద్యార్థి బ్యాక్‌లాగ్స్ రాయడానికి రెండ్రోజుల క్రితమే ఈ కళాశాలకు వచ్చాడు. అతడే తన సెల్‌ఫోన్ కెమెరా ఆన్‌చేసి హాస్టల్ వాష్‌రూమ్‌లో ఉంచాడని, అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నేతలతో పాటు విద్యార్థులు డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటలపాటు చేపట్టిన ధర్నాతో కళాశాల దద్దరిల్లింది. పోలీసులు, కళాశాల నిర్వాహకులు నిందితుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. తాము ఫిర్యాదు చేశాక, సెల్‌ఫోన్‌ను గమనించి 2గంటలైనా కూడా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ప్రిన్సిపల్ కాలయాపన చేశారని, గదిలోకి ఎవ్వరినీ రానివ్వలేదని, ఆయనపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. జరిగిన ఘటనపై విచారణ చేస్తామని, కేసు నమోదుచేసి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని హామీ ఇచ్చారు. కాగా ఆందోళన జరుగుతుండగానే ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్ పోయిందని ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేయడంతో అతడే ఈ పనిచేసి ఉంటాడనే అనుమానం వ్యక్తమైంది. వాష్‌రూమ్‌లో లభించిన ఫోన్ అతడిదేనని తేలడంతో పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

రక్తదానంతో ఆ పిల్లల్ని బతికించరూ!

- తలసీమియా బాధితులకు రక్తం కొరత
- దాతలు ముందుకు రావాలని సికిల్‌సెల్ సొసైటీ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తలసీమియా చిన్నారులు రక్తం దొరక్క గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ప్రతి 15 నుంచి 20 రోజులకు ఒకసారి రక్తం ఇస్తే తప్ప ఆ చిన్నారుల మనగడ ముందుకు సాగదు. అయితే దాతలు పెద్దగా ముందుకు రాకపోవడంతో రక్తానికి ఇప్పుడు తీవ్ర కొరత ఏర్పడింది. ప్రతి నెల 2500 నుంచి 3000 యూనిట్ల రక్తం అవసరమవుతుండగా ప్రస్తుతం కేవలం 1000 నుంచి 1200 యూనిట్ల వరకే రక్తం లభిస్తోందని రాజేంద్రనగర్‌లోని సికిల్‌సెల్ సొసైటీ నిర్వాహకులు పేర్కొంటున్నారు. తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీలో ప్రస్తుతం 4200 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. ఇందులో ప్రతిరోజు 60 నుంచి 70 మంది వరకు పిల్లలకు రక్తం ఇస్తుండాలి. కానీ ప్రస్తుతం 20 నుంచి 30 మంది చిన్నారులకు మాత్రమే రక్తం లభిస్తోంది. 14 ఏళ్ల లోపు పిల్లలకైతే ఒక యూనిట్, 15 ఏళ్లపైబడిన వారికైతే రెండు యూనిట్ల రక్తం అవసరమవుతుంది. కొంత మందికి రెండు వారాలకు ఒకటి నుంచి రెండు యూనిట్ల రక్తం ఇస్తే కానీ వారి మనగడ కష్టం. ఇలా ఏడాదికి కనీసం 12 నుంచి 24 సార్లు రక్తం ఎక్కించాల్సిందే. రక్తం కొరత ఏర్పడటంతో తెలిసిన వారిని ఒప్పించి మరీ రక్తదానం చేయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ నిర్వాహకులు చెబుతున్నారు. రక్తదానానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తలసీమియా బాధితులకు అండగా నిలవాలని, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులూ ముందుకొచ్చి బాధితులకు రక్తం అందించాల్సిగా కోరుతున్నారు.

ఆ పిల్లలకు రక్తం అత్యవసరం



తలసీమియా సికిల్ సెల్ సొసైటీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తం కొరత తీవ్రంగా ఉంది. దీంతో తలసీమియా బాధితులకు అత్యవసరంగా రక్తదానం అవసరమైంది. అన్ని బ్లడ్ గ్రూప్ దాతలు ముందుకొచ్చి బాధితులను ఆదుకోవాలి. దాతల సాయం కోసం ప్రతి చిన్నారి ఎదురుచూస్తున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి బాధితులకు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి. కాలేజీల విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగులు సహకరించాలి. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి దానం చేయాలి. ఆసక్తి గల వారు 9246534913, 8885534913 నంబర్లకు సంప్రందిస్తే అవసరమైన ఏర్పాట్లు చేస్తాం.

-అలీంబేగ్, సంయుక్త కార్యదర్శి, తలసీమియా అండ్ సికెల్‌సెల్ సొసైటీ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.